SAPTHAGIRI (TELUGU)
ILLUSTRATED MONTHLY
Volume: 52, Issue: 9
February-2022, Price Rs.5/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

ఫిబ్రవరి 2022
వెల రూ.5/-
పుటలు-56



తిరుమలలో రథసప్తమి 08-02-2022



తిరుమల తిరుపతి దేవస్థానములు

# శ్రీనివాసమంగాపురం
# శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

**2022 ఫిబ్రవరి 19 నుండి 28 వరకు**





**19-02-2022 శనివారం**

పగలు: ---------

రాత్రి: సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ

**20-02-2022 ఆదివారం**

పగలు: తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం

రాత్రి: పెద్దశేష వాహనం

**21-02-2022 సోమవారం**

పగలు: చిన్నశేష వాహనం

రాత్రి: హంసవాహనం

**22-02-2022 మంగళవారం**

పగలు: సింహ వాహనం

రాత్రి: ముత్యపుపందిరి వాహనం

**23-02-2022 బుధవారం**

పగలు: కల్పవృక్ష వాహనం

రాత్రి: సర్వభూపాల వాహనం

**24-02-2022 గురువారం**

పగలు: పల్లకీలో మోహినీ అవతారోత్సవం

రాత్రి: గరుడవాహనం

**25-02-2022 శుక్రవారం**

పగలు: హనుమద్వాహనం,

సా. వసంతోత్సవం

రాత్రి: గజవాహనం

**26-02-2022 శనివారం**

పగలు: సూర్యప్రభవాహనం

రాత్రి: చంద్రప్రభవాహనం

**27-02-2022 ఆదివారం**


పగలు: రథోత్సవం

రాత్రి: అశ్వవాహనం

**28-02-2022 సోమవారం**

పగలు: పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం, చక్రస్నానం

రాత్రి: తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।
కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 32వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** కృష్ణ!= హే కృష్ణా!; విజయం= విజయమును; కాంక్షే= కోరుట, న=లేదు, చ=మరియు; రాజ్యం=రాజ్యమును; చ=మరియు; సుఖాని=సుఖములను, న=(కోరటం) లేదు, గోవింద=హే గోవిందా!; నః= మాకు; రాజ్యేన=రాజ్యముతో; కిం=ఏమి లాభము; భోగైః=భోగములచేత గాని, జీవితేన వా= బ్రతుకుటచేత గాని, కిం?= ఏమి లాభము?

**భావం:** ఓ కృష్ణా! నేను విజయము గాని, రాజ్యము గాని, సుఖములు గాని కోరుకోవటం లేదు. గోవిందా! ఈ రాజ్యమువలన గాని, ఈ భోగమువలన గాని, ఈ జీవితమువలన గాని ఏమి ప్రయోజనము?

## కలవంటిది బదుకు “ఘనునికిని”


తెలిసితే మోక్షము తెలియకున్న బంధము
కలవంటిది బదుకు ఘనునికిని

అనయము సుఖమేడ దవల దుఃఖమేడది
తనువుపై నాసలేని తత్త్వమతికి
పొనఁగితేఁ బాపమేది పుణ్యమేది కర్మమందు
వొనర ఫలమొల్లని యోగికిని

తగిన యమృతమేది తలఁపఁగ విషమేది
తెగి నిరాహారియైన ధీరునికిని
పగవారనఁగ వేరి బంధులనఁగ వేరీ
వెగటు ప్రపంచమెల్ల విడిచే వివేకికి

వేవేలువిధులందు వెఱుపేది మఱుపేది
దైవము నమ్మినయట్టి ధన్యునికిని
శ్రీవేంకటేశ్వరుఁడు చిత్తములో నున్నఁవాడు
యీవలేది యావలేది యితనిదాసునికి

(సంపుటము - 02, సంకీర్తన - 19)



ఈ కీర్తనలో పదకవితాపితామహుడైన అన్నమయ్య - ‘జ్ఞానాదేవ హి కైవల్యం’- జ్ఞానము వల్లనే మోక్షం, జ్ఞానమే మోక్షం అని జ్ఞానియైన వాని స్థితిని వర్ణించిన తీరు అమోఘం.

జ్ఞానమే మోక్షం- అజ్ఞానమే బంధం. ఘనుడు అంటే జ్ఞాని. జ్ఞానికి ఈ జీవితం కలలా కనిపిస్తుంది. అంటే అసత్యమని తెలుస్తుంది. శరీరం మీద ఆశలేని తత్త్వవేత్తకు సుఖమూ లేదు దుఃఖమూ లేదు. ఫలాన్ని ఆశించని యోగికి పాపమూ-పుణ్యమూ రెండూ పుట్టవు. ఉభయకర్మలకు అతీతమైనది మోక్షం.



నిరాహారి అయిన ధీరునికి అమృతమూ- విషమూ సమానమే. లోకం మిథ్య అని తెలిసిన వివేకికి పగవారూ- బంధువులూ అని ఉండరు. సర్వ సమత్వస్థితి అతనిది. దైవాన్ని నమ్మిన ధన్యజీవికి వెఱపు (భయం)- మఱపూ రెండూ సమానమే. శ్రీ వేంకటేశ్వరుని మనసులో నిలుపుకొన్న దాసుని చిత్తం అటూ-ఇటూ మరలక ఏకాగ్రతతో ఉంటుంది.


ద్వంద్వాలకు అతీతుడైన జ్ఞానభక్తి యోగి యొక్క స్థితిని స్పష్టపరచాడు అన్నమయ్య ఈ కీర్తనలో.

# మహిమాన్విత ‘మహామాఘి’

- శ్రీ చల్లా జయదేవానంద

ఆకాశంలో పల్లకీ ఆకారంలో ఉండే ఐదునక్షత్రాల గుంపును **‘మఘా’**నక్షత్రమని అన్నారు మన పెద్దలు. అయితే ఈ పల్లకీ నక్షత్రాల గుంపునుంచి చంద్రుడు మాఘపౌర్ణమి నాడు తన పదహారు కళలతో ప్రకాశిస్తూ సాగిపోవడమనేది ఏడాదికి ఒక్కసారి మాత్రమే జరుగుతుంది. ఈ అరుదైన దృగ్విషయాన్ని పంచాంగకర్తలు **‘మహామాఘి’** అని అన్నారు.

ఈ మహామాఘిలో అనేకానేక ప్రత్యేకతలున్నాయి. ఈ రోజున ప్రాతఃస్నానం, తిలదానం, హెూమం, కంచుపాత్ర, కంబళ్ళు అనే ప్రత్యేక విధులను నిర్వర్తించినట్ల యితే అనంత పుణ్యఫలంతో పాటు, ఆయురారోగ్యాలు కూడ ఒనగూడతాయని శాస్త్రవచనం. ముఖ్యంగా ఈరోజున శ్రీకాళహస్తిలోని స్వర్ణ ముఖినదిలో చేసే స్నానం త్రివేణీసంగమంలో స్నానం చేసినంత ఫలితాన్ని కలిగిస్తుంది. ఈ మహామాఘిరోజునే సతీదేవి జన్మించిందని పురాణకథనం.



శక్తి స్వరూపిణి అయిన ఈశ్వరి ఒకసారి దక్షిణావర్తపు శంఖరూపాన్ని ధరించి, సరయూనదిలోని కాళింది మడుగులోని ఒక పద్మంలో విశ్రాంతి తీసుకోసాగింది. సరిగ్గా అదే సమయంలో దక్షప్రజాపతి ఆ మడుగులో స్నానం చేస్తూ, నీటిలో ఉన్న ఆ పద్మాన్ని శివపూజకు కోసాడు.

అలా కోయడంతో పద్మంలో ఉన్న శంఖం బయట పడింది. ఎంతో శుభప్రదమైన ఆ శంఖాన్ని దక్షుడు స్పృశించ గానే అది ఒక చక్కని బాలిక రూపాన్ని ధరించింది. ఈ సంఘటన మాఘపూర్ణిమరోజునే జరిగింది. ఈ కారణంగా మహామాఘికి పవిత్రత ఆపాదించబడింది. తమిళభక్తిసాహిత్యం ప్రకారం, ఈ మాఘపూర్ణిమనాడే కుమారస్వామి, తన తండ్రి శివునకు కుంభకోణం వద్ద ఉన్న స్వామిమలపై, మహామాఘి అనే కోనేటి తీరాన తత్త్వాన్ని బోధించాడు.

మన దేశంలోని పవిత్రనదులైన గంగా- గోదావరి- యమున- కృష్ణ- కావేరి- నర్మద- సరస్వతులు- ఈ మహా మాఘినాడు కుంభకోణంలోని కోనేరులో ప్రవేశిస్తాయని, కాబట్టి ఈ పండుగరోజున ఇక్కడ చేసే స్నానం సప్తనదీ స్నానాలపెట్టుగా తమిళులు భావిస్తుంటారు. ఈ పండుగ రోజున ఇక్కడ కొన్ని లక్షలమంది ఈ కోనేట్లో స్నానాలను చేస్తారు. తెలుగునాట ద్రాక్షారామంలోని సప్తగోదావరి కోనేట్లో ఈ మహామాఘి స్నానాలు జరుగుతాయి.

మఘానక్షత్ర అధిదేవత బృహస్పతి (గురుగ్రహం). కాబట్టి ఈరోజున బృహస్పతిని పూజించాలి. మహామాఘి కోనేటిలో జరిగే స్నానాలను చూసినట్లయితే, కోనేట్లో స్నాన పరుల తలలు తప్ప కోనేటిలోని నీరు కనిపించదు. ఈ మహా మాఘినాడు బ్రహ్మవైవర్త పురాణాన్ని దానం చేసినవారికి బ్రహ్మ లోకప్రాప్తి తథ్యమని శాస్త్రవచనం.



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి॥


50 వసంతాల 1970-2020

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 52 ఫిబ్రవరి, 2022 సంచిక : 09


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| మహిమాన్విత 'మహామాఘి' | శ్రీ చల్లా జయదేవానంద | 04 |
| సప్తగిరీశుడి సేవలో.. సప్తాశ్వరథారూఢుడు | శ్రీ జె.అనిల్ కుమార్ | 07 |
| శ్రీపంచమి | శ్రీ అప్పరుసు రమాకాంతరావు | 10 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి.హేమంతకుమార్ | 11 |
| కుమారధారాతీర్థం | శ్రీ బి.వి.రమణ | 14 |
| భారతీయ వేదసంపద | శ్రీ ఎమ్.వి.అవధాని | 17 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 19 |
| జ్ఞానమార్గ సాధకుడు "శుకదేవుడు" | కీ.శే. జానమద్ది హనుమచ్ఛాస్త్రి | 21 |
| శ్రీరంగవైభవం | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 23 |
| ఆనందనిలయుని తిరుచాన శ్రీఅలమేలుమంగ | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 31 |
| శ్రీమద్భగవద్గీత | ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ | 35 |
| తిరుమల తొలిగడప 'దేవునికడప' | డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు | 36 |
| హరిదాసవాఙ్మయంలో... శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 39 |
| భీష్మ సందేశం | శ్రీ కె.లక్ష్మీనారాయణ | 41 |
| కరుణించిన దైవం | ఎ. భవాని | 43 |
| సర్వప్రాణి హితైషిణి 'సులక్షణ' | ఆచార్య కోలవెన్ను మలయవాసిని | 44 |
| శ్రీకృష్ణజననం-అక్షరమాల | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 46 |
| అల్లంతో ఆరోగ్యం పదిలం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 47 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 48 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 49 |
| కల్యాణ వేంకటేశ్వరుడు (చిత్రకథ) | కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు : శ్రీ పి.తులసీప్రసాద్ | 50 |
| కృష్ణయ్య నిజాయితీ | శ్రీమతి ఎన్.రత్నావతీ రామారావు | 52 |
| దాసరందరే... పురందరదాసరయ్య | ఆచార్య ఎస్.గంగప్ప | 53 |
| బాలవినోదం | నిర్వహణ: డా॥ అల్లాడి సంధ్య | 54 |


ముఖచిత్రం : రథసప్తమినాడు సూర్యప్రభవాహనంలో శ్రీవారు, తిరుమల

వెనుక చిత్రం : శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారు, శ్రీనివాసమంగాపురం


గౌరవ సంపాదకులు
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

సంపాదకులు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకురాలు
డా॥ అల్లాడి సంధ్య
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

ముద్రాపకులు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు

సప్తగిరి మాస పత్రిక

0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333





వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# జగతికి ఆత్మ "సూర్యుడే"

"యాదృగేవ దదృశే తాదృగుచ్యతే"– ఎలా కనబడుతుందో అలా చెప్పబడుతుంది. ఈ మాట సూర్యుని ఉద్దేశిస్తూ 'ఋగ్వేదం' చెప్పిన మాట.

సూర్యుడు ఉదయించాడని, అస్తమించాడని, గమనం సాగిస్తున్నాడని మనం పురాణాల్లో చెప్పేది పై వాక్యం ఆధారంగానే. ఎలాంటి వారి గురించైనా మన అనుభవం బట్టి మాట్లాడుతాం. సూర్యునికి "స్థాణుః", "స్థిరః" అనే పేర్లను వేదమే పేర్కొనింది. 'కదలనివాడు' అని ఈ పదాలకు అర్థం. అయితే ఆయన కదలకున్నా మనకు కదలినట్లే కనిపిస్తున్నాడు. కదులుతున్న భూమి కదలనట్లు కనిపిస్తోంది. ఇందులో ఏది నిజం? రెండూ నిజమే. ఏ స్థితిలో ఉన్న వారికి ఆ స్థితే నిజం. అంటే ఏది కదులుతున్నట్లు? ఏది కదలనట్లు? ఏదీ తేల్చలేం.

అందుకే ఈశావాశ్యోపనిషత్తు– *"తదేజతి తన్నైజతి"*– అది కదులుతోంది, కదలడం లేదు. *"తద్దూరే తద్వంతికే"*– అది దగ్గరగా ఉంది, దూరంగా ఉంది. *"తదన్తరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః"*– అన్నిటికీ లోపల ఉన్నదదే, అన్నిటికీ బయట ఉన్నదదే అని పేర్కొంటోంది.

వేదాన్తజ్ఞానాన్ని స్పష్టం చేయడానికి సూర్యునే గ్రహించి ఎన్నో సాదృశ్యాలు చెప్పారు. సూర్యుని ఆకర్షణ శక్తి లేకుంటే భూమికి కదలికే లేదు. కానీ ఆ సూర్యుడు కదలడం లేదు. అంటే చైతన్యం సూర్యునిదా? భూమిదా? అని ప్రశ్నిస్తే, భూమిలో కనిపించే కదలిక అంతా సూర్యుని నుండి గ్రహించినదే అని విజ్ఞాన అవగాహనతో సమాధానం చెప్పవచ్చు.

అలాగే మానవ దేహానికి కదలికనిచ్చే నిజమైన చైతన్యం "ఆత్మ". అందుకే 'చైతన్య మాత్మా' అని భారతీయ దర్శనాలు పేర్కొంటున్నాయి. మనం చూస్తూ ఉన్న జగతికి ఆత్మ సూర్యుడేనని– *"సూర్య ఆత్మా జగతః"* అని వేదం స్పష్టం చేసింది.

సూర్యుని కిరణాల వల్ల నీరూ ప్రకాశిస్తుంది. రాయీ చూడబడుతుంది. చెట్లూ కనిపిస్తాయి. పువ్వులూ వికసిస్తాయి. కానీ నీటి లక్షణంగానీ, రాయి స్వభావంగానీ, చెట్ల రంగులుగానీ, పూల వాసనలుగానీ ఆ సూర్యకిరణాలకు, సూర్యునకు అంటవు. అలాగే భగవంతుడు మనలో ఉంటూనే వేటికీ అంటడు. ఇలా రకరకాలుగా సూర్యుని పోలికతో 'ఆత్మతత్త్వాన్ని' వివరించారు మన మహర్షులు.

*"యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః"*– ఒకే సూర్యుడు సమస్త జగత్తును ప్రకాశింపజేస్తున్నట్లు, క్షేత్రజ్ఞుడు క్షేత్రాన్ని చైతన్యవంతం చేస్తున్నాడన్న గీతావాక్యం అక్షర సత్యం.

ఈ విధంగా సూర్యశక్తి పరిశీలనతో మనం అనుభవిస్తున్న విశ్వరహస్యాలు తెలుస్తాయి. మన సాధనల కాలపరిణామాలన్నీ సూర్యుని అనుసరించి ఏర్పాటు చేసుకున్నవే. మన పెద్దవాళ్ళు ప్రాతఃకాలం నుండి సాయం సంధ్యవరకు వివిధ కాలాల్లో వివిధోపాసనలను సూర్యునిలోని వివిధ దైవీశక్తులను దర్శించి ఏర్పరచినవే 'సత్సంప్రదాయాలు'.

ఈ సత్సంప్రదాయాలను అనుసరించే తిరుమల శ్రీనివాసునికి మాఘశుద్ధ సప్తమి నాడు **'సూర్యజయంతి'** పండుగగా, **"రథసప్తమి"** అనే పేరుతో జరిగే ఉత్సవంలో మలయప్ప ఏడువాహనాల్లో తిరుమల మాడవీధుల్లో సూర్యోదయం నుండి చంద్రోదయం వరకూ ఊరేగుతూ భక్తజనాన్ని అనుగ్రహిస్తాడు.

ఈ రథసప్తమినాడు జరిగే వాహనసేవలనే 'ఒకరోజు బ్రహ్మోత్సవం'గా చెప్పవచ్చు. స్వామి వారికి ఒకే రోజు జరిగే వివిధ వాహనసేవలు చూద్దాం రండి.. దర్శించండి... తరించండి....

*గోవిందా.. గోవింద... గోవింద....!!*

# సప్తగిరీశుడి సేవలో..



# సప్తాశ్వరథారూఢుడు

– శ్రీ జె. అనిల్ కుమార్

సప్తగిరులలోని స్వామి శ్రీవేంకటాద్రినారాయణుడు. ఈయన అఖిలాండకోటి బ్రహ్మాండనాయుకుడు. జగత్కల్యాణ చక్రవర్తి. ఎక్కడా ఎదురేలేని సుదర్శనచక్రాన్ని ఆయుధంగా ధరించినవాడు.

ఇక సప్తాశ్వాల రథంలో తిరిగే స్వామి శ్రీసూర్యనారాయణుడు, లోకబాంధవుడు, ఆరోగ్యప్రదాత. ఒకే ఒక్క చక్రం ఉన్న రథంలో ఆగకుండా, అలుపే లేకుండా నిరంతరం ముందుకు సాగుతూ అహర్నిశాత్మకమైన దినప్రమాణంతో కాలచక్రాన్ని తిప్పుతున్న నవగ్రహాల అధిపతి శ్రీసూర్యదేవుడు.

ఒకరేమో నేలపైన సప్తాద్రుల మధ్యలో స్థిరంగా ప్రశాంతంగా ఉన్నా, ఇంకొకరేమో నింగిలో ఉదయాద్రి నుండి పశ్చిమాద్రి వరకు విశ్రాంతే లేకుండా సంచరిస్తున్నా ఆ ఇద్దరి దేవుళ్లదీ ఒక్కటే ఆలోచన! ఒక్కటే దీక్ష! అదే **ఆర్తజనరక్షణ. దీన జనసేవ! లోకకల్యాణం!** ఇలా నరులసేవలో నిమగ్నమై ఉన్న ఈ నారాయణులిద్దరి బంధం ఇప్పటిది కాదు. అనుబంధం, సంబంధం ఈ నాటివి అసలేకాదు.

ఇంకో విశేషం ఏమంటే వేంకటాద్రినారాయణుడు ఉండే అద్భుతమహిమల కొండ ఒక్కటే అయినా; దానికి ఏడుకొండలుగా పేర్లు కలిగాయి, అలాగే సూర్యుడికి ఉండేది అనంతమైన వెలుగులు చిమ్ముతున్న అద్భుతకిరణం ఒక్కటే! ఆ ఒక్క జ్యోతికిరణం ఏడురంగులుగా విభజింపబడి సప్తాశ్వాలుగా దర్శింపబడుతున్నది. ఎంతటి విచిత్రాతి విచిత్రం! ఇంతేనా! ఇంకా వినండి!!

ఒకప్పుడు సూర్యభగవానుడు కాశీక్షేత్రానికి వెళ్లారట! అప్పటికే ఆయన అఖండమైన తేజస్సును, వేడిమిని తట్టుకోలేక, ఆయన భార్యలు, దేవతలు, అనేక లోకాలవాండ్లు సూర్యుని తేజస్సును తగ్గించమని పరమశివుణ్ణి ప్రార్థిస్తూ ప్రాధేయపడ్డారు. పరమేశ్వరుని ఆజ్ఞతోనే దేవశిల్పి విశ్వకర్మ సూర్యగోళాన్ని కాస్త తురిమి తురిమి కొంతమేరకు తేజస్సును తగ్గించగలిగినాడు. అప్పుడు సూర్యునినుండి విడివడి ఎగిరిపడిన సన్నని రేణువులతో సుదర్శనచక్రాన్ని, మరికొన్ని ఆయుధాలను తయారు చేశాడట విశ్వకర్మ. అలా సూర్యుని నుండి వెలువడిన సుదర్శన చక్రాన్ని ధరించిన విష్ణువు **'సుదర్శన చక్రధారి'** అయ్యాడు. ఈ 'సుదర్శనుడే' ఒకప్పుడు శ్రీహరి శాపంవల్ల కార్తవీర్యార్జునునిగా జన్మించాడు. కృతవీర్యుడు అనే చక్రవర్తి చేసిన సూర్యోపాసన వల్లే సుదర్శనుడు కార్తవీర్యార్జునుడిగా పుట్టాడు.

మరి సూర్యుణ్ణి ఉపాసించాలన్నా, సుదర్శన భగవానుణ్ణి ఉపాసించాలన్నా ప్రధానంగా సూర్యుడు, తన శిష్యుడైన యాజ్ఞవల్క్యమహర్షికి ఉపదేశించిన శుక్లయజుర్వేదమే ఆధారమని చెప్పబడింది.

ఏడుకొండల్లో ఒకటి అంజనాద్రి. ఆంజనేయస్వామి అవతరించిన దివ్యస్థలం. అందువల్లే సప్తగిరీశునికి అంజనాద్రీశ్వరుడు అని కూడా పేరు కల్గింది. ఆ ఆంజనేయునికి గురువు సూర్యుడు. సూర్యుని వద్దే హనుమంతుడు నవవ్యాకరణాలను, సంగీతాలను అభ్యసించాడట.

ద్వాపరయుగంలో సాక్షాత్తు శ్రీకృష్ణభగవానుడు "సూర్యుడు ఎవరో కాదు నేనే" అంటూ "ఆదిత్యానాం అహం విష్ణుః"– ఆదిత్యులలో నేనే విష్ణువును అనీ, "జ్యోతిషాం రవి రంశుమాన్" పరంజ్యోతుల్లో సూర్యుణ్ణి నేనే అంటూ స్పష్టం చేశాడు.

ఇలా శ్రీమహావిష్ణు, భగవానునికంటె అభిన్నుడై, ఏకమై, ఒక్కడే పరంజ్యోతి స్వరూపుడైన సూర్యదేవుడు కశ్యపప్రజాపతికి పుత్రునిగా అవతరించిన రోజు మాఘమాసం శుక్లపక్షంలోని సప్తమిరోజు. ఆనాడే **"సూర్యజయంతి"**గా **"రథసప్తమి"**గా పిలుస్తూ శ్రీసూర్యుణ్ణి ఆరాధించడం ఎన్నోయుగాలు నుంచి వస్తున్న సంప్రదాయం. ఇవన్నీ ఎన్నెన్నో యుగాలనాటి గాథలు. అవిగాక ఈ కలియుగ ప్రారంభంలో ఆ ఏడుకొండల రేడుకు, ఈ ఏడుగుర్రాల రౌతుకు మధ్య నడిచిన రసవత్తరమైన కథల్ని కూడా స్మరించి తరిద్దాం.

## ఆదిత్యుణ్ణి ప్రతిష్ఠించిన ఆనందనిలయుడు


ఒకప్పుడు భృగుమహర్షి చేసిన నిర్వాకం వల్ల శ్రీమహాలక్ష్మి అలిగి వైకుంఠాన్ని వీడి భూలోకం చేరుకుంది. ఆమెను వెతుక్కుంటూ శ్రీమహావిష్ణువు భూలోకానికి వచ్చాడు. లక్ష్మీదేవిని ఎక్కడా చూడలేక వరాహక్షేత్రం చేరుకొన్న శ్రీహరి పిదప ఆకాశ రాజు పుత్రికను వివాహం చేసుకో తలపెట్టాడు. ఆ పెళ్లికి అందరూ వచ్చారు ఒక్క లక్ష్మీదేవి తప్ప. అందుకు చింతిస్తుండగా, లక్ష్మీదేవి కొల్హాపురంలో ఉందని తెలిసిన బ్రహ్మ, శివుడు **'సూర్యదేవుణ్ణి'** పంపించారు. సూర్యభగవానుడు ఆమెను పిలుచుకొని వచ్చాడు. పెళ్లి ఘనంగా జరిగిన తర్వాత తిరిగి లక్ష్మీదేవి వెళ్లిపోయింది. ఆమె వియోగాన్ని భరించలేక శ్రీనివాసుడు కొల్హాపురానికి వెళ్లాడు. కాని, ఆమె దర్శనం కాలేదు. పదేండ్ల పాటు తపస్సు చేశాడు. ఇంతలో ఆకాశవాణి ఇలా విన్పించింది. "సువర్ణముఖీనదీ తీరంలో పద్మసరోవరం స్థాపించి తపస్సు

**భూలోకవైకుంఠం తిరుమలక్షేత్రంలో సూర్యజయంతి వేడుకలు 'రథసప్తమి' పండుగనాడు వైభవంగా జరుగుతాయి. ఆ రోజు సూర్యోదయం మొదలుకొని, రాత్రి చంద్రోదయం వరకు ఏడుకొండలవాడు ఏడువాహనాల్లో దర్శనమిస్తూ భక్తులకు కనువిందు చేస్తాడు.**

**ఆ రోజు సప్తగిరులకు అధిపతి అయిన వేంకటేశ్వరుడు సప్తాశ్వాలు పూన్చిన స్వర్ణసూర్యప్రభవాహనంపైన ఆలయం మహాప్రదక్షిణం మార్గంలో ఊరేగుతూ సరిగ్గా సూర్యోదయవేళకు మహాప్రదక్షిణ మార్గంలో వచ్చి వాయవ్య మూలను వేంచేసి ఉంటాడు. పంచాయుధాలు గదా, శంఖు, చక్ర, ఖడ్గ, ధనస్సులను ధరించి, నిలువెత్తు వజ్ర వైఢూర్యాది నవరత్నహారాలతో, కిరీటంతో ధగ ధగ ప్రకాశిస్తూ సాక్షాత్తు శ్రీవైకుంఠనారాయణుని వలె దర్శనమిస్తూ భక్తులను ఆనందింప చేస్తాడు. ఆ ఉషోదయవేళలో అప్పుడప్పుడే ఉదయిస్తున్న బాలాభాస్కరదేవుని లేత అరుణ కిరణాలు క్రమక్రమంగా సూర్యప్రభవాహనంపై ఉన్న శ్రీమలయప్పస్వామివారి వజ్రకిరీటంపైన ఆ తర్వాత వక్షస్థలంపైన, శంఖుచక్రాలపైన... ఇలా వరుసగా ప్రసరిస్తూ చివరగా శ్రీనివాసుని పాదపద్మాలపైన ప్రతిఫలించగానే, ఆ అరుణ**

# సప్తగిరీశుని సన్నిధిలో.....





చేస్తే లక్ష్మి ప్రత్యక్షమవుతుందని". వేంకటేశ్వరుడు పద్మసరోవరాన్ని తవ్వాడు. ఎప్పుడూ పద్మాలు వికసించి ఉండాలని 'సూర్యభగవానుణ్ణి' ఆ పద్మసరస్సు ఒడ్డున ప్రతిష్ఠించి తపస్సు చేశాడు. లక్ష్మీదేవి ప్రత్యక్షమైంది. ఆమెను వక్షఃస్థలంలో ఉంచుకొని వేంకటేశ్వరుడు వేంకటాద్రికి వెళ్లాడు. ఆనాటినుంచి లక్ష్మీదేవి పద్మావతిగా అవతరించిన తిరుచానూరు క్షేత్రం 'భాస్కరక్షేత్రం'గా ప్రసిద్ధికెక్కింది. ఇలా ఆనందనిలయుని చేతనే ఆరాధింపబడిన స్వామి ఆదిత్యభగవానుడు. అంతేగాక ఆనాటినుంచి ఆదిత్యుడు అటు తిరుచానూరు క్షేత్రంలోను, ఇటు తిరుమలగిరుల్లో ఆనంద నిలయుని సేవల్లో తరిస్తూనే ఉన్నాడు.

ఇలా తిరుమలగిరుల్లో జరిగే 'రథసప్తమి' నాటి సూర్య జయంతి వేడుకల్లో పాల్గొని తిరుమలక్షేత్రంలో సంచరిస్తూ అఖి లాండకోటి బ్రహ్మాండనాయకుడైన ఆనందనిలయుణ్ణీ, ఆ స్వామి ఏడుకొండలు దిగి తిరుచానూరు క్షేత్రంలో స్వయంగా ప్రతిష్ఠించిన ఆదిత్యుణ్ణీ, ఆ సరోవరతీరంలో కొలువై ఉన్న, వేంకటేశురాణి అలమేలుమంగమ్మను దర్శించడం అనంతఫలప్రదం! ఐశ్వర్య ప్రదం! ఆరోగ్యప్రదం! సర్వార్థసిద్ధిప్రదం కూడా!

ఓం నమో వేంకటేశాయ

# .... సూర్యజయంతి




కిరణాలల్లో కొత్త కొత్తగా వింతవింతలుగా గోచరిస్తున్న శ్రీస్వామివారి దివ్యమంగళరూపం స్వయంగా కన్నుల నిండా దర్శించాలే తప్ప వర్ణించడానికి సాధ్యం కాదు. సప్తాశ్వాలు పూన్చిన బంగారు సూర్యప్రభవాహనంపైన ఉన్న బ్రహ్మాండనాయకుణ్ణి ప్రత్యక్ష భగవానుడైన సూర్యనారాయణ స్వామి తన కిరణాలతో అర్చించడం అనే దివ్యమైన దృశ్యం "రథసప్తమి"నాడు తిరుమలలో మాత్రమే గోచరించే అద్భుత ఘట్టం. ఆ వేళ అర్చకస్వామి బంగారుపళ్లెంలోని ఫలాలను శ్రీమలయప్పస్వామికి, ప్రత్యక్షంగా గోచరిస్తున్న శ్రీసూర్య భగవానునికి నివేదించి కర్పూరనీరాజనాలిస్తారు. ఆ తర్వాత శ్రీస్వామివారు వాహనమండపాన్ని చేరుకుంటారు.

ఇలా సూర్యప్రభవాహనంతో ప్రారంభమైన రథ సప్తమినాడు వరుసగా చిన్నశేషవాహనం, గరుడవాహనం, హనుమద్వాహనం, స్వామిపుష్కరిణిలో చక్రస్నానం, కల్ప వృక్షవాహనం, సర్వభూపాలవాహనం చివరగా, ఆ రాత్రి చంద్రప్రభవాహనం జరుగుతాయి. ఇలాగ సూర్యజయంతి నాటి రథసప్తమి వేడుకలను 'ఒకరోజు బ్రహ్మోత్సవం' అనీ, 'అర్ధబ్రహ్మోత్సవం' అని అంటారు.

# శ్రీపంచమి

**- అప్పరుసు రమాకాంతరావు**

**మా**ఘశుద్ధపంచమినాడు 'శ్రీపంచమి' జరుపుకోవడం సంప్రదాయం. ఈ రోజు సరస్వతీదేవిని పూజించడం ఆచారం. ఈ దేవత జ్ఞానప్రదాయిని. మహామాయ, వరప్రదా, సురవందిత, విమల, చంద్రవదన అనే పేర్లతో సరస్వతీదేవిని ఆరాధిస్తారు. ఈ తల్లిని జ్ఞానప్రాప్తి కోసం ఆరాధించమని బ్రహ్మవైవర్తపురాణం చెబుతోంది. శ్రీపంచమినాడు సరస్వతిని ఆరాధించే విధివిధానాలను నారదుడికి శ్రీమన్నారాయణుడు వివరించినట్లు దేవీభాగవతం వివరిస్తోంది. శరన్నవరాత్రుల్లో మూలానక్షత్రంరోజున సరస్వతీరూపంలో దుర్గాదేవిని ఆరాధించినప్పటికీ, మాఘమాసంలో పంచమితిథినాడు సరస్వతీదేవికి ప్రత్యేక ఆరాధనలు, విశేషపూజలు చేయడం కనిపిస్తోంది.

సర్వవిద్యలకు ఆధారం వాగ్దేవే కనుక పుస్తకాలు, కలాలు అమ్మవారి దగ్గర పెట్టి ఈ రోజున ఆరాధిస్తారు. తొలి తెలుగుకవి నన్నయ తన మహాభారతం రాయడం శ్రీపంచమిరోజే ప్రారంభించారని చరిత్రకారుల అభిప్రాయం. 'సరః' అంటే కాంతి. కాంతినిచ్చేది కనుక సరస్వతి అయింది. అజ్ఞానతిమిరాంధాన్ని దూరం చేసి విజ్ఞానకాంతికిరణపుంజాన్ని వెదజల్లే దేవతే సరస్వతీ. శ్రీపంచమి రోజు తెల్లని పద్మంలో కూర్చొని ఉన్న దేవి.. వీణ, పుస్తకం, జపమాల, అభయ ముద్రలను ధరించి ఉంటుంది. అహింసామూర్తి కనుకనే ఈ తల్లి చేతిలో ఎలాంటి ఆయుధాలు ఉండవు. జ్ఞానకాంతిని పొందిన వారికి ఆయుధాల అవసరం ఏమి ఉండదు కదా! ఈ తల్లిని తెల్లని పువ్వులతో, తెల్లని వస్త్రాలతోను, శ్రీగంధంతో అలంకరిస్తారు. పచ్చని వస్త్రాలను లేక తెల్లనివస్త్రాలను ధరించి తెల్లనిపూలతో అర్చనాదులు చేసి క్షీరాన్నాన్ని, నేతితోకూడిన వంటలను, కొబ్బరికాయ, అరటిపండ్లను చెరకును నివేదన చేస్తారు. ఆ తల్లి చల్లని చూపులలో అపారవిజ్ఞానరాశిని అందిస్తుంది. ఆమెను అనంత నామాలతో పిలిచినా "సా మాం పాతు సరస్వతీ...." అని పూజించే వారు ఆ తల్లికి ఎక్కువ ప్రేమపాత్రులట. వ్యాస వాల్మీకాదులు కూడా ఈ తల్లి అనుగ్రహంతోనే వేదవిభజన చేయడం, పురాణాలు, గ్రంథాలు, కావ్యాలు రచించడం జరిగిందంటారు. పూర్వం ఆశ్వలాయనుడువంటి మహనీయుడు కూడా ఈ తల్లిని శ్రీపంచమి రోజే ఆరాధించి కృతకృత్యులయ్యారు.




వేదాలకు సైతం సరస్వతీదేవినే తల్లిగా భావిస్తారు. ఆమెను 'వేదమాత' అని కూడా పిలుస్తారు. ప్రవహించే నీటిని సరస్ అంటారు. సరస్వతి అంటే ప్రవహించే గుణం కలదని అర్థం. ఆ దేవిని స్తోత్రం చేయడం వల్ల జ్ఞానం ప్రవహిస్తుందని వేదార్థం. ఆ జ్ఞానం ఎలాంటిదంటే మచ్చలేని ధవళ వస్త్రం లాంటిది. సరస్వతీదేవి చంద్రుని వెన్నెల (కౌముది) లాంటి తెలుపు చీర ధరించి పూజ్యనీయమైన అందం కలిగి ఉంటుంది. తెల్లని కమలంలో కూర్చుని ఉంటుంది. సంగీతంలో సరస్వతీదేవి అంతులేని ప్రజ్ఞ కలిగిన దేవత. ఈమెకు భాగేశ్వరి రాగం చాలా ఇష్టం. అందుకే ఈ దేవిని భాగేశ్వరి అని కూడా వ్యవహరిస్తారు. శ్రీపంచమిరోజు భాగేశ్వరిరాగంలో స్తుతిస్తూ మంగళ హారతులు సమర్పిస్తారు. ఈమెను సురలందరూ పూజిస్తారు. అందుకే ఈ దేవిని సురనుతకల్యాణి అంటారు. సరస్వతి అనే నది ప్రవహించేదని ఋగ్వేదం చెబుతోంది. ఈ నదిలో హంసలు స్నానంచేస్తూ చెవులకు ఇంపైన రాగంలో సరస్వతీదేవిని స్మరిస్తూ గానం చేసేవట. ఈ రాగాన్నే 'హంసధ్వని' అని వ్యవహరిస్తారు. ఈ దేవతకు వీణావాయిద్యం ఎంతోఇష్టం. శ్రుతి డోలనాలు పలికించడంలో సరస్వతీదేవికి దేవతల్లో సాటి ఎవరురారు. సరస్వతీదేవి మాత్రమే జ్ఞానానికి పరాకాష్ట. అందుకే శ్రీపంచమి ఈ తల్లికి చాలా ఇష్టమైన రోజు. ఈ రోజు ఎంతటి జ్ఞానాన్నైనా ఆ దేవత ప్రాప్తింపజేస్తుంది.

ధారావాహిక

# శ్రీమద్భగవద్గీత

## 13వ-అధ్యాయం (సారసంగ్రహం)



విద్వాన్, డా॥ ఈ.జి. హేమంతకుమార్

### క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగం-అధ్యాయ నామౌచిత్యం

క్షేత్ర మనే పదానికి పొలం, శరీరం, కళత్రం ఇత్యాదిగా నానార్థాలున్నాయి. ఇక్కడ శరీరమనే అర్థం తీసుకోవాలి. క్షేత్రజ్ఞుడనగా ఆత్మ (జీవుడు). ఈ శరీరమే క్షేత్రమని కృష్ణుడే చెప్పినాడు. ఇది క్షేత్రమని గ్రహించినవాడే క్షేత్రజ్ఞుడు. అటు క్షేత్రాన్ని గురించి, ఇటు క్షేత్రజ్ఞుని గురించి వివరించే అధ్యాయం కాబట్టి దీనికి క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగం అనే పేరు పెట్టడమైంది.

"జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యమ్"- జ్ఞానగుణం లభ్యమైతేనే జ్ఞేయంలో ప్రవేశించడానికి అర్హత కలుగుతుందనీ, ఇందులో ఏ ఒక్కదాన్ని పొందకున్నా జ్ఞేయాన్ని గ్రహించలేరని వివరించారు శ్రీకృష్ణులవారు. పరమాత్మను జీవుడు పొందడానికి ఉపాయాలు కూడా విపులంగా ఉన్నాయి. అన్ని యోగాలు ఈ జ్ఞానయోగంలో మిళితమైపోయాయి. జ్ఞానం చేతనే మోక్షం లభిస్తుంది. అఖండమైన కృష్ణుని జ్ఞానోపదేశం- జ్ఞానికుండాల్సిన లక్షణాలు ఇరువదింటిని పరమాత్మ తెలియజేశారు. ఈ ఇరవై గుణాలున్నవాడే జ్ఞాని- ఇవి లేనివాడు అజ్ఞాని అని నిశ్చయించాడు. జ్ఞానికుండాల్సిన లక్షణాలు సంపూర్ణంగా కలిగి ఉన్నా జ్ఞేయాన్ని పొందకపోతే అమృతత్వం కలుగదని ఈ అధ్యాయంలో భగవంతుడు విస్పష్టంగా చెప్పాడు. క్షేత్రమేదో? ఎలాంటి మార్పులు కలదో? క్షేత్రజ్ఞుడెవడో? అతని స్వభావమెట్టిదో? ఈ అధ్యాయంలో పేర్కొనబట్టి ఆ పేరుతో వ్యవహరింపబడింది. దీన్ని చదవడం వల్ల క్రూరకర్మల నుండి ముక్తిని పొందుతారు.

### అర్జునుడడుగుతున్నాడు

ఓ కృష్ణా! ప్రకృతి- పురుషుడు, క్షేత్రం- క్షేత్రజ్ఞుడు, జ్ఞానం- జ్ఞేయం అంటే ఏమిటి? వీటిని గూర్చి తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది. కనుక తెలియజెప్పుమని అర్జునుడు శ్రీకృష్ణభగవానుణ్ణి ప్రార్థించాడు.

### భగవంతుడంటున్నాడు

కౌంతేయా! ఈ శరీరం అన్నది ఏదైతే ఉందో అదే క్షేత్రం. ఈ క్షేత్రాన్ని తెలుసుకున్నవాడు క్షేత్రజ్ఞుడు.

**క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత! ।**
**క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ ॥ 2**

కుంతీపుత్రుడవగు ఓ అర్జునా! అన్ని క్షేత్రాల్లోనూ క్షేత్రజ్ఞుడను నేనే. ఈ క్షేత్ర క్షేత్రజ్ఞుల గురించి తెల్సుకోవడానికి మించిన జ్ఞానం లేదు. జ్ఞానాల్లోకెల్లా ఇది ఉత్కృష్టమైన జ్ఞానం అనదగింది. ఆ క్షేత్రమనేది ఏది? ఎటువంటిది? ఎందుకేర్పడింది? ఏ మార్పులు కలది? అసలెవరీ క్షేత్రజ్ఞుడు? ఏమిటి అతని శక్తి? ఈ విషయాలన్నిటినీ నీకు సంగ్రహంగా చెబుతాను. నువ్వు నా వలన విని తెల్సుకో. ఈ విషయాన్నే ఋషులు బహు విధాలుగా చెప్పారు. బ్రహ్మసూత్రాల్లోనూ ఇది చెప్పబడింది.

క్షేత్రమంటే కేవలం ఒక్కదేహమే కాదు. భూమి, నీరు, నిప్పు, వాయువు, ఆకాశం అనే పంచమహాభూతాలు; చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు అనే జ్ఞానేంద్రియాలు ఐదు; వాక్కు, చేతులు, కాళ్ళు, మల, మూత్ర విసర్జనేంద్రియాలు అనే ఐదు కర్మేంద్రియాలు మరియు మనస్సు, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధము అనే వాసనలు (ఇంద్రియ విషయాలు) ఐదు, అహంకారం, బుద్ధి, ప్రకృతి అనే ఈ ఇరవై నాల్గు తత్త్వాలు చేరితే క్షేత్రం అని అనబడుతుంది.

అర్జునా! జీవాత్మ ఈ శరీరాన్ని ఉపయోగించే ఆత్మ తత్త్వాన్ని తెలుసుకోవడానికి కావలసిన గుణాల్ని పొందాలి. అవే జ్ఞానానికి లక్షణాలు. ఇలాంటి లక్షణాలు కల్గిన మనస్తత్వం కలవాడే జ్ఞాని. కనుక జ్ఞానమంటే ఏమిటో? చెప్తున్నాను. విను.

అమానిత్వమదంభిత్వమహింసా క్షాన్తిరార్జవమ్ ।
ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః ॥ 7

అధ్యాత్మజ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనమ్ ।
ఏతద్ జ్ఞానమితి ప్రోక్తమజ్ఞానం యదతోఽన్యథా ॥ 11

01) అభిమానం లేకపోవడం- (తనను తాను పొగడుకోవడం ఇతరులు పొగడాలని కోరుకోవడమనే గుణం లేకుండుట).

02) దంభం లేకుండుట- (అవగింజంత ధర్మం చేసి, ఆకాశ మంత ప్రచారం చేయడం; ఆడంబరం కోసం అతిశ యోక్తులు పల్కకపోవడం)

03) అహింస- (పరప్రాణులను శారీరక మానసిక వాచికాలైన హింసలతో బాధింపకుండుటం)

04) ఓర్పు కలిగి ఉండటం.

05) కపటం లేకపోవటం- (ఋజువర్తనంతో మనసా, వాచా, కర్మణా ఒకేరీతిగ ఉండటం.)

06) గురువులను సేవించడం.




07) శుచిత్వం స్థిరత్వం- (బాహ్యాభ్యంతర శుచితో పరిశుభ్రంగా ఉండటం)

08) స్థిరత్వం- (మనస్సును నిగ్రహంతో అదుపు ఆజ్ఞలలో ఉంచుకోవడం.)

09) వైరాగ్యం- (ఇంద్రియాలను క్రుంగదీసే రూపరసగంధ స్పర్శలౌకిక విషయలాలసుడు కాకుండా ఉండటం.)

10) అహంకారం లేకుండటం.

11) పుట్టుక, చావు, ముసలితనం, రోగం, అనేటువంటి దుఃఖ హేతువులు కలది ఈ జీవితం అని భావన చేయడం.

12) భార్య, బిడ్డలు, ఇల్లు, ఆస్తిపాస్తుల విషయంలో మమకారం లేకుండటం, అట్టివాటిలో తగుల్కొన కుండుట.

13) సమబుద్ధి కలిగి ఉండటం (తన ఇష్టం నెరవేరినా అలా నెరవేరక అనిష్టం కలిగినా మనస్సు సమానస్థితిలో ఉండటం).

14) భగవంతునిపై అనన్యమైన, నిశ్చలమైన భక్తి కలిగి ఉండటం.

15) ఏకాంతవాసం (పది మందిలో కలిసి ఉండక ఒంటరిగా ఉండటం).

16) జనసమూహంతో స్నేహం చేయక దూరంగా ఉంటూ పరబ్రహ్మను దర్శించుట.

17) ఆత్మజ్ఞానమందు నిలకడ కలిగి ఉండటం.

18) తత్త్వజ్ఞానం- యొక్క గొప్ప ప్రయోజనాన్ని కలిగి ఉండటం అనే ఇవన్నీ చేరి 'జ్ఞానం' అనబడుతూ ఉంది. వీటికి పూర్తిగా భిన్నమైన విరుద్ధమైన లక్షణాలే అజ్ఞానం.

అర్జునా! మానవుడు దేనిని తెలుసుకుంటే ఇక తెలిసి కొనవలసినది ఉండదో అటువంటి విషయమును గూర్చి వివరి స్తాను-తెలుసుకో. ఆత్మ అనాది. అది నాకు లోబడి ప్రవర్తించేది. దానినే పరబ్రహ్మమని కూడా అంటుంటారు. అది సత్తుకాదు. అసత్తు అంతకంటే కాదు. అది అంతటా వ్యాపించి ఉంది. ఆ పరబ్రహ్మం శరీరరూపాన్ని ధరించి ఉన్నప్పుడు దేహం మూలాన అన్నాదులను అనుభవిస్తూ ఉన్నది. ఇంద్రియాల నన్నిటినీ ప్రకాశింపచేసేదీ, ఇంద్రియవ్యాపారాలన్నీ నిర్వహిం

చేది– అయినా ఇంద్రియాలు లేనిదది. భూతకోటిని భరించి, పోషించి, సంహరించేది అదే. పరబ్రహ్మాన్ని విభజించలేము. దీనిని జ్ఞానంతో తెలుసుకోవలసిందే. ఆ పరబ్రహ్మం ఈ దేహాన్ని వదలునపుడు శుద్ధాత్మగా ఉంటుంది. ఇదివరకు నాచే చెప్ప బడిన ఇరువదినాల్గుగుణాలు కలవారికే ఆత్మగోచరమవుతుంది.

ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః ।
మద్భక్త ఏతద్విజ్ఞాయ మద్భావాయోపపద్యతే ॥ 18

కురుప్రవీరా! అర్జునా! నీకింతవరకు క్షేత్రాన్ని గూర్చి, క్షేత్రజ్ఞుని గూర్చి, జ్ఞానజ్ఞేయాలను గూర్చి సంక్షిప్తంగా వివ రించాను. విశదం చేసుకోగల నా భక్తులు నా స్వరూపాన్ని గ్రహించి నన్ను పొందటానికి అర్హులవుతారు.

పరంతపా! పార్థా! ఇట్లే ప్రకృతి పురుషులను గూర్చి కూడా వివరిస్తున్నాను. విను. ప్రకృతి – పురుషుడు ఈ రెండూ అనాదులే. గుణాలు, వికారాలు ప్రకృతి వల్ల పుడతాయి. ప్రకృతి వలననే అన్ని కర్మలు కూడా జరుగుతున్నాయి. కార్యకారణ కర్తృత్వాలన్నిటికి ప్రకృతే మూలం. సుఖదుఃఖాల అనుభవం ఉంది చూడు దానికి పురుషుడే కారణం. పురుషుడు ప్రకృతిలో ఉండి ప్రకృతివలన పుట్టిన గుణాలను అనుభవిస్తున్నాడు. ఆ యా గుణాల కూడికననుసరించే ఈ జీవుడికి వేరు వేరు జన్మలు కలుగుతాయి. దానినే కర్మఫలం అంటున్నాం.

గుణాలతో కూడిన ఈ ప్రకృతిని–సాక్షీభూతుడైన పురుషుని ఆత్మానాత్మజ్ఞానం వలన తెలుసుకున్న మనుజునకు పునర్జన్మ లేదు. వాడు మోక్షాన్ని పొందుతాడు.

సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్ ।
వినశ్యత్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి ॥ 27

అనఘా! అర్జునా! సమస్తప్రాణులందంతటా సమానంగా ఉండే పరమాత్మను శాశ్వతుడని ఎవడు గ్రహింపగల్గుతున్నాడో అతడే ఆత్మసాక్షాత్కారాన్ని పొందుతాడు. అర్జునా! ఆత్మను ధ్యాన యోగంతో కొందరు, సాంఖ్యయోగంతో మరికొందరు, కర్మ యోగంతో ఇంకా కొందరు, గురూపదేశంతోనూ, ఇతరుల వద్ద శ్రవణం చేసి ఉపాసిస్తూ పరమాత్మదర్శనం చేస్తూ వేరొక కొందరు ఆత్మసాక్షాత్కారాన్ని పొందుతూ మృత్యువును అతిక్ర మించి మోక్షాన్ని సాధిస్తున్నారు.

సూర్యుడు ఒక్కడే ఈ సమస్తజగత్తుకు ఎలా కాంతి నిస్తున్నాడో అలాగే సర్వశరీరాలలోనూ ఉన్నటువంటి క్షేత్రజ్ఞుడగు పరమాత్మ ఉద్దీపింప చేస్తున్నాడు. ప్రకృతి పురుషరూపంగా గోచరించేటటువంటి ఈ క్షేత్రక్షేత్రజ్ఞభేదాన్ని ఎవరు జ్ఞాన నేత్రంతో గ్రహించి చక్కగా తెలుసుకుంటారో వారు ప్రకృతి నుండి ముక్తిని పొందే మార్గం తెలుసుకుంటారు. పరమపదాన్ని పొందుతారు.

శ్రీకృష్ణార్పణమస్తు.

# ఆళ్వార్ల మంగళాశాసనములు
## తిరుమల

### తిరువాయ్ మొళి

**ప్రపన్నజనకూటస్థులైన నమ్మాళ్వార్లు ఉత్తర తిరుమల అయిన వేంకటాచలంలో వేంచేసి ఉండే శ్రీవేంకటేశ్వర స్వామిని సేవించి, ఆ స్వామియొక్క అంతులేని సౌందర్యంలో, సంపదలో అభినిష్టులై, ఆ స్వామిని ఇక్కడే ఈ లీలావిభూతి లోనే అనుభవించాలని ఆశపడి, తమకు సహాయంగా తమ మనస్సును, భగవద్భక్తులను ఇందులో ఆహ్వానిస్తున్నారు. తిరువాయ్‌మొళి ప్రబంధంలో మూడవ శతకంలోని మూడవ దశకం ఇది. ఈ దశకంలో ద్వయమంత్రం ఉత్తర ఖండార్థం అయిన కైంకర్య ప్రార్థన అనుసంధింపబడిందని పూర్వాచార్యహృదయం.**

ఒళివిల్ కాలమెల్లామ్ ఉడనాయ్ మన్ని,
వళువిలా అడిమై శెయ్యవేణ్డుమ్ నామ్,
తెళికురలరువి త్తిరువేఙ్గడత్తు,
ఎళిల్‌కొళ్ శోది ఎన్దైతన్దై తన్దైక్కే 3-3-1

**గలగలమని ప్రవహించే సెలయేళ్ళను కల వేంకటా చలంలో వేంచేసి ఉండేవాడు, గొప్ప అందమైన దివ్యతిరు మేనిని కలవాడు, నా స్వామికి స్వామి అయినవాడు అయిన వేంకటేశ్వరునకు మనం సర్వదేశ- సర్వకాల- సర్వావస్థల లోను అన్నివిధాలైన కైంకర్యాలను చేయాలి. తిరుమలకు రండి.**

వ్యాఖ్యాత– ఉ.వే. డా॥ ఈ.ఏ. శింగరాచార్యస్వామి

# కుమారధారాతీర్థం

ఫోటోల సౌజన్యం-ట్రెక్కింగ్ బాలు

- శ్రీ బి.వి.రమణ

**తిరుమల వైష్ణవక్షేత్రంగా ప్రసిద్ధి చెందినప్పటికీ వేంకటాద్రిపై శివపరివారగణంలోని కుమారస్వామి పేరిట ఒక తీర్థరాజం విరాజిల్లుతూ ఉండటం ఒక విశేషం.**

**నిజానికి తిరుమల క్షేత్రపాలకుడు రుద్రుడే కదా! పరమేశ్వరుని పుత్రుడైన కుమారస్వామి కారణాంతరాల వల్ల తనకు సంక్రమించిన బ్రహ్మహత్యాపాతకం పోగొట్టుకోవడానికై తపస్సుచేసి పునీతుడైన దివ్యప్రదేశమే "కుమారధారాతీర్థం".**

**తీర్థాద్రిగా పేరుబడసిన తిరుమల అడవులలోని 108 దివ్యతీర్థాల్లో.... కుమారధారాతీర్థం ఒకటి. ముక్తిప్రదమైన తీర్థాల్లో మేటి.**

**కుమారధారాతీర్థం ఓ అద్భుత భౌగోళిక కళాఖండం, ప్రాకృతిక సౌందర్యశోభిత శిలాబిలం. ప్రస్తుతం అక్కడ తిరుమలకు వచ్చే యాత్రీకుల దాహార్తిని తీర్చేందుకు కుమారధార-పసుపుధార జంట ఆనకట్టలు నేత్రపర్వం కలిగిస్తుంటాయి. ఆనకట్టలు ఆధునిక దేవాలయాలు.**

**మనోహర ప్రకృతి, సాంకేతిక ప్రగతి కలసికట్టుగా కనువిందు చేసే విలక్షణ ప్రాంతమే ఈ 'కుమారధారాతీర్థం'.**



తిరుమలగుడికి ఈశాన్యంగా రమారమి 7 కి.మీ. దూరంలో కుమారధారాతీర్థం కానవస్తుంది.

పాపవినాశనం ఆనకట్ట నుంచి కాలినడక మార్గాన అడవిలో అల్లిబాడవ మీదుగా ప్రయాణించి తీర్థస్థలి చేరుకోవచ్చు. లేదా తిరుమల వేదపాఠశాల పక్క నుంచి మట్టిరోడ్డు గుండా బయల్దేరినా తీర్థప్రదేశం వస్తుంది. తలకోన, వై.ఎస్.ఆర్.కడపజిల్లా రైల్వేకోడూరు, బాలపల్లె ప్రాంతాలనుంచి సైతం పురాతన అడవిదోవలు ఉన్నాయి. జీవవైవిధ్య వాటిక శ్రీవేంకటేశ్వర అభయారణ్యంలో కొలువైన ఈతీర్థం ఆవరించి అపురూప వృక్ష- కీటక- జంతుజాలం మనుగడ సాగిస్తూ ఉండడం గమనార్హం.

సముద్రమట్టానికి సుమారు 2800 అడుగుల ఎత్తున, 13-43' ఉత్తరఅక్షాంశం, 79-19' తూర్పు రేఖాంశంపై కుమారధార నెలకొని ఉంది. వరాహ, వామన, మార్కండేయ, పద్మపురాణాలు కుమారధారాతీర్థవైభవాన్ని, మహిమను ఎంతగానో కొనియాడుతున్నాయి.

పరమశివుని కుమారుడైన కుమారస్వామి దేవతల సేనాధిపతి. దేవదానవయుద్ధంలో తారకాసురుడనే రాక్షసరాజుని సంహరించాడు. దాంతో షణ్ముఖునికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. అంతట కుమారస్వామి తండ్రి పరమేశ్వరుని సూచనపై సువర్ణముఖినదీ తీరానగల వేంకటాచల పర్వతం మీది కుమారధారాతీర్థం దగ్గర వేంకటేశ్వర స్వామిని గూర్చి తపస్సు చేయుటకు ఉపక్రమించాడు.

ఈ విధంగా 12 ఏండ్లు శ్రీవేంకటనాథుని గురించి ఘోరతపస్సు చేసాడు. అంతట శ్రీమన్నారాయణుని అవతార స్వరూపమైన వేంకటేశ్వరస్వామి ప్రత్యక్షమై 'కుమారా! నీ తపస్సు అమోఘం. ఇంతటితో నీ బ్రహ్మహత్యాపాతకం తొలగిపోయింది. ఇకనుంచి ఈ ప్రాంతం "కుమారధారాతీర్థం" పేరిట ప్రఖ్యాతి పొందుతుంది' అని ఆశీర్వదించాడు.

సుబ్రహ్మణ్యస్వామికి శ్రీవేంకటేశ ప్రభువు ప్రత్యక్షమై అనుగ్రహించిన రోజు - **మాఘమాసం మఖానక్షత్రయుక్త పూర్ణిమాతిథి... అదే కుమారధారాతీర్థ పర్వదినం! తీర్థముక్కోటి!**

సాధారణంగా ఫిబ్రవరిమాసంలో కుమారధారాతీర్థ ముక్కోటి జరుగుతుంది. ఈ శుభసందర్భాన భక్తయాత్రీకులు తీర్థానికి చేరుకుని, భక్తిశ్రద్ధలతో పుణ్యస్నానాలు ఆచరిస్తారు.

పూర్వం ఓవృద్ధ బ్రాహ్మణుడు కౌండిన్యుడనే శిష్యుడితో కలిసి వేంకటాద్రి పై ఆశ్రమం ఏర్పాటు చేసుకుని నివసిస్తుండే వాడు. ఒకరోజు ఆ ముదుసలి నిత్యహోమాదులకు అవసరమైన సమిధలు ఏరుకొని రావడానికి వెళ్లి, అడవిలో దారి తప్పాడు. పొద్దుపోయింది. భయంతో 'కౌండిన్యా! కౌండిన్యా!' అని తన శిష్యుని పిలుస్తూ తచ్చాడసాగాడు.

అంతట దయామయుడైన వేంకటేశ్వరస్వామి కుమార రూపాన వచ్చి ఆ వృద్ధుని సమీపించాడు. 'నేను మీ ఆశ్రమానికి తీసుకు పోతాను లెమ్మని' ముసలివాని చేయిపట్టుకుని ముందుకు నడిపించసాగాడు. కొద్దిదూరం వెళ్ళిన తర్వాత కుమార వేంకటేశ్వరుడు ఒక జలధారను చూపి, ఆ తీర్థంలో స్నానంచేసి రమ్మని ఆ ముదుసలిని సూచిస్తాడు.

ఆ మేరకు తీర్థంలో స్నానాదులు ముగించుకు రాగానే ఆ వృద్ధుడు పదహారేళ్ళపడుచువాడుగా మారిపోయాడు. సంభ్రమాశ్చర్యాలకులోనైన ఆ బ్రాహ్మణుడు, ఇదంతా అవతారార్చామూర్తి శ్రీమన్నారాయణుని కృపా కటాక్షం వల్లేనని గ్రహించి, స్వామికి కృతజ్ఞతలు చెబుతాడు.

ముసలి బ్రాహ్మణుడు స్నానంచేసి కుమారుడైనందున, అప్పట్నుంచి ఆ తీర్థరాజం 'కుమారధార' అని ప్రఖ్యాతి పొందెనని మరో పురాణకథనం.

మొత్తం మీద కుమారధారాతీర్థం ఎంతో మహిమోపేతమని పై మాహాత్మ్య ఉదంతాలు తెలియజేస్తున్నాయి. శ్రీవేంకటేశ్వర అష్టోత్తరశతనామావళి స్తోత్రంలో **'కుమార కల్పసేవ్యాయ నమః'** అని, **'కుమారధారికావాస స్కందాభీష్ట ప్రదాయ నమః'** అని రెండు నామములు ఉన్నాయి.

## కుమారధార - పసుపుధార ప్రాజెక్టు


కలియుగ వైకుంఠం తిరుమల. అదో భక్తివాడ. రోజూ వేలాది మంది తిరుమల దేవుడి దర్శనార్థం వస్తూ ఉంటారు. ఈ క్రమంలో భక్త యాత్రీకుల నీటివసతికై తిరుమల తిరుపతి దేవస్థానములవారు గోగర్భం, పాపవినాశనం, ఆకాశగంగ ఆనకట్టలు నిర్మించి ఉన్నారు. అయితే వేసవికాలంలో ఈ ఆనకట్టల నుంచి వచ్చే నీటిసరఫరా సరిపోనందున, శేషాచలం అడవుల్లోని కుమారధార-పసుపుధార జంట ప్రాజెక్టులను నిర్మించింది తి.తి.దే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుల ద్వయం యాత్రీకులకు వరప్రసాదం.

పచ్చటి కొండల శ్రేణికి కంఠాభరణంలా భాసిల్లే ఈ వారధి పొడవు 907 మీటర్లు. ఉత్తరం నుంచి అటు తూర్పు దిక్కుకు **'V'** ఆకారంలో నిర్మితమైన











ఈ బృహత్తర నిర్మాణం నీటినిల్వ సామర్థ్యం 5,250 లక్షల గ్యాలన్లు. కాంక్రీట్ గ్రావిటీ డ్యామ్ తరహాలో సుమారు 100 కోట్లకు పైగా వ్యయమైన ఈ ప్రాజెక్టు పని 2005వ సంవత్సరంలో ప్రారంభ మయింది. మరో ఐదేళ్ళకంతా పూర్తయ్యింది.

కుమారధార–పసుపుధార ఆనకట్టలు నిర్మితమైనా, అసలైన 'తీర్థరాజం' కనుమరుగవలేదు.

కుమారధార డ్యాంపక్కనుంచి ఓ దిగుడు మార్గం గుండా నడిచి తీర్థస్థలి చేరుకోవచ్చు. అయితే వానాకాలం, ఇతర నిర్దిష్ట దినాలలో తీర్థప్రయాణం కూడదు.

కొన్ని మిలియన్ల సంవత్సరాల సైతం భూమి పరిణామ క్రమంలో భాగంగా యజ్ఞకుండంను తలపించే విధంగా ఓ పెద్దప్రాకృతిక నిర్మాణం 'కుమారధారాతీర్థం'. పాతాళలోకంలాంటి ఆ శిలాబిలంలోకి నిచ్చెనలగుండా క్రిందికి దిగాలి. పవిత్ర మైన దేవాలయ ఆవరణలాంటి ఆ ప్రదేశంలో తూర్పుదిశన మనల్ని సమ్మోహితుల్ని చేస్తూ హొయలొలుకుతూ గల గల పారే జలపాతం. అదే కుమారధారాతీర్థం. ఈ తీర్థస్నానం సకలపాపహరణం. సర్వాభీష్టదాయకం. ఆయురారోగ్యాలను ప్రసాదించడమే గాక, గంగాది పుణ్యతీర్థాల్లో స్నానం చేసిన ఫలాన్ని పొందగలం.

పురాణ ప్రాశస్త్యంతో కూడి అటు ఆధ్యాత్మిక అనురక్తికి, ఆనకట్టల నిర్మాణంలో ఇటు ఆధునిక సాంకేతికతకు ఆలవాలమైన కుమారధారాతీర్థ దర్శనం ఎంతో పుణ్యప్రదం. సర్వశ్రేయో దాయకం.

ఓం కుమారస్వామినే నమః



# భారతీయ వేదసంపద

- శ్రీ ఎమ్.వి.అవధాని




హిందూధర్మం వేదాల ఆధారంగా రూపొందింది. వేదాల్లో పూజలు, ఆచారవ్యవహారాలు, కర్మ సిద్ధాంతము, శుభా శుభకార్యకలాపాలు చేయాల్సిన విధులు మాత్రమే ఉంటాయని అనుకుంటూంటాం. కానీ, నేటి వైజ్ఞానిక వైద్య, ఆయుధ, వాహన తయారీలన్నీ వేదాలనుంచే ఏర్పడినవే. నాటి పుష్పక విమానమే నేటి విమానాలకు ఆధారం. ఈనాటి సిజేరియన్ వేదకాలంలో వేదాల్లో సమగ్రంగా వివరించి వాడ బడి యున్నది. ధన్వంతరి, శుశ్రుతుడు శస్త్రవైద్యం చేసిన దాఖలాలు మనకు గలవు.

## వేదము అంటే ఏమిటి?

'విద్‌జ్ఞాన' అను ధాతువు నుండి 'వేదం' అనే శబ్దం ఉద్భ వించినది. మన బుద్ధిని అతిక్ర మించి దానికంటే మించిన జ్ఞానం కలుగజేయునది అని దీనికి అర్థం. వేదములలో యజ్ఞయాగాదుల గురించి, జీవాత్మ- పరమాత్మ సంబంధము, మానవుడు జన్మ మొదలుకొని, మరణ పర్యంతము చేయ దగిన కర్మలు గురించి సవిస్తరముగా చెప్పబడి ఉన్నది. అవి వివరించు సందర్భములలోనే నేటి వైజ్ఞానిక విషయములన్నీ చర్చించబడినవి. నేటి విజ్ఞానం ఆనాడే మన వేదాల్లో దాగి ఉంది. వేదములు అపౌరుషేయాలు. మన మహర్షులు తమ తపశ్శక్తి ద్వారా వేదమంత్రాలను విని వాటిని తమ శిష్యులకు బోధించారు. ఆ వేదమంత్రములకు సరైన అర్థం మాత్రమే వ్రాశారు. వారిలో ముఖ్యుడు విద్యారణ్యస్వామి. అతని వాఖ్యానమే భారతీయ సంస్కృతికి ఆధారభూతమైనది. ఆ తర్వాత వేదవ్యాఖ్యానము పదునెనిమిది మహర్షులు "స్మృతి" అనే పేరిట వ్రాసి ఉన్నారు. కాలక్రమేణ యుగాలలో, కాలంలో ఏర్పడిన మార్పుల వల్ల ఒక్కొక్క తెగ, కులం, వారు ఒక్కొక్క స్మృతిని అనుసరిస్తున్నారు.



## వేదవ్యాసునికి ఆపేరు ఎలా వచ్చింది?

మహర్షులు విని బోధించిన వేదమంతా ఒక రాశిగా ఉండేది. అంటే కర్మసిద్ధాంతం, విజ్ఞానం, వైద్యం, వ్యాకరణం, ఛందస్సు ఆదిగాగల అనేకానేక భాగాలన్నీ ఒక్కటిగా ఉండేవి. దానిని వ్యాసమహర్షి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణవేదం అని నాలుగుభాగాలుగా విభజించుటచే వేద వ్యాసుడుగా పిలవబడ్డాడు.

## వేదం ఎందుకు స్వరయుక్తమైనది?

వేదములు ఒక్కొక్క పదంతో కలిపి, విడదీసి పలకాలంటే ఒక ప్రత్యేకమైన రాగం ఉండాలి. అంటే ఉదాత్త- అనుదాత్త- స్వరిత-దీర్ఘస్వరితములను స్వరములతో కూడి ఉన్నది 'వేదములు'. లేకుంటే, ఆ తేడా గుర్తించడం జరుగదు. వేదం సగ్ంహిత- పదం- క్రమం- ఘనం- జట- బ్రాహ్మణము- ఆరణ్యకములుగా 7 విభాగములు కలవు.

'సగ్ంహిత' అనగా మూలం. 'పదం' అనగా సగ్ంహితను పదంగా పలకడం. 'క్రమం' అంటే రెండు పదముల కలయిక. 'జట' అనగా ఒక పదం 6 సార్లు వచ్చును. 'ఘన'మనగా ఒక పదము 13 సార్లు పలకడం. పదము వరకే గ్రంథములు కలవు. జట- ఘనలు ధారణ మాత్రమే. ఈ విధంగా అభ్యసిస్తేనే వేదమంత్రపు అసలు అర్థం తెలుస్తుంది.

## వేదములు, భాగములు, అంగములు, ఉపవేదములు

ప్రతి పుస్తకంలో ఎన్నో అధ్యాయములు ఉన్నట్లే, వేదంలో కూడా అనేకానేక భాగాలుంటాయి. ఆ రకంగా ఋగ్వేదంలో 21, యజుర్వేదంలో 109, (కృష్ణయజుర్వేదము 94, శుక్లయజుర్వేదము 15), సామవేదంలో 1000, అథర్వణ వేదంలో 50 విభాగాలున్నాయి.

## ఉపవేదం

ప్రతి వేదంలోనూ కర్మ సిద్ధాంతం అనుష్ఠానం. పూజ సంప్రదాయ విధులు అన్నీ సాధారణ అంశాలుగా ఉంటాయి. కానీ, ఒక్కొక్క వేదం ఒక్కొక్క ప్రత్యేక విషయం సామాన్య మానవుని పరిధికి తెచ్చింది. ఆ రకంగా, ప్రత్యేకతను కలిగి ఉన్న భాగాన్ని "ఉపవేదం" అని పిలుస్తారు.

ఋగ్వేదానికి ఉపవేదం **'ఆయుర్వేదం'**గా చెప్పబడుతుంది. యజుర్వేదాని ఉపవేదము **'ధనుర్వేదము'**. సామవేదానికి ఉపవేదము **'గాంధర్వవేదము'**. అథర్వణ వేదానికి ఉపవేదం **'అర్థశాస్త్రము'**.



**తిరుమలలో శ్రీవరాహస్వామిని దర్శించిన తర్వాతనే శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించాలి.**

## వేదాంగములు

ఏదైనా రచించేప్పుడు కొన్ని రకాలనియమాలు పాటిస్తూ ఉంటాం. ఆ నియమాలు మనకు వేదం నుంచి ఏర్పడ్డవే. ఆ నియమాలకే అంగం అని పేరు. మన భారతీయ భాషలకి మూలమైన ఛందస్సు, వ్యాకరణం వేదాంగాలుగా ఉన్నవే. ఈ వేదాంగాలు ఆరు.

1)శిక్షా 2)వ్యాకరణము 3)ఛందస్సు 4)నిరుక్తము 5)జ్యోతిష్యము 6)కల్పము. అయితే, వేదాలకు ఇవి భాషా నియమాలుగా గాక, వేదం భావరాగయుక్తమయ్యేందుకు వీలైన అంగాలుగా ఉన్నాయి. శాస్త్రజ్ఞులు, విద్వాంసులు వేదమునకు 1) శిక్షా'ముక్కు' అని 2) వ్యాకరణము 'ముఖము' వంటి దైతే 3) జ్యోతిష్యము 'నేత్రము' 4) కల్పము చేయి 5) నిరుక్తము చెవి 6) ఛందస్సు 'పాదము' అని చెప్పారు.

**1) శిక్షా-** ఇందులో వేదశబ్దములయొక్క అక్షరస్థాన జ్ఞానము ఉంటుంది.

**2) వ్యాకరణము-** దీనిని పాణిని రచించెను. వ్యాకరణము వాక్యముల నిర్మాణాన్ని వివరిస్తుంది. దీనికి వరరుచి, పతంజలి వ్యాఖ్యానము రాశారు.

**3) ఛందస్సు-** ఛందశ్శాస్త్రానికి పింగళముని కర్త. శ్లోకాలను వ్రాయడానికి ఉపయోగించే విధానమే ఛందస్సు.

**4) నిరుక్తము-** యాస్కమహర్షి దీని కర్త. ఇందులో వేద పద అర్థము. వేద శబ్ద వివరణ సవివరంగా చెప్పబడతాయి.


**5) జ్యోతిషము-** ఆదిత్యాదులు దీని కర్తలు. వైదికకర్మలను ఆరంభించుటకు తగు కాలజ్ఞానము, తత్ఫలమూ, ఇందు వివరించబడినవి.

**6) కల్పము-** అశ్వలాయన, కాత్యాయన, ఆపస్తంభ, బోధాయన ఇత్యాదులు దీని సూత్రకర్తలు. ఇందులో వేదములందు గల యజ్ఞకర్మలను అనుష్ఠించు రీతి తెలియజెప్పారు.

ఈ విధంగా ఈనాటికీ **'భారతీయ వేదసంపద'** మన సంస్కృతికి నిదర్శనాలుగా వెలుగొందుతున్నాయి.



నీ లోపాలను నీకు మాత్రమే తెలిపి, ఇతరులకు తెలియజేయనివాడే నిజమైన మిత్రుడు




*(డిసెంబరు సంచిక తరువాయి భాగం....)*

**“కలౌ పునః పావరతాభిభూతే న ఉద్భభూవాఽఽ ఉ్రశిత వత్సలత్వాత్, అర్చాత్మనా సర్వజనాన్ సుగోప్తుం సర్వాధికో వేంకట భూధరేంద్రః.”**

(పాపాసక్తులగు దుర్జనులచేత కలికాలం పరిభవింపబడగా శ్రీమన్నారాయణుడు ఆశ్రితపత్సలుడగుటచేత అర్చారూపముననుండి సర్వజనులను చక్కగా కాపాడుటకై సర్వాధికుడగు వేంకటాచలాధీశ్వరుడుగా ఆవిర్భవించాడు.)

అనియు పెక్కుస్థలములందు వర్ణించినరీతిగ వర్ణాశ్రమభేదములేక సర్వమానవులను రక్షించుటకై అవతరించిన శ్రీవేంకటాద్రిప్రభువును ఎల్లవారును సేవించి కృతార్థులయ్యే భాగ్యం ప్రాప్తమైనది.

**“ఘుష్యతే సంఘశ శ్చోచ్చై ర్గోవిందేతి పునః పునః”**

(భక్తులు గుంపులు గుంపులుగా చేరి గోవిందా, గోవిందా! అంటూ ఉచ్చైస్వరంతో ఘోషిస్తుంటారు.)

అనినవిధంగ నైమిశారణ్యవాసులైన కొందరు మహర్షులు శుకమహర్షిముఖమున శ్రీవేంకటాచలమహిమను విని శ్రీవేంకటాచలయాత్ర చేయునపుడు (అనర్హ) నామాంతరములను విడచి “సదా గోవిందకీర్తనమ్” అనినట్లు ‘గోవిందా!’ అనే నామమునే మాటిమాటికిని ఎలుగెత్తి ఉచ్చరించుచు యాత్ర సాగించినారని శ్రీవరాహపురాణముననున్న అర్థవిశేషమును మనసున తలపోసి ఈ వేంకటాచలము దేవతాంతరసంబంధ గంధములేని విష్ణుక్షేత్రమనియే లోకమందు పండితపామర సాధారణంగా అందరికీ తెలిసేలా లోకమందు యాత్రాపరులగు పరమభాగవతులును ఆ పరమఋషులవలె అడుగడుగున గోవిందనామోచ్చారణము చేయుచు యాత్ర ఒనర్చునట్లు నియమము కల్పించాడు.

> ధరణిఁ జరాచర భూతములరయఁగ
> జనియించి యందె యణఁగిన పగిదిన్।
> హరిచేఁ బుట్టిన విశ్వము హరియందె
> లయంబునొందు నది యెట్లన్నన్॥
>
> **శ్రీహరి వలనే విశ్వమంతా జనిస్తున్నది. ఆయన వలనే నిలుస్తున్నది, లయాన్నీ పొందుతోంది. హరిలీలలు అనంతము. అద్భుతము. శ్రీహరిని ఆరాధించిన జీవితమే జీవితము.**

**“కృతమాలానదీతీరే విశ్వంభరకృతే హరిః,
ఆవిరాసీ ద్రఘువరో విభీషణభయాపహః”**

(విశ్వంభర మహామునికొరకై కృతమాలానదీ (వైగై అను ఏరు తీరమున శ్రీహరి (శరణాగతుడగు) విభీషణుని భయమును పోకార్చిన రఘువరుడై ఆవిర్భవించాడు.

అనినట్లు వాసిష్ఠరామాయణమున ప్రతిపాదించిన తీరుగ ‘వైగై’ (కృతమాల) అనే నదీతీరమున దక్షిణమధురాపురికి పడమటిదిక్కుననున్న ‘కలవింకపురము’ (కురువిత్తురై) అనే నగరమున విశ్వంభర నామధేయుడైన ఒకమహాముని, ‘చక్రవర్తి కుమారుడు’ (శ్రీరామచంద్రుడు) సముద్రతీరమందు విభీషణ విషయమున –

**"ఆనయైనం హరిశ్రేష్ఠ దత్తమస్యాఽ భయం మయా"**

(ఓయి వానరోత్తమా! అతనికి (విభీషణునకు) నే నభయమొసగితిని. ఆతనిని తోడ్కొని రమ్ము.)

అని అభయప్రదానము చేసిన అనుగ్రహవృత్తాంతమున మిగుల ఆసక్తుడై అట్టి సన్నివేశమును తనకు చూపి అనుగ్రహింపవలెననుచు భగవంతునిగూర్చి తపమొనర్చాడు. అప్పుడు భగవంతుడు ఆ ఆశ్రితునియెడ కృపతోడ అతనికి స్వప్నమున తాను తన తమ్ముడును ధనుర్ధరులై ఉన్నట్లును తమ సన్నిధానమున.

**"విభీషణకృతే సర్వం విజ్ఞాప్య హరిపుంగవః.**
**యథేష్టం కురు రాజేంద్రేత్యుచ్చర న్నంజలిం వ్యధాత్."**

(కపిశ్రేష్ఠుడు (సుగ్రీవుడు) విభీషణునికొరకై సమస్త విషయములను విన్నవించి 'రాజేంద్రా! నీ అభీష్టముప్రకారం చేయుము' అని పలుకుచు అంజలి ఘటించాడు.)

అనినవిధముగ మహారాజగు విభీషణాళ్వాన్ (విభీషణుడు) కొరకై తగు మాటలాడి చిత్తము వచ్చినరీతిగ జేసి అనుగ్రహింపుడని బద్ధాంజలియై సేవించుచున్నట్లును, శ్రీఆంజనేయస్వామియు 'స ఏష దేశః కాలశ్చ' (ఇయ్యది (అనుకూలమైన) దేశము, కాలమును) అని విభీషణుని స్వీకరించుటకు ఉచితములగు కొన్ని విజ్ఞప్తులను రామచంద్రుని సన్నిధి దగ్గర నిలిచి విజ్ఞాపన చేయుచున్నట్లును,

**"వాలిసూను ర్మహాతేజాః విభీషణ ముపస్థితమ్,**
**దర్శయంతం తదాకాశే నిర్దిశ్యోద్ధృతపాణినా."**

అన్న తీరుగ అంగదుడు ఆకాశమున వచ్చి నిలచి ఉన్న విభీషణుని అంగుళినిర్దేశమున చూపుచున్నట్లును వాసిష్ఠ రామాయణమున ఉన్న తీరున దర్శనమీయగ కాంచి మేల్కొని ఆ సన్నివేశవిశేషము తమకు నిత్యోపాసనార్హమగునట్లు అర్చారూపమున నిర్మించుకొని పెద్దకాలమారాధింపబడిన శ్రీరామచంద్రుడును శ్రీలక్ష్మణస్వామియు, కలవింకపురమనెడు ఆదిత్య నగరమున మతాంతరస్థుల ఉపద్రవము ప్రసక్తము కాగా ఒక భక్తుని ముఖమున తమను తిరుమల అడివారమునకు కొనిపోవవలసినదిగా చెప్పారు. ఆ భక్తుడును అట్లే వారిని భక్తితో కొనిపోయి, తిరుపతిలో శ్రీభగవద్రామానుజుల సన్నిధికి చేర్చినాడు. అప్పుడు శ్రీరామానుజాచార్యులవారు శ్రీశైలపూర్ణుల సన్నిధిలో ప్రవచనము చేయుచున్న శ్రీరామాయణమున విభీషణునకు అభయమిచ్చు సందర్భమైయుండెను. తిరుమలనంబియు (శ్రీశైలపూర్ణులు), శ్రీభగవద్రామానుజులును వీరు (రామలక్ష్మణాదులు) అచింతితముగ విజయము చేసియుండుట గని ఉల్లమున సంతస ముప్పతిల్ల వారిరాక తీరు విని హర్షించినాడు. విభీషణు ననుగ్రహించినట్లు ఇప్పుడీ యభయప్రదాన సందర్భమున మనలను అనుగ్రహించుటకై వీరు విజయము చేసినారని నిర్ణయించినారు. మునుపు రావణభవనమునుండి జానకీదేవి వచ్చి శ్రీరామచంద్రుని చేరినట్లు వీరికి వివాహ మహోత్సవము జరుపవలెనని నిశ్చయించి సీతాదేవి విగ్రహము నొకదానిని నిర్మింపజేయ సంకల్పించి శ్రీరామచంద్రునకు వివాహము జరిపించి పాదప్రణామము చేసి మంగళాశాసన మనుష్ఠించి 'త్రచ్చిన పాలసంద్రముననుండి కాలనేమిని సంహరించి' అని ఆరంభమయి, 'సప్తసాలములను భేదింప బాణముల ప్రయోగించి వేంకటాద్రి చేరిన భగవంతుని దివ్యపాదములను పొంది ఎల్లప్పుడు నుజ్జీవింపుడు' అను భావము గల నమ్మాళ్వారులనుగ్రహించిన శ్రీసూక్తి సత్యమగునట్లుగ తిరుమలయందు శ్రీవేంకటాచలపతి సన్నిధానమున ప్రతిష్ఠ చేయించి నిత్యారాధనము సలుప నేర్పాటు గావించారు. ***(ఇంకా ఉంది)***

## వైకుంఠపాళి

## :: 73 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 దే | వాం | 2 త | కు | డు | | 3 పా | | 4 గాం |
| వా | | టి | | | | క | | గే |
| 5 పి | త | | 6 ని | కృ | తి | | 7 కా | యు |
| | | 8 ప్ర | | ష్ణ | | 9 శ్రు | | డు |
| 10 దే | వ | యా | ని | | 11 కం | తు | డు | |
| వ | | గ | | 12 బిం | | డు | | 13 వ |
| 14 శ్రు | తి | | 15 కం | దు | డు | | 16 గా | సి |
| తు | | 17 ని | | మ | | 18 డి | | ష్ఠ |
| డు | | 19 జ | యం | తి | | 20 చం | ద్రు | డు |



పండితులైనవారు నిందలకు చలించరు, పొగడ్తలకు స్పందించరు

మన మహర్షులు


# జ్ఞానమార్గ సాధకుడు శుకమహర్షి

- కీ.శే. జానమద్ది హనుమచ్ఛాస్త్రి

వేదవ్యాస పుత్రుడు శుక మహర్షి. వ్యాసులు స్వయంగా కుమారునికి ఆధ్యాత్మిక శిక్షణ ఇచ్చారు. మరింత విస్తృత జ్ఞానం కోసం మిథిలానగర చక్రవర్తి జనక మహారాజు వద్దకు పంపారు. జనక మహారాజు మహాజ్ఞాని, రాజర్షి, జనకుడు కూడా బ్రహ్మజ్ఞానం పొందిన వాడు. ఆయనకు 'దేహభావన' ఉండేది కాదు. నిరంతరం 'ఆత్మ భావం'తోనే ఉండేవారు. ఒకనాడు అతని వద్దకు శుకమహర్షి వచ్చాడు.

శుకదేవుడు తన వద్దకు రానున్న విషయం జనక మహారాజుకు ముందే తెలుసు. కాని ఋషిపుత్రుడు రాజద్వారం చేరినా పలకరించేవారే లేరు. స్వాగతమిచ్చేవారూ లేరు. ఎవరో వచ్చి ఆశీనులవ్వమన్నారు. శుకదేవుడు కూర్చున్నాడు. మూడు రాత్రులు అక్కడే ఉన్నా, మీరెవరని గానీ, ఎందుకువచ్చారని గానీ పట్టించుకున్నవారు లేరు. రాజభటులు, ద్వారపాలకులు అటూ ఇటూ తిరుగుతున్నారు తప్ప ఆ మహర్షి వైపు చూడటం లేదు. శుకదేవులు మహనీయులైన వేదవ్యాసుల సుపుత్రులు, రాజాధిరాజుల మన్ననలందుకొన్న మహాత్ములు, అయినా రాజమందిర ద్వారపాలకులు కూడా అతడిని పట్టించుకోక పోవడమేమిటి!

ఒకరోజు మంత్రి పుంగవులు, ఉన్నతాధికారులు అక్కడకు వచ్చారు. రాజమర్యాదలతో స్వాగతం పలికారు. ఏమిటి ఈ ఆకస్మిక మర్యాదలు? మహర్షిని పరమానందంతో నిండుగా అలంకరించిన రాజమందిరానికి తీసుకువెళ్ళారు. సుగంధద్రవ్యాలతో స్నానం. మధుపర్కాలతో మెత్తని పాన్పులు సమకూర్చారు. ఇలా వారం రోజులపాటు రాజభోగాలు జరిపారు. శుకమహర్షికి ఇంత జరిగినా, వారి వైఖరిలో మార్పు లేదు. మహాద్వారం వద్ద నిరాదరణకు గురైనా, ఇప్పుడు రాజభోగాలు అనుభవిస్తున్నా చెదరని ప్రసన్నవదనం అతనిది.



మూడురోజుల తరువాత శుకదేవులను జనకమహారాజు ఆస్థానానికి ఆహ్వానించారు. సంగీత, నృత్యాదులను తిలకిస్తున్నాడు

జనకుడు. పాలతో నిండిన ఒక రజతపాత్రను శుకమహర్షికి ఇచ్చి, 'దీన్ని పట్టుకుని ఒక్క చుక్క పాలుకూడా కింద పడకుండా సభా భవనాన్ని ఏడుసార్లు చుట్టిరండని' అన్నాడు జనకుడు. ఎంతటి కఠిన పరీక్ష? శుకదేవుడు నవయువకుడు. సభా భవనంలో వినసొంపైన గానం, గానానికి అనుగుణంగా సుందరీమణుల నృత్యసంరంభం. ఎంత విరాగులైనా ఆ వైభవాలకు సమ్మోహితులు కావాల్సిందే. అలాంటి తరుణంలో నవయువకుడికి ఇది ఎలా సాధ్యం? ప్రశాంతమైన ప్రాంతంలోనైనా పాలు దొర్లక తప్పదు. కానీ శుకదేవుడు జనకుడు చెప్పినట్లు చేసి తిరిగి తన ఆసనం అలంకరించాడు. జనకుడు సంతృప్తి చెంది ఇలా అన్నాడు–

"ప్రియమైన శుకదేవా! మీ తండ్రిగారి బోధనను పూర్తిగా జీర్ణం చేసుకున్నారు. నేను మీకు బోధించవలసినదేమీ లేదు. మీరు సత్యాన్ని గ్రహించారు. ఇక మీరు మీ ఆశ్రమానికి వెళ్ళవచ్చు".

ఈ సంఘటన ముఖ్యంగా నాలుగు మహత్తరమైన విషయాలను తెలుపుతుంది. మొదటిది ముందుగానే శుకమహర్షి మహాజ్ఞాని. అంతేకాకుండా త్రికాలజ్ఞాని అయిన తండ్రివద్ద ఆధ్యాత్మిక శిక్షణ జరిగింది. అయినా మరింత జ్ఞాన సముపార్జన కోసం జనక మహారాజు వద్దకు పంపడం గమనార్హం. జ్ఞానం అనంతమైనదని సూచిస్తుందీ సంఘటన. ఇక రెండవ విషయమేమంటే–ఋషి పుత్రునికి రాజర్షి మందిరంలో ఎదురైన అనాదరణ. ఎంతటి నిరభిమానులకైనా భరించనలవిగాని వాతావరణం, అలాంటి పరిస్థితుల్లోకూడా ప్రశాంతచిత్తుడై ఉన్న శుకదేవుల వ్యక్తిత్వం మనోహరం, నిరుపమానం.

మూడు రోజుల భయంకరమైన నిరాదరణ అనుభవించిన తరువాత భవ్యమైన రాజమర్యాదలకు ఆయన చలించక పోవడం మూడవ అంశం.

ఇక నాల్గవ అంశం– జనకమహారాజు శుకదేవునికి జ్ఞానబోధ చేసిన తీరు. సుందరాంగుల నృత్యవిన్యాసాలతో ఉన్న సభ చుట్టూ, నిండు పాలపాత్రతో ఒక్క చుక్కకూడా నేలరాలకుండా చుట్టి రమ్మనడం. అటువంటి కఠిన పరీక్షల్లో సైతం నెగ్గగలిగాడు. ఎలా అంటే– మానావమానాలను సమచిత్తంతో చూసే సామర్థ్యంవల్ల, చిత్తస్థైర్యాన్ని వ్యక్తం చేయడంవల్ల. శుకదేవుడు బ్రహ్మసాక్షాత్కారం అందుకొని నిర్వికారస్థితిలో ఉన్నాడని నిరూపించేందుకు ఇంతకంటే మహత్తరమైన నిదర్శనం కావాలా? 'తానింక చెప్పవలసింది ఏమీ లేదంటూ' రాజర్షి అయిన జనకుని నుండి మహర్షికి యోగ్యతా పత్రం లభించింది.

## శిష్యపరీక్షలో మరికొన్ని ముఖ్యాంశాలేమంటే...

01) మొదటిది శుకదేవుడు ప్రకటించిన ఏకాగ్రత. జ్ఞాన సముపార్జనకు అత్యవసరమైన సాధన ఏకాగ్రత. జ్ఞాని అయినవారి అపూర్వమైన లక్షణం 'ఏకాగ్రత'.

02) రెండవది వేదవ్యాసులవారి విషయం. స్వయంగా దివ్యజ్ఞానసంపన్నులైనా, తమ పుత్రుని మరొక దివ్యజ్ఞాని వద్దకు పంపడం మహోత్కృష్ట విషయం కాదా?

03) మూడవది తాను మహర్షిపుత్రుడు. అంతకు మించి పరిపూర్ణజ్ఞాని అయిన జనకమహారాజు నుంచి తత్త్వార్థాన్ని తెలుసుకునేందుకు వెళ్ళడం అతని 'నమ్రతకు' నిదర్శనం.

అందుకే **'విద్యా దదాతి వినయం', 'వినయేన శోభతే విద్యా'** అన్న సూక్తిసాకారమే 'శుకదేవుడు'.


### భక్తులకు విజ్ఞప్తి



**కోవిడ్- 19 మూడవ వేవ్ 'ఓమిక్రాన్' రూపంలో దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న నేపథ్యంలో శ్రీనివాసుని దర్శనార్థం వచ్చే భక్తులకు ఇవి తప్పనిసరి!!**



- కోవిడ్ వ్యాక్సినేషన్ సర్టిఫికేట్ (లేదా)
- 48 గంటలకు ముందు చేయించుకున్న ఆర్.టి.పి.సి.ఆర్. పరీక్ష నెగటివ్ సర్టిఫికేట్
- అలిపిరి చెక్ పాయింట్‌లో ఖచ్చితంగా ఇవి చూపిస్తేనే తిరుమలకు దర్శనార్థం సెక్యూరిటీవారు అనుమతిస్తారు.
- తిరుమల తిరుపతి దేవస్థానమునకు సంబంధించిన ఇతర ఆలయాల్లో కూడా ఈ కోవిడ్ నిబంధనలు భక్తులు తప్పనిసరిగా పాటించాలి.
- భక్తులు విజిలెన్స్ మరియు సెక్యూరిటి వారికి సహకరించాలి.
- ప్రశాంతమైన మనస్సుతో స్వామివారిని దర్శించండి.

## 108 దివ్యదేశాలు

శ్రియఃపతియైన శ్రీమన్నారాయణుడు చేతనోజ్జీవనార్థం స్వీకరించినటువంటి స్వరూపములు ఐదువిధములని శాస్త్రములు తెలియజేయుచున్నవి. అవి 1)పరరూపము, 2)వ్యూహ రూపము, 3)విభవరూపము, 4)అంతర్యామిరూపము, 5)అర్చా రూపము అనేవి. ఇందులో చివరిదైన 'అర్చారూపము' విశేషించి భూలోకంలో సకలజనుల నయనగోచరుడై శ్రీరంగం మొదలుకొని 108 దివ్యస్థలములలో దివ్యమంగళవిగ్రహ విశిష్టుడై కొలువుదీరి అనుగ్రహించేటటువంటి దివ్యరూపం. తిరుప్పాల్‌కడల్ (పాలకడలి) శ్రీవైకుంఠం అని పైలోకంలో వేంచేసియున్న దివ్యస్వరూపం సాక్షాత్తు దేవదేవుడైన లక్ష్మీవల్లభుడు తనకు తానుగానే ఈ క్షేత్రాలలో వేంచేసి భక్తానుగ్రహకారకుడై విరాజిల్లుచున్నాడు. ఇటువంటి మహిమాన్వితుడైన పురుషోత్తముని శ్రియఃపతి యొక్క పరివారములుగా పరిగణించబడుచున్న అనంత-గరుడ-విష్వక్సేన ఆయుధాభరణాలు ఇహ పృథ్వీలోకంలో భగవదాజ్ఞతో ఆళ్వారులుగా అవతరించారు. అగాధ భగవద్భక్తి సింధువులైన పన్నిద్దరు ఆళ్వారులచేత కీర్తింపబడిన దివ్యక్షేత్రాలే 'దివ్యదేశములు'గా, 'దివ్యతిరుపతులు'గా కొనియాడబడుతున్నాయి. అవి మొత్తం 108. వాటి విభాగము క్రింద చూపబడుతున్న విధంగా ఉంటుంది.

| | | |
|---|---|---|
| 1) చోళనాడు | - | 40 |
| 2) పాండ్యనాడు | - | 18 |
| 3) మలైనాడు | - | 13 |
| 4) నడునాడు | - | 02 |
| 5) తొండైనాడు | - | 22 |
| 6) వడనాడు | - | 12 |
| 7) తిరునాడు | - | 01 |
| | | ------- |
| మొత్తం | - | 108 |
| | | ------- |

ఒక్కొక్క దివ్యదేశములో దేవదేవుని దివ్యరూపం అత్యద్భుతముగా విలసిల్లియుండును. ఒక్కొక్క దివ్యదేశానికి స్థలపురాణాలు, ఇతిహాసములు, ఆళ్వారుల దివ్యప్రబంధాలు, ఆచార్యుల స్తోత్రాలు ఇలా ఎన్నో భక్తు లను విశేషముగా ఆకర్షించును.

మన సౌభాగ్యవిశేషముచేత 'కోయిల్' అనే ప్రసిద్ధిగాంచిన శ్రీరంగం మొదలుకొని శ్రీవైకుంఠంవరకు గల దివ్యదేశ వైభవాన్ని తిరుమల తిరుపతి దేవస్థానముల 'సప్తగిరి' మాసపత్రిక ద్వారా తెలుసుకొని తరిద్దాం....



# శ్రీరంగవైభవం

– ఆచార్య చక్రవర్తిరంగనాథన్

శ్రియఃపతియైన శ్రీమన్నారాయణుడు పర–వ్యూహ–విభవ–అంతర్యామి–అర్చా అనే ఐదురూపాలలో విరాజిల్లుతున్నాడు. అందులో అర్చావతారరూపముతో సకలజనుల నయన గోచరుడిగా దివ్యమంగళవిగ్రహవిశిష్టుడుగా విశేషించి భూలోకంలో ఆయా దివ్యక్షేత్రాలలో కొలువుదీరి భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ప్రధానంగా భగవదాజ్ఞతో ఇహలోకంలో ఆళ్వారులుగా అవతరించినటువంటి పన్నిద్దరులచేత స్తుతింపబడిన దివ్యమూర్తులు కొలువుదీరినక్షేత్రాలను **దివ్యదేశములుగా**, దివ్యతిరుపతులుగా మహాత్ములు కీర్తించియున్నారు. అవి మొత్తం 108 దివ్యక్షేత్రాలు. అందులో మొట్టమొదటి దివ్యదేశంగా పరిగణింపబడుతున్నది **'శ్రీరంగక్షేత్రం'**. 'కోయిల్' అని ఈక్షేత్రాన్ని తమిళసంప్రదాయం కొనియాడుతున్నది. ఈక్షేత్ర వైభవాన్ని ప్రాశస్త్యాన్ని క్షేత్రాధీశుడైన శ్రీరంగనాథునియొక్క మహిమను ఇంచుక తెలుసుకోవడానికి ప్రయత్నిద్దాం.

శ్రీమన్నారాయణుడు స్వయముగానవతరించిన (స్వయంవ్యక్త) ఎనిమిదిక్షేత్రాలలో **శ్రీరంగం** మొట్టమొదటిది. దివ్యదేశాలలో మొట్టమొదటిది. **తిరువరంగం, పెరియకోయిల్. భూలోకవైకుంఠం, భోగమండపం** అని ఈ క్షేత్రానికి గల ప్రసిద్ధ పేర్లు. ఈ ఆలయానికి ఘనమైన చరిత్ర కూడా ఉన్నది.

ఈ ఆలయం ఒక గొప్పసామ్రాజ్యానికి చెందిన చారిత్రక గత వైభవాన్ని వేలాదిసంవత్సరాలనాటి అద్భుతమైన నాగరికతను చాటి చెబుతుంది.

ఉభయకావేరీనదీమధ్యలోగల ఒక ద్వీపంలో 156 ఎకరాల విస్తీర్ణంలో ఏడుప్రాకారాలతో అనేక గోపురాలతో విలసిల్లు భూలోకవైకుంఠమే శ్రీరంగం. ఈ ఆలయముఖద్వారమైన రాజగోపురం ఆసియా ఖండంలోనే అతిపెద్దగోపురం. శ్రీమదహోబిల మఠాధీశులైన శ్రీశ్రీశ్రీవేదాంతదేశికయతీంద్ర మహా దేశికన్ అనే 44వపీఠాధిపతియైన శ్రీమదళగియ సింగర్ చేత ఈరాజగోపురం నిర్మించబడి ప్రపంచ ప్రఖ్యాతి గడించినది. ఈ ఆలయవైభవాన్ని స్వామి వైభవాన్ని మనం సంగ్రహంగానే తెలుసుకోగలం. ఎన్నో ఎన్నెన్నో ఉపాలయాలతో, కనివినీ ఎరుగని రీతిలో జరిగేటువంటి ఉత్సవవిశేషాలతో ఈఆలయం నిత్యం కళకళలాడుతూ ఉంటుంది. దాదాపు 322 రోజులు ఇక్కడ ఉత్సవాలే ఉత్సవాలు.

తమిళనాడులో తిరుచ్చికి సమీపంలో 8 కి.మీ. దూరంలో ఈ ఆలయం వెలసియున్నది. ఈ ఆలయంలో స్వామి ఎలా వేంచేసి యుంటాడు అని ఈ శ్లోకం ద్వారా తెలుసుకోగలం.

**సప్తప్రాకారమధ్యే సరసిజముకుళోద్భాసమానే విమానే**
**కావేరీమధ్యదేశే మృదుతరఫణిరాట్ భోగిపర్యంకభాగే।**
**నిద్రాముద్రాభిరామం కటినికటశిరః పార్శ్వవిన్యస్తహస్తం**
**పద్మా ధాత్రీ కరాభ్యాం పరిచితచరణం రంగరాజం భజేఽహమ్॥**

సప్తప్రాకారమధ్యలో ప్రణవాకారవిమానచ్ఛాయలో ఉభయకావేరీనదులమధ్య ఆదిశేషునిమీద పవళించి చతుర్భుజములతో శ్రీదేవి భూదేవులుతో విలసిల్లి యున్న శ్రీరంగనాథున్ని ఎల్లపుడూ మనం భజిద్దాం. శ్రీరామకృష్ణాది అవతారాలకు క్షీరాబ్ధినాథుడు మూల కందమగునట్టు అర్చావతారాలకు మూలకందము శ్రీరంగనాథుడే అని ఆర్యోక్తి. శ్రీరంగం పరమ పదంగా శ్రీవైకుంఠంగానే భావింపబడుతున్నది.

**కావేరీ విరజా సేయం వైకుంఠం రంగమందిరమ్।**
**స వాసుదేవో రంగేశః ప్రత్యక్షం పరమం పదమ్॥**

అని శ్రీవైకుంఠంలోనున్న విరజానదియే, ఇచట నున్న కావేరి. శ్రీరంగమందిరమే శ్రీవైకుంఠం. వైకుంఠాధిపతియైన వాసుదేవుడే శ్రీరంగనాథుడు. ఇదియే పరమపదం.

ఈక్షేత్రప్రాశస్త్యాన్ని శ్రీరంగనాథుని మహిమను శ్రీవేదాంతదేశికులు అనే ఆచార్యులు ఒకే ఒక పాశురంద్వారా వివరిస్తున్నారు. **'అధికారసంగ్రహం'** అనే దేశికప్రబంధంలో 42వ పాశురం-

**ఆరాద అరుళముదం పొదిన్దకోయిల్**
**అమ్బుయత్తోన్ అయోత్తి మన్నర్ క్కళిత్తకోయిల్**
**తోలాదతనివీరన్ తొళుదకోయిల్**
**తుణైయాన వీడణర్కు తుణైయామ్ కోయిల్**
**శేరాద పయనెల్లాం శేర్ క్కుం కోయిల్**
**శెళుమఱైయన్ ముదలెళుత్తుచ్చేర్ న్దకోయిల్**
**తీరాదవినైయనైత్తుం తీర్ క్కుం కోయిల్**
**తిరువరంగమెనత్తికళుం కోయిల్ దానే**


శ్రీరంగక్షేత్రం-ఎంత అనుభవించినా తీరనిది. కరుణయే మూర్తీభవించినది అయిన శ్రీరంగనాథు డనే అమృతం నిండిన కోయిల్-కోవెల-దేవాలయం. నారాయణుని నాభీకమలంలో నివసించే బ్రహ్మ దేవునిద్వారా అయోధ్యాధిపతియైన ఇక్ష్వాకుకు ప్రసా దించిన దివ్యదేవాలయం.





తదనంతరం **ఇక్ష్వా కూణాం కులధనం** అన్న రీతిగా ఇక్ష్వాకునుండి సాటిలేని మేటి వీరుడైన రామచంద్రప్రభువుచేత ఆరాధించబడిన దివ్యకోవెల. రామభద్రునికి సహాయమైన విభీషణునకు ప్రసాదించిన అతనికి రక్షకమై ఉండే దేవాలయం. సమస్తమైన ఫలాలను వెంటనే ప్రసాదించే దివ్యదేవాలయం. శ్రేష్ఠమైన వేదాలలోని మొదటి అక్షరమైన ప్రణవం ఓంకారరూపంలో విలసిల్లే అత్యద్భుతమైన కోవెల. ఇకదేని వల్లకూడ తీరనటువంటి సమస్తపాపాలను అన్నింటినీ తీర్చేటటువంటి తిరువరంగం అని పిలువబడేటటు వంటి దేవాలయం, ఆ దేవాలయమే **శ్రీరంగంగా** ప్రసిద్ధిగాంచినది అని ఈ పాశురంయొక్క తాత్పర్యం. ఈ పాశురంయొక్క సారాన్ని మరొకకోణంలో పరిశీలిస్తే– వైవస్వతమనువు కుమారుడు ఇక్ష్వాకుమహారాజు. అతడు బ్రహ్మను గూర్చి తపస్సుచేసి, తపః ఫలితంగా బ్రహ్మదేవుని ఆరాధనాదైవమైన శ్రీరంగనాథుణ్ణి పొంది, తదుపరి ఆ విగ్రహం రామచంద్రులవారికి సంప్రాప్తించగా, రామభద్రుడు విభీషణునికి ప్రసాదించగా, విభీషణుడు లంకకు తిరిగివస్తూ సంధ్యావందనం కొరకు ఉభయకావేరీమధ్య, అక్కడ స్వామిని వేంచేపు చేసి సంధ్యావందనం చేసి తిరిగివచ్చి చూడగా, ప్రణవాకారవిమానంలో శ్రీరంగనాథుడు వేంచేసి ఉండడం చూసి తిరిగి తీసుకొని వెళ్లడానికి ప్రయత్నించగా, శ్రీరంగనాథుని సంకల్పముచేత భూమ్యాకర్షణవలన అక్కడ ఉంచిన బ్రహ్మ కరార్చితమైన శ్రీరంగనాథుని దివ్యమంగళ అర్చామూర్తి ఇంచుకూడా కదలకుండుట చూసి, స్వామి సంకల్పమును ఎరుగని విభీషణుడు మిక్కిలి దుఃఖించుచుండగా, భక్తవత్సలుడైన శ్రీరంగనాథులువారిని ఊరడించి, అనుగ్రహించారు. నాటినుండి శ్రియఃపతియైన నారాయణుడు భక్తజనసంరక్షణార్థం ఉభయ కావేరీమధ్యగల దివ్యక్షేత్రమైన శ్రీరంగమందు రంగనాథుడిగా అర్చామూర్తి స్వరూపుడై సకలజీవకోటిని లీలామాత్రముచేత సంరక్షిస్తూ ఉన్నాడు. నిత్యమూ భగవంతుని సాన్నిధ్యములో ఉండే భగవంతుని ఆయుధవిశేషములు, భగవంతుని విడిచి ఉండలేక భువియందు భగవద్భక్తులైన ఆళ్వారులుగా అవతరించి, అర్చామూర్తియైన ఆ నారాయణుని అనేకవిధాలైన పాశురాలతో, స్తోత్రాలతో సేవిస్తూ, భగవంతుని దివ్యవైభవాలను భక్తలోకానికి అనుగ్రహిస్తూ లోకానికి మహదుపకారము గావించిరి. అదేవిధముగా ఈ దివ్యక్షేత్రమైన శ్రీరంగమునందు కూడా ఆళ్వారుల ఆగమనం, వారిచే స్వామివారికి జరిగిన వైభవోత్సవాలు అనంతములు, అనిర్వచనీయములు. వారి యందు నమ్మాళ్వార్లు, పెరియాళ్వార్లు, తిరుమంగైఆళ్వార్లు, తిరుప్పాణాళ్వార్లు ప్రసిద్ధులు.

ఈ శ్రీరంగక్షేత్రమునందు పాంచరాత్రాగమోక్త ప్రకారముగా నిర్వర్తించు నిత్యోత్సవ–వారోత్సవ– పక్షోత్సవ– మాసోత్సవ– సంవత్సరోత్సవాది అనేక ఉత్సవాలను దర్శించుటకు రెండుకళ్ళు చాలవు. ముఖ్యముగా ఈ క్షేత్రమునందు నాలుగు బ్రహ్మోత్సవాలు ప్రతిసంవత్సరమునందు శాస్త్రోక్తముగా జరుగును. వీటిలో మకర మాసమున జరుగు ఉత్సవానికి **'భూపతి తిరునాళ్లు'** అని పేరు. కుంభమాసమున జరుగు ఉత్సవము **'ఎంబెరుమనార్ల'** చేత ఏర్పాటు చేయబడినది. మీనమాసమున జరుగు ఉత్సవమును ఆద్యకర్తులు సాక్షాత్తు **'చతుర్ముఖబ్రహ్మ'**గారు. అలాగే మేషమాసమున జరుగు ఉత్సవమునకు **'విరుప్పన్ తిరునాళ్లు'** అని పేరు. ఇవిగాక...













అధ్యయనోత్సవాలు సంప్రదాయబద్ధంగా జరుగుతుంది. ఈదివ్యక్షేత్రం సప్తప్రాకారా లతో విరాజిల్లుతున్నది. ఒక్కొక్క ప్రాకారానికి ఒక్కొక్క విశేషం గలదు. రంగరంగ అని భక్తులు రంగనామస్మరణచేస్తూ కీర్తిస్తూ మాడవీథుల్లో పరవశిస్తూ సంచరిస్తారు.

'పదిన్మర్ పాడుం పెరుమాళ్' అని పది మంది ఆళ్వారుల చేత స్తుతింపబడిన దేవ దేవుడు శ్రీరంగనాథుడు దాదాపు 250 పాశురాలు శ్రీరంగక్షేత్రమాహాత్మ్యాన్ని శ్రీరంగనాథుని మహిమను వర్ణించే విధంగా అమరియున్నవి. పరాశరభట్టర్, వేదాంతదేశికులు ప్రభృతి ఆచార్యులు శ్రీరంగనాథుని మహిమను అత్యద్భుతంగా రమణీయంగా తమ స్తోత్రముల ద్వారా ప్రశంసించియున్నారు. భగవద్ధ్యాన సోపానం అనే స్తోత్రంలో "పాదాంభోజం స్పృశతి భజతే" అనే శ్లోకం నయనం మధురం, వదనం మధురం, అధరం మధురం అన్నట్టుగా శ్రీరంగనాథుని అవయవసౌందర్యాన్ని చక్కగా తెలియ జేస్తున్నది. కాబట్టి మనమందరమూ దివ్య మంగళస్వరూపుడైన, అనంతకల్యాణ పరి పూర్ణుడైన, ఆ శ్రీరంగక్షేత్రాధిపతుడైన రంగ నాథున్ని సేవించి తరిద్దాం.


**కావేరీ వర్ధతాం కాలే కాలే వర్షతు వాసవః।**
**శ్రీరంగనాథో జయతు శ్రీరంగశ్రీశ్చవర్ధతామ్॥**










తిరుపతి
శ్రీగోవిందరాజస్వామివారి
తెప్పోత్సవం
(10-02-2022 నుండి
16-02-2022 వరకు)

# ద్వాదశ

1



**చైత్రం-ధాత**

ధాతా శుభస్య మే దాతా
భూయో భూయోఽపి భూయసః ॥

2



**వైశాఖం-అర్యముడు**

అర్యమా తు సదా భూత్యై
భూయస్యై ప్రణతస్య మే ॥

3



**జ్యేష్ఠం-మిత్రుడు**

మిత్రోఽస్తు మమ మోదాయ
తమస్తోమవినాశనః ॥

7



**ఆశ్వయుజం-త్వష్ట**

త్వష్టా శుభాయ మే భూయాత్
శిష్టావళినిషేవితః ॥

8



**కార్తికం-విష్ణువు**

గాయత్రీప్రతిపాద్యం తం
విష్ణుం భక్త్యా నమామ్యహమ్ ॥

9



**మార్గశిరం-అంశుమంతుడు**

మునీంద్రనివహస్తుత్యో
భూతిదోఽంశుర్భవేన్మమ ॥

# ఆదిత్యులు

4



**ఆషాఢం-వరుణుడు**

వరుణో ధవళో జిష్ణుః
పురుషో నిమ్నగాధిపః ॥

5



**శ్రావణం-ఇంద్రుడు**

సహస్రరశ్మిసంవీతం
ఇంద్రం వరదమాశ్రయే ॥

6



**భాద్రపదం-వివస్వంతుడు**

నభోగ్రహమహాదీపం
వివస్వంతం నమామ్యహమ్ ॥

10



**పుష్యం-భగుడు**

ఘటికానాం చ యః కర్తా
భగో భాగ్యప్రదోఽస్తు మే ॥

11



**మాఘం-పూషుడు**

పూషా తోషాయ మే భూయాత్
సర్వపాపాపనోదనాత్ ॥

12



**ఫాల్గుణం-పర్జన్యుడు**

జగదానందజనకః
పర్జన్యః పూజ్యతే మయా ॥



02-12-2021న తిరుమల వసంతమండపంలో శాస్త్రోక్తంగా 'శ్రీధన్వంతరిపూజ' నిర్వహిస్తున్న దృశ్యం



19-12-2021న తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామి వారికి 'తెప్పోత్సవం' ఏకాంతంగా నిర్వహిస్తున్న చిత్రం





11-12-2021న అలిపిరివద్దగల 'సప్తగోప్రదక్షిణశాల'ను కంచిపీఠాధిపతి శ్రీ.శ్రీ.శ్రీ విజయేంద్రసరస్వతిస్వామివారు సందర్శించిన దృశ్యం. వీరికి తి.తి.దే.ధర్మకర్తలమండలి చైర్మన్ శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గారు, తి.తి.దే. పాలకమండలి సభ్యులు డా॥ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎం.ఎల్.ఏ., చెన్నై స్థానిక సలహామండలి చైర్మన్ శ్రీ శేఖర్ రెడ్డి మరియు తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ వి ధర్మారెడ్డి, ఐడిఇఎస్‌గారలు స్వాగతం పలుకుతున్న దృశ్యం.



16-12- 2021 న తిరుపతిలోని 'శ్రీపద్మావతిచిన్నపిల్లల హృదయాలయం'లో నూతనంగా ఏర్పాటు చేసిన 'అడ్వాన్స్‌డ్ కార్డియాక్ క్యాథెట్రేషన్' ల్యాబ్‌ను తి.తి.దే. బోర్డు చైర్మన్ శ్రీ వై.వి.సుబ్బారెడ్డి గారు ప్రారంభిస్తున్నచిత్రం. చిత్రంలో తి.తి.దే. తిరుపతి జె.ఈ.ఓ. శ్రీవీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., గారు మరియు ఇతర అధికారులు ఉన్నారు.



31-12-2021 తేదీన శ్రీవారు, అమ్మవార్లచిత్రాలకు 3డి ఎఫెక్ట్, సిల్వర్‌కోటింగ్‌తో ప్రత్యేకంగా రూపొందించిన 6పేజీల ప్రత్యేక క్యాలెండర్‌ను తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్‌రెడ్డి ఐ.ఏ.ఎస్. గారలు ఆవిష్కరించిన దృశ్యం. ఈ కార్యక్రమంలో అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్., తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., మరియు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.



# ఆనందనిలయుని తిరుచాన
# శ్రీఅలమేలుమంగ

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

'తిరుచాన' అంటే 'దివ్యకాంత' అని అర్థం. అందులోను ఆనంద నిలయుని 'తిరుచాన' అంటే శ్రీమహాలక్ష్మి. ఆ సిరులతల్లిని 'అల మేలుమంగ' అని కొందరంటారు. పుష్పంపైన ప్రకాశిస్తున్న శ్రీకాంతనే 'అలమేలుమంగ'. సహస్రదళాల బంగారుపద్మంలో ఆవిర్భవించింది కనుక ఆ జగన్మాతను 'పద్మావతి' అంటారు.

ఇంతకు ఈమె ఎవరు? ఎక్కడ ఉంటుంది. అంటే తిరుమల ఆనందనిలయుని పట్టపురాణి. ఈ తిరుచాన అర్చామూర్తిగా వెలసి ఉన్న దివ్యక్షేత్రం తిరుచానూరు. దీన్నే 'అలమేలుమంగపట్నం' అంటారు. తిరుపతికి ఆగ్నేయ మూలలో 3-4 కి.మీ. దూరంలో వెలసియున్న ఈ దివ్యక్షేత్రానికి నిరంతరం ఆటోలు, బస్సులు తిరుగుతుంటాయి. తిరుపతి నుంచి పట్టుమని పదినిమిషాల్లో చేరు కోవచ్చు.

పూర్వం ఈ ప్రాంతంలో శ్రీశుకమహర్షి ఆశ్రమం ఉండేదట. అందువల్ల 'శ్రీశుకుని ఊరు'గా పిలువబడింది. అదే 'తిరుశుక నూరు' అనీ, 'తిరుచ్చుకనూరు' అనీ పిలువబడుతూ చివరకు 'తిరుచా నూరు'గా మారిందని చారిత్రకుల మాట. తిరుచాన అంటే లక్ష్మీ కాంత. ఆమె ఉన్న ఊరు కనుక 'తిరుచాన ఊరు'గా పిలువబడిం దనీ, అదే 'తిరుచానూరు'గా అయ్యిందన్నది మరో కథనం.

ఈ ఊరు నడిబొడ్డున పద్మసరోవరం అనే కోనేరు ఉంది. ఈ కోనేట్లోనే శ్రీమహాలక్ష్మి బంగారు పద్మంలో 'పద్మావతి'గా, 'అలమేలుమంగ'గా అవతరించింది.

తిరుమలక్షేత్రం ఎంత ప్రాచీనమో, ఎంత అద్భుతక్షేత్రమో, అందున్న ఆనంద నిలయుడు ఎంత మహిమగలవాడో, అలమేలుమంగపట్నం అంతటిదే, అందున్న అలమేలు మంగమ్మ కూడా అంతటివారే!

శ్రీవైకుంఠం నుంచి కలియుగంలోని భక్తులకోసమే భువికి దిగివచ్చిన స్వామి ఏడుకొండలవాడు. భృగుమహర్షి చేసిన నిర్వాకం వల్ల లక్ష్మీవిరహుడైన వేంకటేశ్వరుడు, భక్తుల కోరికలను తీర్చలేక అనేకబాధలకు లోనయ్యాడు, అందువల్లే వైకుంఠంనుంచి అలిగి



వెళ్లిన శ్రీమహాలక్ష్మికోసం కొల్హాపురంక్షేత్రానికి వెళ్లి ఆమె అనుగ్రహం కోసం పదేండ్ల పాటు తపస్సు చేశాడు. ఇక్కడ నీకు దర్శనం ఇవ్వనుగాక ఇవ్వను అని ఖండితంగా ఆకాశవాణి ద్వారా చెప్తూతూ పద్మసరోవరతీరాన నీ కోరిక నెరవేరుతుందని ఆనతిచ్చింది. శుకమహర్షి ఆశ్రమప్రాంతంలో పద్మసరోవరాన్ని ఏర్పరచి లక్ష్మీదేవి అనుగ్రహం కోసం పన్నెండేండ్లపాటు తపస్సు చేశాడు.

ఒకానొక కార్తికమాసం శుద్ధపంచమీ శుక్రవారం అభిజిత్ లగ్నాన ఉత్తరాషాఢా నక్షత్రంలో పదహారేళ్ల నవయువతిగా శ్రీమహాలక్ష్మి పద్మసరోవరంలో సహస్ర దళాల బంగారుపద్మంలో ఆవిర్భవించింది. సమస్తదేవతలు, ఋషులు, యోగులు ఆ జగన్మాతను అనేకవిధాలుగా స్తుతించారు కీర్తించారు. 'పద్మావతి'గా, 'అలమేలుమంగ'గా అవతరించిన ఆతల్లిని హృదయంలో 'వ్యూహలక్ష్మి'గా ఉంచుకొని ఏడుకొండలవాడు 'శ్రీనివాసుడి'గా తిరుమలకు పయనమయ్యాడు. ఆ సమయంలో బ్రహ్మాది దేవతల కోరికపై ఆ జగన్మాత అర్చామూర్తిగా అక్కడే నిలిచి పూజలందుకొంటానని అంగీకరించింది. అయితే, స్వామి వారులేకుండా తానొక్కడే 'విరహలక్ష్మి'గా, 'వీరలక్ష్మి'గా వెలసి స్వతంత్రంగా సేవలను స్వీకరిస్తానని, అందరికోరికలు తీరుస్తానని వరాలను ప్రసాదించింది.

అందువల్ల తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించడం ఆమెకు కోరికలను విన్నవించుకోవడం ఎంతో శ్రేయోదాయకమేకాక, తమ యాత్ర కూడ పూర్తిగా ఫలవంతమవుతుంది.

తిరుచానూరులో అలమేలుమంగ నెమ్మదిగా కూర్చుని పద్మాసనియై అభయ వరదహస్తాలతో దర్శనమిస్తున్నది. స్వామివారివలె నిలబడికాక, నింపాదిగా కూర్చున్న ఈ తల్లి భక్తుల ప్రార్థనలను, కోరికలను నిదానంగా ఓపికగా వింటుంది. తాను విన్న వాటినన్నింటిని తిరుమలలో శ్రీవారివక్షఃస్థలంలో 'వ్యూహలక్ష్మి'గా ఉన్న ఆ జగన్మాత మరింత ఓపికగా ఓర్పుగా తన స్వామికి భక్తుల విన్నపాల్ని వినిపిస్తుంది. అంతటితో ఒప్పుకోకుండా, స్వామివారిపై ఒత్తిడి చేస్తుంది. ఆమె సిఫారసుకు తల వొగ్గుతూ, భక్తుల కోరికలను దర్శనమాత్రంచేతనే తీరుస్తూ, 'వరాలరాయడని' బిరుదును సార్థకం చేసుకొంటున్నాడు.

అంతేగాదు, పూర్వం ఎప్పుడో, ఏనాడో అటు ఆనందనిలయుడు, ఇటు 'అలమేలు మంగమ్మ' ఒకే ఎత్తులో ఉండేవారట, కాని స్వామివారికంటే కొంచెం ఎక్కువగా అమ్మవారికి ఉన్న 'దయ' అనే కాసింత బరువైన గుణంవల్ల భూమివల్ల భూమి కుంగిందట. అందువల్లే స్వామివారు ఎత్తులో ఏడుకొండలపైన, అమ్మవారు క్రింద తగ్గులోను ఉన్నారని పెద్దల మాట! నిజంగా ఎంతటి దయగల తల్లో గదా అలమేలు మంగమ్మ!



**శుక్రవారపుతోట ఉత్సవం**

**శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయానికి దక్షిణ దిక్కున కేవల వంద అడుగులదూరంలో అందమైన ఉద్యానవనం ఉంది. ఇదే 'శుక్రవారపు తోట'. చక్కగా తీర్చిదిద్దిన పూలమొక్కలతో పాటు అరటిచెట్లు ఉన్న విశాలమైన ఈ పూల తోటలో 16 శిలాస్తంభాలతో నిర్మింపబడిన 'వసంతమండపం' ఉంది. ప్రతి శుక్రవారం మధ్యాహ్న వేళలో ఇక్కడికి వేంచేసిన అలమేలు మంగమ్మకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, చందనం, పసుపు మున్నగు ద్రవ్యాలతో తిరుమంజనం జరుగుతుంది. పిదప చక్కగా అలంకరింపబడిన అమ్మవారికి నివేదనలు జరిగిన తర్వాత ఊరేగింపుగా వచ్చి, ఆస్థానమండపంలో జరిగే 'సహస్రదీపాలంకరణసేవ'లో భక్తులకు దర్శనమిస్తూ అనుగ్రహిస్తారు.**

**వసంతోత్సవాలు**

**ప్రతిఏటా వైశాఖమాసంలో పున్నమికి మూడురోజుల పాటు అలమేలుమంగకు వార్షిక వసంతోత్సవాలు జరుగుతుంది. ప్రతిరోజు నిత్యపూజాదులు అయిన తర్వాత అమ్మవారు 'శుక్రవారపు తోట' లోని వసంతమండపానికి వేం చేస్తారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో తిరుమంజనాలు ఘనంగా జరిగిన తర్వాత ఆలయం మహాప్రదక్షిణమార్గంలో ఊరేగింపబడతారు. పున్నమినాటి సాయంవేళ ప్రత్యేకంగా బంగారురథంలో అమ్మవారు ఊరేగింపబడతారు.**



ఈ జగన్మాతకు పాంచరాత్రగమం ప్రకారంగా సుప్రభాతం, సహస్రనామార్చన, శ్రీపద్మావతీపరిణయం, సహస్రదీపాలంకరణసేవ, ఏకాంతసేవ వంటి నిత్యోత్సవాలు; సోమవారం అష్టదళపాదపద్మారాధన, గురువారం తిరుప్పావడసేవ, శుక్రవారాభిషేకం, శనివారం పుష్పాంజలివంటి వారోత్సవాలు; వైశాఖమాస పున్నమికి వసంతోత్సవాలు, జ్యేష్ఠమాసంలో తెప్పోత్సవాలు, భాద్రపదమాసంలో పవిత్రోత్సవాలు, కార్తికమాసంలో లక్షకుంకుమార్చన, బ్రహ్మోత్సవాలు, పుష్పయాగంవంటి వార్షికోత్సవాలు శ్రీపద్మావతి అమ్మవారికి ఘనంగా అంగరంగ వైభవంగా నిర్వహింపబడుతున్నాయి.

## బ్రహ్మోత్సవాలు

ప్రతి ఏడాది కార్తికమాసంలో శుద్ధ పంచమినాడు పద్మావతి అమ్మవారి అవతార దినోత్సవం సందర్భంగా పదిరోజుల పాటు తిరుచానూరు క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. అంకురార్పణతో ప్రారంభమై 'పంచమితీర్థం'తో అనే చక్రస్నానంతో ఈ ఉత్సవాలు పరిసమాప్తమౌతాయి. ఇవి ప్రారంభమైన నాటినుండీ ప్రతిరోజూ రెండుపూటలా వివిధ వాహనాల్లో అమ్మవారి ఊరేగింపులు జరుగుతాయి. నాగదోష నివారణిగా, సంతాన ప్రదాతగా పెదశేష, చినశేషవాహనాల్లోను, విద్యాలక్ష్మిగా హంసవాహనంపైన, సంపదలను కురిపించే సంపత్‌లక్ష్మిగా కల్పవృక్ష వాహనంలోను, త్రేతాయుగంనాటి సీతాలక్ష్మినే నేను అంటూ 'హనుమద్వాహనం'లోను, 'ధనలక్ష్మి'గా పల్లకిలో, 'గజలక్ష్మి'గా గజవాహనంపైనా, బ్రహ్మాండ నాయకిగా 'సర్వభూపాలవాహనం'లోను, 'విజయలక్ష్మి'గా గరుడవాహనంపైనా, 'ఆదిలక్ష్మి'గా సూర్యప్రభలోను, 'సామ్రాజ్యలక్ష్మి'గా చల్లని చంద్రప్రభలోను సర్వలోకాలకు మహారాజ్ఞిగా అలమేలు మంగమ్మ దర్శనమిస్తారు. చివరగా, అశ్వ వాహనంలో భవభయహారిణిగా దర్శనమిస్తుంది అమ్మ అలమేలుమంగ!

## పంచమితీర్థం

చివరిరోజు అనగా కార్తికశుద్ధపంచమి నాడు అమ్మ అవతరించిన రోజు. ఆ రోజు తిరుమల శ్రీవారినుండి పట్టమహిషి అయిన పద్మావతి పుట్టినరోజు కానుకగా సారె వస్తుంది. అందులో చీర, రవికలు, చందనం, పసుపుకుంకుమలు, తులసి ప్రసాదాలు తిరుమల నుండి కాలినడకన మెట్లమార్గంలో పిదప, తిరుపతి నుంచి తిరుచానూరుకు ఏనుగు అంబారిపైన తీసుకువస్తారు. శ్రీవారు పంపిన పసుపు, కుంకుమ, చందన, తులసీ వగైరాలతో సరోవరతీరాన శ్రీపద్మావతి అమ్మవారికి, సుదర్శనభగవానునికి తిరుమంజనం ఘనంగా జరుపబడుతుంది. పిదప, శుభ ముహూర్తంలో పద్మపుష్కరిణిలో సుదర్శన



### అలమేలుమంగకు.. ఆనందనిలయుడి సారె!

అలమేలుమంగమ్మ అవతరించిన 'పంచమి'నాడు ఆనందనిలయుడు తన ప్రియమైన పట్టపురాణికి సారెను బహుమతిగా పంపిస్తారు. 2 పట్టుచీరలు, 2 పట్టు రవికలు, 2 బంగారు నగలు, పసుపు ముద్ద, చందనపు ముద్ద, శ్రీగంధపు కర్ర, పచ్చి పసుపు కొమ్ములతో ఉన్న పచ్చని పసుపు చెట్లు, పూలమాలలు, తులసీమాలలతో పాటు పిండివంటలు 51 పెద్దలడ్డులు, 51 వడలు, 51 అప్పాలు, 51 దోసెలు కూడ పంపబడతవి.

వీటన్నింటిని ముందుగా తిరుమలలో ఆనందనిలయునికి సమర్పింపబడిన తర్వాత దేవస్థానం అధికారులు, పరిచారకులు కాలినడకన బయలుదేరి అలిపిరికి దగ్గరలో ఉన్న 'పసుపుమండపం' చేరుకుంటారు. మళ్లీ అక్కడినుంచి ఏనుగు అంబారీపైన పెట్టుకొని, మేళతాళాలతో తిరుపతిలోని శ్రీకోదండ రామాలయం, శ్రీగోవిందరాజస్వామి ఆలయాలు మీదుగా తిరుచానూరు చేరుకుంటారు. అక్కడ శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం అర్చకులు అధికారులు. "ఆనందనిలయుడు పంపిన సారెకు" దివ్యమంగళ నీరాజనాలతో స్వాగతం ఇస్తారు. పిదప తిరుచానూరు పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారికి సమర్పిస్తారు. వాటితో శ్రీఅలమేలుమంగమ్మగా, శ్రీసుదర్శనచక్రత్తాళ్వారుకు పద్మసరోవరమండపంలో తిరుమంజనాదులు ఘనంగా నిర్వహించిన తర్వాత, సరిగ్గా ముహూర్తవేళలో శ్రీసుదర్శన భగవానునికి సరస్సులో చక్రస్నానం నిర్వహిస్తారు. ఆ చక్రంతో పాటు వేలాదిమంది భక్తులు పవిత్రస్నానాలు చేస్తారు.

చక్రత్తాళ్వారుకు చక్రస్నానం వైభవంగా నిర్వహింపబడుతుంది. ఆ సమయంలో వేలాదిమంది భక్తులు చక్రంతో పాటు పద్మసరోవరంలో మునకలు వేస్తూ పునీతులు అవుతారు. దయాస్వరూపిణి అలమేలుమంగ పంచమితీర్థం నాటి మహోత్సవవైభవం వర్ణించడానికి మాటలు చాలవు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి అనంతమైన దయనే సాక్షాత్తు 'అలమేలుమంగమ్మ'గా అవతరించిందని మహనీయులంటారు. అందువల్ల, అటు తిరుమలేశుని, ఇటు తిరుచానూరు పద్మావతిని విడివిడిగా ఎంతగా పొగడినా వారిద్దరూ అభిన్నులే! ఒక్కరే! అని మనం మరచిపోకూడదు, ఏ ఒక్కరిని కీర్తించినా ఇద్దర్నీ కీర్తించినట్లే, వారిద్దరి సంబంధం వెన్నెలకు-చంద్రునికీ; సూర్యునికీ- సూర్య కిరణాలకు; అగ్నికీ-వేడికీ ఉన్న సంబంధం లాంటిది. అందువల్ల అభిన్నులూ ఒక్కరే అయిన అలమేలుమంగా సమేతంగా ఆనందనిలయుణ్ణి ఇలా ప్రార్థించుదాం.



## తిరుమలేశుని రాణికి తెప్పోత్సవాలు



**ప్రతిఏటా జ్యేష్ఠమాసంలో పున్నమికి పూర్తి అయ్యేట్లుగా ఐదు రోజుల పాటు సాయంవేళల్లో పద్మసరోవరంలో జరిగే తెప్పోత్సవాల్లో మొదటి రోజు శ్రీకృష్ణ స్వామివారికి, రెండవ రోజు శ్రీదేవి, భూదేవీ సమేతంగా శ్రీసుందరరాజ స్వామివారి, చివరి మూడు రోజులు శ్రీపద్మావతీ అమ్మవారు పాల్గొంటారు.**


**నారాయణస్య హృదయే భవతీ యథాస్తే**
**నారాయణోఽపి తవ హృత్కమలే యథాస్తే**
**నారాయణస్త్వమపి నిత్యముభౌ తథైవ**
**తౌతిష్ఠతాం హృది మమాపి దయావతీ శ్రీః**

అమ్మా! అలమేలుమంగమ్మా! ఆనంద నిలయుడైన నారాయణుని గుండెలో నీవు ఉంటావు. నీ హృదయపద్మంలో ఆ స్వామి ఉంటాడు. ఇద్దరూ కలసి నా హృదయంలో నిండు దయతో స్థిరంగా కొలువై ఉందురుగాక!!

ఓం శ్రియై నమః
ఓం నమో వేంకటేశాయ

## ఆదిత్యుణ్ణి ప్రతిష్ఠించిన ఆనందనిలయుడు...

**పద్మసరోవరానికి తూర్పుగట్టున పశ్చిమాభిముఖంగా శ్రీసూర్యదేవుని ఆలయం ఉంది. ఈ ఆదిత్యుణ్ణి సాక్షాత్తు ఆనంద నిలయుడు ప్రతిష్ఠించి అక్కడే శ్రీమహాలక్ష్మికోసం 12 ఏండ్లపాటు తపస్సు చేశాడు. ఆ సరస్సులోనే బంగారుపద్మంలో అలమేలు మంగమ్మ ఆవిర్భవించింది.**



**ఈ సూర్యదేవాలయం అనేకమార్లు పునరుద్ధరింప బడింది. మళ్లీ 1866 ఏప్రిల్ 23న హాథీంరాజీమఠంవారు జీర్ణోద్ధరణ చేశారు. ఈ ఆలయంలో మాత్రం వైఖానసాగమా ప్రకారం నిజపూజలు జరుగుతాయి. ప్రతి ఆదివారంనాడు, హస్తానక్షత్రంనాడు, 'రథసప్తమి'నాడు శ్రీసూర్యనారాయణస్వామివారికి అభిషేకానంతరం, గ్రామోత్సవం జరుగుతుంది. ఆనాటి నుంచి తిరుచానూరు 'భాస్కరక్షేత్రం'గా ప్రసిద్ధి కెక్కింది.**

*గత సంచిక తరువాయి భాగం...*

ధారావాహిక

# శ్రీమద్భగవద్గీత

- ఆచార్య కుప్పా విశ్వనాథశర్మ

భీముని పేరు చెప్పాలి ఇవేం చెప్పకుండా సాత్యకి అనటం ద్వారా ఏమి సూచన చేస్తున్నాడు? అంటే సాత్యకికి దుర్యోధనుడికి ఒక తేడా ఉంది. ఈ యుద్ధసన్నాహాలకు ముందు దుర్యోధనుడు అర్జునుడు ఇద్దరూ శ్రీకృష్ణపరమాత్మ వద్దకు వెళ్లారు. వెళ్ళి సహాయం చేయవలసిందిగా ప్రార్థించారు. అర్జునుడు పరమాత్మను తన పక్షాన కోరుకున్నాడు. దుర్యోధనుడు శ్రీకృష్ణ పరమాత్మ యొక్క యాదవ సైన్యాన్ని మొత్తాన్ని కోరుకున్నాడు. యాదవ సైన్యానికి శ్రీకృష్ణపరమాత్మ నా ఆజ్ఞ ప్రకారం దుర్యోధ నుని పక్షాన వెళ్ళి యుద్ధం చేయవలసింది అని. కాని వాళ్ళలో సాత్యకి 'కృష్ణ పరమాత్మను కాదని నేను అధర్మపక్షాన ఉండును, నేను పాండవుల పక్షాన నీ పక్షానే ఉంటాను' అని శపథం చేసి మరీ యుద్ధానికి వచ్చాడు. శ్రీకృష్ణపరమాత్మయొక్క సైన్యం మొత్తం కౌరవుల వైపు ఉంది. కాని సాత్యకి ఒక్కడే పాండవుల వైపు వెళ్లాడు. వీడి కొక్కడికేనా ధర్మదీక్ష? రాజుగారి ఆజ్ఞను పాటించడం లేదా? వీడొక్కడి వల్ల ఏమయిపోతుంది? మొదట 'సాత్యకి' పేరు, రెండో పేరు 'విరాటశ్చ' అంటున్నాడు. విరాటుడు మనకు బాగా తెలిసిన పేరు. ఆ విరాటుడు సాధారణ వీరుడు. దుర్యోధనుడికి చేయరాని అపకారం చేశాడు. అజ్ఞాతవాసంలో పాండవులకు ఆశ్రయాన్ని ఇచ్చాడు. వేరొకచోట వీళ్ళజ్ఞాతవాసం చేసి ఉంటే నేనెలాగో కనిపెట్టి ఉందును. ఆ అవకాశం లేకుండా చేసినటువంటి దుర్మార్గుడు విరాటరాజు అని దుర్యోధనుని అభిప్రాయం. పాండవులు వాళ్ళ సామర్థ్యంతో అజ్ఞాతవాసం పూర్తి చేయలేదు. విరాటుడు అనే ఒక దోమ ఆ ఏనుగులకు ఆశ్రయమిచ్చింది, దాంతో వారజ్ఞాతవాసం చేయగలిగారు. నేనే ఆ అజ్ఞాతవాసభంగం చేసి ఉంటే మళ్ళీ పదమూడేండ్లు గడిచేది, యుద్ధం ప్రసక్తి వచ్చి ఉండేది కాదు. కాబట్టి ఈ యుద్ధానికి కారకుడు ఈ విరాటుడే. మూడవ పేరు 'ద్రుపదశ్చ' ద్రుపదుడితో ద్రోణుడికి మహావైరమున్నది. అంటే ద్రుపదునికి ద్రోణాచార్యునితో వైరమున్నది. కానీ, ద్రోణాచార్యునికి ద్రుపదు నితో వైరం లేదు. కాని ద్రుపదుడు ఎట్లైనా 'నా పుత్రుడు ఈయన శిరస్సును ఖండించాలి నేను చూడాలి' అనే ఉద్దేశంతో వచ్చాడు. ఆ విషయం అక్కడ ఉన్నవారందరికి తెలుసు. వారందరు మహావీరులు. మహారాజులు సహజంగానే ప్రతిజ్ఞలు చేస్తూ ఉంటారు. బయటకు లోపల ఏమి మాట్లాడుతున్నాడనేది కూడ ద్రోణాచార్యునికి తెలుసు. ద్రుపదః ద్రుపదః అంటున్నాడు. ఇంకొకసారి 'ద్రుపద పుత్రః' అని ద్రుపదపుత్రుణ్ణి చూపిస్తూ నిన్ను చంపాలనే కొడుకును కన్న ద్రుపదుడు కూడ ఉన్నాడు అని తన దుస్స్వభావాన్ని బయట పెట్టాడు. ఇది పరవీరులను తక్కువ చేసి మాట్లాడటం. ఇదికాక ఇంకా వీరుల పేర్లను దుర్యోధనుడు ఉచ్చరిస్తున్నాడు ఇలా..

> "దృష్టకేతుశ్చేకితానః కాశిరాజశ్చ వీర్యవాన్
> పురుజిత కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః"

దృష్టకేతువు 'చేకితానుడు' అని, పురుజిత్ కుంతి భోజః అని పాండవులకు మేనమామ వరసలయ్యే ఇద్దరు వీరులు, 'శైబ్యుడు' అనే శిబిదేశపురాజు. వీళ్ళ పేర్లలోని అంతర్యం దృష్ట కేతువు చేదిదేశపురాజు. 'చేద్యః' అని ఆయనకు పేరు. ఈ దృష్ట కేతువు శిశుపాలుని కొడుకు– శిశుపాలుడంటే ఎవరు? మహా కృష్ణద్వేషి. జీవితాంతం కృష్ణుని తిట్టడం చివరకు కృష్ణుని సుదర్శనచక్రానికి బలి అయిపోయిన ఆయన కొడుకు దృష్ట కేతువు. తండ్రిలాగా కృష్ణపరమాత్మ, పాండవుల మీద ద్వేషం పెంచుకున్నవాడు కాడు. పాండవుల పక్షాన చేరిపోయాడు. తన సోదరి 'శృణుమత' ను నకులుడికిచ్చి వివాహం కూడా చేశాడు, 'బాంధవ్యం కోసం ధార్మికులతో నేను సహజీవనం చెయ్యాలి. మా తండ్రిగారు తప్పు చేస్తే నేనూ తప్పుచేయాల్సిన అవసరం లేదు' అనే తీర్మానంలో ఉన్నవాని గురించి ప్రత్యేకించి ప్రస్తావిస్తు న్నాడు. శిశుపాలుడికి పుట్టిన ఈ దృష్టకేతువు నాపక్షాన చేర కుండా పాండవుల పక్షాన చేరతాడా? వీడు మాత్రం పాండవుల పక్షాన ఎలా చేరతాడు? అ నకులునికి తన సోదరిని ఎందు కిస్తాడు? అనీ తర్వాత 'చేకితానః' అనే ఒక మహావీరుడు. ఈయన ప్రత్యేకించి యుద్ధరంగంలో వినోదించటం కోసం పుట్టినవాడు. ఈయనకు యుద్ధమంటే ఒక తపస్సు. అర్జునునికి స్నేహితుడు. అర్జున పక్షపాతి. అలాంటి ఆ 'చేకితానుడు' తర్వాత కాశిరాజు. ఈ పేరు ఉచ్చరిస్తేనే అందరికి మహాపుణ్యం వస్తుంది. అటు వంటి కాశిక్షేత్రంలో ఉన్నటువంటి కాశిరాజు పరాక్రమవంతు లుగా పుడతారు. కొంతమంది ఆ వంశాల్లో పుట్టీ పుట్టకుండా ఉంటారు. కాని ఒక వంశంలో ఒకతరంలో కాక మరొక తరంలో ఎప్పుడు చూసినా వీరు మాత్రమే పుట్టేటు వంటి వంశాలు కొన్నే ఉన్నాయి. **(ఇంకా ఉంది)**

# తిరుమల తొలిగడప 'దేవునికడప'

- డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు

మన దేవాలయాలు

కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరుడు కొలువు దీరిన బంగారు గడప-'తిరుమల' కాగా... అటువంటి బంగారు గడపకు 'తొలిగడప'గా భాసిల్లుతూ ఉన్న పవిత్ర పుణ్యక్షేత్రం- **దేవుని కడప.**

కడపనగరానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో దేవునికడప ఉంది. పూర్వం శ్రీవేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి తిరుమలకు వెళ్ళే భక్తులు ముందుగా దేవుని కడప లోని శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకుని తర్వాత తిరుమలకు వెళ్ళేవారు. అందువల్ల తిరుమలకు 'తొలి గడప'గా, దేవుని కడప పేరుపొందింది. 'గడప' అనే పదం కాలక్రమంలో మార్పుచెంది 'కడప'గా మారింది. కాగా ఇప్పటికీ చాలామంది తిరుమలకు వెళ్ళే ముందు ఈ క్షేత్రాన్ని దర్శించుకుంటారు.

ఈ క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారిని కృపాచార్యులు ప్రతిష్ఠించినట్లు స్థలపురాణకథనం. తిరుమల వరాహక్షేత్ర మైనట్లే ఈ క్షేత్రం హనుమత్ క్షేత్రంగా ప్రసిద్ధిచెందింది.



వనవాస సమయంలో శ్రీసీతాదేవిని రావణాసురుడు అపహరించాడు. ఆమెను వెదుక్కుంటూ దండకారణ్యంగా ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతానికి శ్రీరాముడు చేరాడు. కొంతకాలం ఇక్కడ ఉన్నాడు. సీతాన్వేషణలో తనకు ఒకరు సహాయం చేస్తారని గుర్తించాడు. శ్రీఆంజనేయుడే తనకు సహాయం చేస్తాడని గ్రహించి, ఆంజనేయుడి ప్రతిరూపాన్ని తయారుచేసి ప్రతిష్ఠించి వెళ్ళాడు. అందువల్ల దీనికి **"హనుమత్ క్షేత్రం"** అనే పేరు ఏర్పడింది. తర్వాత ద్వాపరయుగంలో కురుక్షేత్రయుద్ధంలో పరాజయం పొందిన కృపాచార్యులు కలిపురుషుణ్ణి దర్శించుకోవాలని భావించాడు. దక్షిణదేశయాత్రకు బయలుదేరాడు. మార్గమధ్యంలో హనుమత్ క్షేత్రానికి చేరుకున్నాడు. తిరుమలకు వెళ్ళాలని భావించాడు. అయితే వెళ్ళలేక తనకు దర్శనం ప్రసాదించాలని శ్రీవేంకటేశ్వరస్వామివారిని ప్రార్థించాడు. హనుమత్ క్షేత్రంలోనే శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించి పూజించిన కృపాచార్యులు- తన మాదిరే తిరుమలకు వెళ్ళలేని వారికి వీలుగా ఉండేందుకు స్వామివారి ఆదేశానుసారం స్వామి వారి అర్చామూర్తిని శ్రీఆంజనేయ స్వామివారి ముందు ప్రతిష్ఠింప జేశాడు. అంతేకాకుండా తిరుమలకు వెళ్ళే భక్తులు ముందుగా ఈ స్వామివారిని దర్శించుకుని వెళ్తే ఎటువంటి ఆటంకాలు లేకుండా యాత్ర పూర్తవుతుందనే ఆచారాన్ని కూడా కృపాచార్యులు ఏర్పాటు చేశాడు.

దేవునికడప శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయం విశాలమైన ప్రాంగణంలో పశ్చిమాభిముఖంగా కన్నులపండువ చేస్తూ దర్శనమిస్తుంది. ప్రధానప్రవేశద్వారమైన పశ్చిమద్వారం ఐదు అంతస్తుల గోపురం పైభాగంలో ఐదు గోపురకలశాలతో భక్తులను ఆలయానికి ఆహ్వానిస్తూ దర్శనమిస్తుంది. ఆలయప్రాంగణంలో ప్రధానఆలయానికి ఎదురుగా వరుసగా పాదాల మండపం, బలిపీఠం, ధ్వజస్తంభం, గరుడా

ళ్వారు మండపం ఉన్నాయి. ప్రధాన ఆలయం రంగ మండపం, ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగి ఉంది. రంగ మండపంలోని స్తంభాలు, శిల్పాలు విజయనగర సామ్రాజ్యకాలంనాటి శిల్ప కళకు అద్దంపడుతూ నయనానందకరంగా దర్శనమిస్తాయి. ముఖమండపం ప్రదక్షిణామార్గాన్ని కలిగి ఉంది. ముఖమండపం



నుంచి అంతరాలయానికి వెళ్ళే ద్వారానికి ఇరువైపులా జయ, విజయులు కొలువుదీరి ఉన్నారు. గర్భాలయంలో శ్రీవేంకటేశ్వర స్వామి శంఖు, చక్ర, వరద, కటి హస్తాలు, వక్షఃస్థలంపై శ్రీమహాలక్ష్మితో దివ్యతేజోరూపంతో భక్తులపై కరుణాకటాక్షాలను ప్రసరింపజేస్తూ దర్శనమిస్తాడు. శ్రీవేంకటేశ్వరస్వామివారి మూల విరాట్టుకు వెనుక వైపున శ్రీఆంజనేయస్వామివారు కొలువుదీరి ఉన్నారు. హారతిస్తూ అర్చకులు శ్రీఆంజనేయస్వామి వారిని దర్శింపజేస్తారు.

ఆలయ ప్రాంగణంలో స్వామివారి ఆలయానికి ఎడమ వైపున స్వామివారి దేవేరి ప్రత్యేక ఆలయంలో కొలువుదీరి శ్రీమహాలక్ష్మీదేవి, శ్రీపద్మావతీఅమ్మవారు అనే పేర్లతో పిలువబడుతూ ఆరాధనలందుకుంటూ ఉంది. ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగివున్న ఆలయప్రధాన గర్భాలయంలో శ్రీలక్ష్మీఅమ్మవారు ఆశీనురాలై రెండుచేతులలో పద్మాలను, మరో రెండు చేతులలో అభయ, వరదముద్రలను ధరించి కొలువుదీరి ఉంది. ఈ ఆలయముఖమండపంలో పైకప్పుకు రెండు బల్లి విగ్రహాలున్నాయి. వీటిని తాకినట్లయితే దోషాలు పోతాయని విశ్వాసం.

ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో శ్రీవిష్వక్సేన స్వామి, శ్రీవినాయకుడు, శ్రీగోదాదేవి, ఆళ్వారులమండపంలో ఆళ్వారులు, వాహనమండపం, వివిధ దేవతావృక్షాలను ఆలయ ప్రాంగణంలో భక్తులు దర్శించుకోవచ్చు.

చారిత్రకంగా పరిశీలిస్తే 14వ శతాబ్దం నుంచి దేదీప్యమానంగా వెలుగొందుతూ ఉన్న ఆలయనిర్మాణం, అభివృద్ధికి విజయనగర రాజ్యస్థాపకులైన హరిహర, బుక్క రాయలు, సాళువ నరసింహరాయలతోపాటు శ్రీకృష్ణదేవరాయలు కృషి చేశారు. స్వామివారిని సేవించి తరించారు. 1801-07 మధ్య దత్తమండలాల కలెక్టర్‌గా పనిచేసిన సర్ థామస్ మన్రో ఆలయాభివృద్ధికి కృషిచేసి రాజగోపురానికి మరమ్మత్తులు చేయించారు. తిరిగి 1987లో ఆలయ జీర్ణోద్ధరణ జరిగి మహాకుంభాభిషేక మహోత్సవాలు జరిగాయి. ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం పాలనలో ఉంది.



తిరుమల స్వామిని కీర్తించిన... ముప్పైరెండు వేలకు పైగా కీర్తనలను రచించిన పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య కడప శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించి... 'కడప రాయుడు', 'వేంకటాద్రి కడప రాయుడు' అని కీర్తించాడు.

"కాదనకు నామాట కడపరాయ - నీకు
గాదెబోసె వలపులు కడపరాయ
కప్పురమియ్యగ రాద కడపరాయ - నీకు
కప్పుమీవే కవచములు కడపరాయ - వో
కప్పు మొయిలు మేనిచాయ కడపరాయ..." అనీ

"కప్పురమందుకొంటె గడపరాయ నీకు
గప్పము మా జవ్వనము కడపరాయ...' వంటి కీర్తనల్లో అన్నమయ్య కీర్తించగా -

"ఇందుకేమి సేతునమ్మా
యెవరు తోడి తెచ్చెనమ్మా
ఇందువదన! కడప వేంకటేశు
దంత దూరాన నున్నాడో..." అని క్షేత్రయ్య కీర్తించాడు.

ప్రతి రోజూ పూజలు జరిగే కడపరాయుడి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం మాఘమాసంలో శుక్లపక్ష పాడ్యమి మొదలుకుని పదిరోజులపాటు కన్నులపండువగా జరుగుతాయి. పెద్దశేష, చిన్నశేష, హనుమంత, సింహ, గజ, సూర్యప్రభ, గరుడ, తిరుచ్చి వంటి వాహన సేవలతో పాటూ కల్యాణోత్సవం, రథోత్సవం జరుగుతాయి.

## 2022, మార్చి నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | మహాశివరాత్రి |
| 10-18 | తరిగొండ, శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవం |
| 13-17 | తిరుమల శ్రీవారి తెప్పోత్సవం |
| 18 | శ్రీలక్ష్మీజయంతి, తుంబురుతీర్థ ముక్కోటి |
| 29 | శ్రీ అన్నమాచార్యవర్ధంతి |
| 30 | తిరుపతి శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవప్రారంభం |




ప్రధానంగా ఎన్ని వాహనసేవలు జరిగినా ఏడవనాడు జరిగే రథోత్సవందే ప్రత్యేకత. రథసప్తమినాడు జరిగే ఉత్సవంలో లక్షలాది భక్తులు పాల్గొంటారు. మధ్యాహ్నం రథోత్సవం జరుగుతుంది. ఉదయమే స్వామివారిని రథంపై ఆశీనుణ్ణి చేస్తారు. భక్తులు స్వయంగా రథం ఎక్కి స్వామివారిని దర్శించుకుంటారు. తర్వాత రథోత్సవంలో పాల్గొంటారు. ధనుర్మాసం, ఉగాది, సంక్రాంతి, శ్రావణమాసం, దేవీనవరాత్రుల సందర్భంగా ప్రత్యేకపూజలు జరుగుతాయి.

కడపనగరంలో భక్తులకు వసతిసౌకర్యాలు లభిస్తాయి. కడప నగరాన్నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవుని కడపకు ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో వెళ్ళవచ్చు. హైదరాబాద్ నుంచి 420, తిరుపతినుంచి 145, విజయవాడనుంచి 390 కిలో మీటర్ల దూరంలో ఉన్న కడపకు అన్ని ప్రధాన ప్రాంతాల నుంచి బస్సు సౌకర్యాలు ఉన్నాయి. రేణిగుంట, గుంతకల్లు రైల్వే మార్గంలో ఉన్న కడపలో అన్ని రైళ్ళు ఆగుతాయి. చెన్నై, హైదరాబాద్, విజయవాడ నుంచి కడపకు విమాన సౌకర్యాలు ఉన్నాయి. తిరుమల తొలిగడప 'దేవుని కడప' సందర్శించి భక్తులు తరించవచ్చు.



ధారావాహిక

# హరిదాస వాఙ్మయంలో...
# శ్రీవేంకటాచలాధీశుడు

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం...*

## శ్రీవిజయదాసులవారి కృతులలో వేంకటాచలాధీశుడు

శ్రీవేంకటేశ్వరస్వామి వారి అంతరంగ భక్తులలో ఒకరైన శ్రీవిజయదాసుల వారు భృగ్వంశ సంభూతులని ఆప్తవాక్య ప్రమాణము వలన తెలియుచున్నది.

మొదలు ఋషిగళు కూడి సత్రయాగవ
 నాకనదియ తీరది రచిసలు।
పదుమ సంభవనంక భవ బందు
 ముని వృంద హృదయ సంశయ హిడిసలు ।
విధివిష్ణు శివరొళగె ఉత్తమరతిళియదె
 మదద భావన నైదలూ
ఒదగి భృగుముని బందుసర్వేశ వైకుంఠ సదన
 నెందరుహి దవరో ఇవరో ॥

'విజయరాయర పాద భజిసి దవగనవరత విజయ వాగువుదక్కె సందేహవే' పూర్వము గంగానదీ తీరమున కశ్యపాది ఋషీశ్వరులంతా యజ్ఞము చేయుచున్నప్పుడు ఈ యజ్ఞ ఫలమును ఏ దేవునికి సమర్పిస్తారని నారదులవారు వచ్చి అడుగగా– ఆ ఋషులలో సంశయము కలిగి సర్వోత్తముడైన ఏ దేవునికి ఈ యాగఫలమును అర్పించాలి. ఆ దేవుడు త్రిమూర్తులలో ఎవరు? పరీక్షించుకొని రమ్మని భృగుమహర్షిని పంపగా వారు క్రమంగా సత్యలోక, కైలాసములకు పోయి ఆ పిమ్మట వైకుంఠమునకు వెళ్ళి స్వామివారి వక్షఃస్థలమందు పాద తాడనమును చేసి, ఆ తర్వాత ఆ దేవునిచే సత్కరింపబడినవారై ఈ భూలోకానికి వచ్చి శ్రీహరియే సర్వోత్తముడని చెప్పి యజ్ఞమును పూర్తి గావించి ఆ స్వామికే యజ్ఞఫలమును సమర్పింపజేసినారు. ఈ కార్యము వల్ల లక్ష్మీ నారాయణులలో పరస్పరము ప్రేమకలహమేర్పడి లక్ష్మీదేవి కొల్హాపురమునకు, శ్రీమన్నారాయణుడు వేంకటపర్వతమునకు రావడం జరిగింది. ఈవిధంగా వైకుంఠమునుండి సరాసరి వేంకటాద్రికి వచ్చి నిలబడుటకు ముఖ్యకారణము భృగుమహర్షియే.



ఈ మహర్షియే విజయదాసులవారని ఈ హరిదాసుల వారి కుమారులైన మోహనదాసులవారి మాటలచే తెలియు చున్నది. 'మహర్షిణాం భృగురహం' అన్నాడు కృష్ణుడు. వీరివద్ద భగవంతుని విభూతిరూపము కూడ ఉన్నది. త్రేతద్వాపర యుగాలలో సురతిల, నికంపనాడుగా పుట్టిన ఈ మహర్షి ఈ కలియుగమున మొదట పురందరదాసుల వారింటిలో ఆవు దూడగ పుట్టి దాసులవారిచే పోషింపబడి ఆ తర్వాత అదే దాసశ్రేష్ఠులకు నాల్గవ పుత్రుడుగా పుట్టి మధ్వపతి అని ప్రసిద్ధుడై తండ్రి కీర్తనలంతా ఆ జన్మమున శ్రవణముచేసి తర్వాతి జన్మమున పురందరదాసుల ఆనతి మేరకు విజయదాసులుగా పుట్టిరి. పుట్టుకతో అష్టదరిద్రమునననుభవించిన విజయ దాసులవారు అన్న, ఉదక, వస్త్రములను కానక దారిద్ర్య పీడితులై కాశీకి వెళ్ళిపోయిరి. అక్కడి మణికర్ణికా ఘట్టమున (గంగాతీర మున) ఒకనాటి వెన్నెలలో ఒంటరిగా కూర్చొని ధ్యానించు చుండగా శ్రీవేదవ్యాసుల వారు పురందరదాసులవారి రూపమున వచ్చి ఈతని చేయిని పట్టి ఆవతలికి కొనిపోయి 'విజయవిఠల' అను బీజాక్షరాలను నాలుకపై వ్రాసి అదే పదమును అంకిత ప్రధానమును చేయగా నాటినుండి విజయదాసులుగా ప్రసిద్ధి చెంది అనేక పద పద్య సుళాది కీర్తనలను రచించిరి. విజయ దాసులవారు తమ జీవిత కాలములో భారతదేశములోని పుణ్య తీర్థ క్షేత్రములను సందర్శించి ఆ తీర్థముల మహిమలను, ఆ క్షేత్రాధిపతి దేవతలను కీర్తన సుళాదులలో వర్ణించియున్నారు. ముఖ్యముగా ఈ హరిదాసులవారు ప్రతి సంవత్సరము తిరుపతి బ్రహ్మోత్సవములకు వదలక వచ్చి స్వామిని స్తుతించి స్వామివారి అనుగ్రహమునకు పాత్రులైనారు. కాశీనుండి హరిదాసులై తిరిగి విజయనగరమునకు (హంపి) వచ్చి అక్కడున్నప్పుడు ఒకనాటి రాత్రి కలలో శ్రీవేంకటేశ్వరుడు కన్పించి ఈ విధంగా ఆదేశించి నాడట.

"ఎందొదనాడువె ఎందర్థి బడువె ఎందిగె తర్సైసి సంతోషపడువె ॥
ఉత్సహమంటపదొళగె కుళితుభక్తవత్సలనెందు నుతిసి కొంబన ॥

ఎప్పుడాతని దర్శించికొని ఏనాడాతని ముందు నిలబడి స్తుతించి సంతోషపడుదునో కదా అని చింతించుచుండగా ఒక నాటి రాత్రి కలలో ఉత్సవమంటపమున కూర్చొని భక్తవత్స లుడని భక్తులచే కొనియాడ బడుతున్న స్వామినిచూచి మురిసి పోయినారు. అంతేకాక ఆ శ్రీనివాసమూర్తి సకలాభరణ భూషితుడై, బ్రహ్మరుద్రాది దేవతలు, ఋషుల సమూహముచే స్తుతింపబడుచున్నాడు. 'ఆపోహిష్ఠామయో భువ' అనే మంత్రమును పురోహితులచే చెప్పించుకొనుచున్నాడట.

'సకల భూషితనాగి అజహర సురముని
నికర కైయిందస్తుతిసి కొంబన కూడ
అపోహిష్ఠామయోభువ నెంబొమంత్ర
ఆపురోహిత నింద కలితు కొంబనకూడ ॥

ఇట్లుండగా శ్రీవిజయదాసులవారు ఆ మంటపములో ప్రవేశించిన వెంటనే స్వామి తన అమృతదృష్టికిరణములను వీరిపై ప్రసరించి, చేతి వ్రేళ్ళ సంజ్ఞతో దగ్గరికి పిలిచి ఇట్లు ఆదేశించాడట.

"నాల్వత్తుమూరు పదంగళు మాడెందు
హేళిద హేమాద్రి శిఖరా కారన కూడ।
దండిగె కరదల్లి కొట్టు అమృతకర
మండి యల్లి ఇట్ట మహామహిమన కూడ ॥

నలభై మూడు పదములను నాపై రచించమని మేరు పర్వతాకారుడైన శ్రీనివాసుడు నుడివి తంబూరాను చేతిలో పెట్టి, తన అమృతకరములను తలపై యుంచినాడట. ఆ తర్వాత పల్లకిలో ఆలయ ప్రాకారమును చుట్టి తిరిగి గుడిలో ప్రవేశిం చాడు *(పల్లకి ఏరి పవళిస్తుతి సర్రనె నిల్లదె గుడిపొక్క నిర్మలను)* ఈ వృత్తాంతమంతా జరిగినది.

వార శని చతుర్దశి కృష్ణ పుష్యది ।
ఈ రీతి యలి కండ ఇందిరేశన కూడ ॥
రౌద్రి సంవత్సర అర్ధరాత్రి యల్లి
భద్రమూరుతి యాద భవహరన కూడ ॥
గురుపురందరన ఉపదేశబల దింద
సిరివి జయవిఠలన చరణ తర్సైసి ॥

రౌద్రి సంవత్సరము పుష్యమాసము కృష్ణచతుర్దశి శనివారము అర్ధరాత్రి ఈ దృశ్యమును తమ గురువులైన పురందరదాసుల వారి ఉపదేశబలంతో సిరి విజయ విఠలుని చరణములను చూచి ధన్యుడనైతినని అన్నారు.

*(ఇంకా ఉంది)*

# భీష్మ సందేశం

- శ్రీ కె.లక్ష్మీనారాయణ

**భీష్ముడు-** ఈ మాట వినగానే మహత్తరమైన ఆవేశం మనల్ని అవహిస్తుంది. రోమాలు నిక్కబొడుచుకుంటాయి. భీషణమైన ప్రతిజ్ఞ చేసి, జీవితాన్ని ధారపోసిన భీష్ముడికి సాటి భీష్ముడే. తండ్రి కోసం రాజ్యాన్ని, చివరకు తన సొంత జీవితాన్ని కూడా త్యాగం చేసిన త్యాగమూర్తి ఆయన. పరశురాముడిని నిలువరించిన ఘనత కూడా భీష్ముడిదే. ఇటువంటి పాత్ర మరొకటి భారతంలో కనిపించదు. కనీసం ఆ ఛాయల్లోకి కూడా మరొకరు రారు.

తిక్కన సోమయాజి కూడా **'మహోగ్రశిఖరఘనతాళ తరువగు సిడమువాడు'-** అంటూ బృహన్నల (అర్జునుడి చేత) చేత భీష్ముని ఔన్నత్యాన్ని ప్రశంసింపజేస్తాడు. భీష్ముని రథపతాకం మీద తాళ(తాటి) వృక్షం చిత్రించబడి ఉంటుంది. నిటారుగా నిలబడి సర్వోన్నతంగా కనిపించే తాళవృక్షంలా వందలాది పాత్రలున్న మహాభారతంలో ఎవరికీ అందనంత సమున్నతగుణ శ్రేణితో అందరిచేత 'తాతా!' అంటూ గౌరవాన్ని అందుకున్న ఒకే ఒక వ్యక్తి భీష్ముడు.

## భీష్ముడు కాదు... భీష్మాచార్యుడు

మహాభారతంలోనే యయాత్యుపాఖ్యానంలో భీష్ముని మాదిరి తండ్రి కోసం వృద్ధాప్యాన్ని అనుభవించిన పూరుని ప్రస్తావన ఉంది. అయితే పూరుడు తండ్రి అడిగాడు కాబట్టే.... అది కూడ కొంతకాలమే వృద్ధాప్యాన్ని అనుభవించాడు. కానీ భీష్ముడు అలా కాదు. తండ్రి అయిన శంతనమహారాజు అతడిని మాట మాత్రం కూడా అడగలేదు. కనీసం ప్రస్తావన కూడా తీసుకురాలేదు. అలాగని భీష్ముడు వదిలిపెట్టలేదు. తండ్రి చింతకు కారణం ఏమిటో కనుక్కున్నాడు. దాశరాజు దగ్గరకు వెళ్ళాడు. అతడి సందేహాలన్నీ తీర్చాడు. తండ్రి కోసం రాజ్యాన్నే కాదు.. చివరకు తన సంసారసుఖాన్ని కూడా త్యాగం చేశాడు. తనకు వారసులు లేకుండా చేసుకున్నాడు. తన తమ్ములు చనిపోయిన తర్వాత, తాను భీషణమైన ప్రతిజ్ఞ చేయటానికి కారణమైన సత్యవతీదేవి స్వయంగా ఆజ్ఞాపించినా ప్రతిజ్ఞాభంగం చెయ్యటానికి ఏమాత్రం అంగీకరించలేదు. అందు కనే దేవ వ్రతుడు భీష్ముడు అయ్యాడు. కాదు...కాదు... భీష్మాచార్యుడు అయ్యాడు.

భీష్ముడు ధర్మాన్ని ఎంతటి కఠినమైన పరిస్థితుల్లో ఆచరించేవాడనటానికి ఉదాహరణ భారతయుద్ధసందర్భంలో కనిపిస్తుంది. శాస్త్రవిహితమైన సంధ్యావందనం, సూర్యునికి అర్ఘ్య ప్రదానం ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టేవాడు కాదు భీష్ముడు. యుద్ధం చేస్తున్నా కూడా సంధ్యాసమయంలో ఆగి, సూర్యోపాసన చేసి, నీరు దొరకకపోతే యుద్ధభూమిలోని ఇసుకతోనే అర్ఘ్య ప్రదానం చేసిన ఒకే ఒక వ్యక్తి భీష్ముడు. అదీ ధర్మం పట్ల, ధర్మాచరణ పట్ల ఆయన ఆచరించి చూపించిన అంకిత భావం. అందుకే కేవలం భీష్ముడిగా మిగిలిపోలేదు. భీష్మాచార్యుడు అయ్యాడు.

## అఖండమైన కృష్ణభక్తి

అచంచలమైన కృష్ణభక్తి భీష్మునిలో ఉంది. కేవలం కారణమాత్రంగానే పరమాత్మ భౌతికరూపంలో కృష్ణుడుగా అవతరించాడని ఎరిగిన అతి కొద్దిమంది భక్తాగ్రేసరుల్లో భీష్ముడు ఒకడు. అయితే ఇతరుల మాదిరిగా భీష్ముడు ఎక్కడ కూడ బాహాటంగా తన కృష్ణభక్తిని ప్రకటించలేదు. కేవలం ఒకే ఒక సందర్భంలో... అదీ యుద్ధభూమిలో ఉండగా తాను నమ్మినదైవమైన పరమాత్మే స్వయంగా తనను చంపుతానని 'చక్రం' చేపట్టినప్పుడు అంతకంటే తనకు కావలసింది ఏమున్న దంటూ పరమాత్మే నాకు దిక్కు అంటూ పరమాత్మకు సాగిల పడతాడు.

## అంపశయ్యపై ధర్మబోధ

భారతయుద్ధంలో మొదటి అంకం పూర్తయింది. భీష్ముడు అంపశయ్యపైకి చేరాడు. ఎంతటి ప్రజ్ఞ, ధర్మచింతన కలిగిన వాడైనా, ధర్మానికి గ్లాని జరుగుతున్నా చూసి ఊరుకున్న కారణంగా దోషపరిహరణకు అంపశయ్యపై పడుకున్నాడు. నిజానికి 'స్వచ్ఛందమరణ' శక్తి ఉన్నా పునరావృత్తరహిత మైన మోక్షాన్ని అందుకోవాలంటే చేసుకున్న పాపం పూర్తిగా



## భీష్మాష్టమి

మాఘశుక్లసప్తమి మొదలు ఏకాదశివరకు గల ఐదు రోజులను భీష్మపంచకాలుగా ప్రసిద్ధిని పొందాయి. భారతయుద్ధ సమయంలో క్షత గాత్రుడైన భీష్ముడు స్వచ్ఛంద మరణం వరం ఉన్నా దక్షిణాయనంలో ప్రాణం వదలక ఉత్తరా యణం వచ్చే వరకూ అంపశయ్యపై పరుండి మాఘశుక్లసప్తమి నుండి ఐదురోజుల్లో రోజుకొక ప్రాణాన్ని విడిచిపెట్టాడు.

పద్మపురాణం హేమాద్రి వ్రతఖండంలో భీష్మాష్టమి గురించి చెప్పబడింది. భీష్మాష్టమి రోజున భీష్మునికి తిలాంజలి సమర్పించేవారికి సంతానప్రాప్తి కలుగుతుంది. ఈరోజు భీష్మునికి తర్పణం వదలాలని స్మృతికౌస్తుభం తెలుపు తున్నది. కల్యసార సముచ్చయాధారంగా భీష్మాష్టమి శ్రాద్ధదినం. ఈ రోజు తర్పణం, శ్రాద్ధం చేసిన వారికి సంవత్సర పాపం నశిస్తుంది.

నశించాలి. అందుకే అంపశయ్యపైకి చేరాడు. పూర్తిగా దైవ చింతనలో, అహంకార మమకారాలకు, అరిషడ్వర్గాలకు, లౌకిక బంధాలకు అతీతుడైన భీష్మునితో కృష్ణపరమాత్మ 'నీ బిడ్డలకు ధర్మబోధ చెయ్యవయ్యా, అని చెప్పాడు. 'స్వామీ! నువ్వే చెప్పవచ్చు కదా!' అంటాడు భీష్ముడు.

'ఆచరించిన అనుభవజ్ఞుడు చెబితేనే ధర్మానికి విలువ. అందుకే నీ చేత చెప్పిస్తున్నాను' అన్నాడు పరమాత్మ. 'సరే నన్నాడు' భీష్ముడు.

అదొక దివ్యముహూర్తం. తరతరాల పాపాలను క్షయం చేసే 'విష్ణుసహస్రనామస్తోత్రం' లోకానికి అందింది. వెయ్యి నామాల్లో అనంతుని అనంతశక్తిని వివరించాడు భీష్ముడు. భీష్మకృతమైన విష్ణుసహస్రనామస్తోత్రానికి ఈనాటికీ వెలుగు తగ్గలేదు. సకలపాపహారిణిగా ఇప్పటికీ మానవుల్ని తరింప జేస్తోంది. సమాజాన్ని... చివరకు తన లోకాన్నే పావనం చేయించిన అగణితపుణ్యశాలి భీష్మపితామహుడు.

కేవలం విష్ణుసహస్రనామస్తోత్రం మాత్రమే కాదు... మహాభారతంలోని శాంతి, అనుశాసనికపర్వాలు పూర్తిగా భీష్ముని బోధలతో నిండి ఉంటాయి. జీవితపు చివరి క్షణంలో సమాజోద్ధరణ గురించి ఆలోచించిన దార్శనికులు భీష్మా చార్యుడు.

## జీవన సందేశం

ఎప్పుడూ మారిపోతూ ఉండే మన ఆలోచనలు, ఇంద్రియాల అనుభవాలు అనే వాటి వెనుక మారకుండా ఉండే చైతన్యం తాలూకూ ఏకత్వమే అహంకారం. 'నేను ఆలోచిస్తు న్నాను', 'నేను రాస్తున్నాను', 'నేను చూస్తున్నాను', 'నేను వింటున్నాను', 'నేను బాధపడుతున్నాను', 'నేను సుఖిస్తున్నాను' అనే రకరకాల మార్పుల వెనుక వాటన్నిటికి కర్తగా అహంకారం ఉంటుంది.

ఈ అహంకారం నాశనమైపోవాలంటే కళ్ళు మూసు కుని, చూపుని లోపలికి తిప్పి, అక్కడ ఉన్న మహా చైతన్యం మీదే దృష్టి నిల్పి, తదేకంగా ధ్యానం చెయ్యాలి. భీష్ముడు చేసింది అదే. శ్రీకృష్ణపరమాత్మను ఎదురుగా చూస్తూ, ఆ మూర్తిని ధ్యానపథంలో ఉంచుకునే ప్రాణాలు వదలిపెట్టాడు. ఇందుకు ధ్యానం ఒక్కటే మార్గం. అంపశయ్యపై ఉండి కూడా నిరం తర ధ్యానంతో పరమాత్మలో లీనమైన భీష్మనిర్యాణఘట్టం మాన వాళికి అందించే సందేశం ఇదే. అందుకే తరాలు మారినా, యుగాలు గడిచినా భారతజాతి భీష్మపితామహునికి ఋణపడి ఉంటుంది. ఆయన్ను తమ జాతినాయకుడిగా సగర్వంగా ప్రకటిస్తుంది.




# కరుణించిన దైవం

– ఎ.భవాని

నా పేరు భవాని, మా నాన్నగారు ప్రభుత్వ ఉద్యోగి. మా అమ్మ నా చిన్నతనం నుండే ఆ ఏడుకొండలవాడిని కొలిచేది. అలా మా అందరికి ఆ స్వామిపై భక్తి ఏర్పడింది. నమ్మిన భక్తులను ఆ స్వామి ఎప్పుడూ కాపాడుతుంటాడు అని నిరూపించాడు.

2019వ సం॥లో ఒకరోజు రాత్రి కలలో నేను ఏదో పెద్ద భవనం మీది నుండి పడిపోబోతుంటే ఆ స్వామి సింహం రూపంలో వచ్చాడు. వచ్చింది ఆ 'వేంకటనారసింహుడే' అని నాకు అర్థమైంది. నేను తనని చూసి భయపడుతూ ఉంటే, భయపడకు నన్ను గట్టిగా పట్టుకో అని చెప్పాడు. ఆ స్వామి చెప్పినట్టుగానే నేను ఆ స్వామిని గట్టిగా పట్టుకున్నాను. ఆయన నన్ను క్షేమంగా ఇంటికి చేర్చి వెళ్లిపోయాడు.

కలలో నేను స్వామిని పట్టుకున్న స్పర్శని ఎన్నటికి మర్చిపోలేను. కలలో కనిపించిన ఆ సింహం చాలా పెద్దది. ఎంతో తేజస్సు కలిగినది. కలలో స్వయంగా ఆ స్వామి వచ్చి నాకు మాట ఇచ్చినట్టున్నాడు. నిజంగానే నాకు పెద్ద ప్రమాదం జరగబోయింది.

నాకు తీవ్రమైన జ్వరం వచ్చింది. ఎన్ని ఆసుపత్రులకి తీసుకువెళ్లినా తగ్గలేదు. మా అమ్మానాన్నలు చాలా కంగారు పడ్డారు. ఎంతకు జ్వరం తగ్గడం లేదని ఎంతో బాధపడ్డారు. చివరికి మాకు తెలిసి ఒక తాతయ్య, ఆయన పేరు శేషగిరిగారు, వారి ఇంటి దగ్గర ఉండే ఒక డాక్టరు దగ్గరకు తీసుకొని వెళ్లాడు. డాక్టరు పేరు శ్రీమతి అనూరాధ గారు. ఆమె వారికి తెలిసిన పెద్ద డాక్టర్ వద్దకు పంపారు. వారి పేరు శ్రీమతి సూర్యప్రభ గారు. వారు నాకు మంచి వైద్యం ఇప్పించి జ్వరం తగ్గేలా చేశారు. వారు నాకు అన్ని పరీక్షలు చేసి ఏ ప్రమాదం లేదని చెప్పారు. మాకు సహాయం చేసిన వారి పేర్లు శేషగిరిగారు, అనురాధ గారు, సూర్యప్రభగారు. వారి పేర్లు అలా ఉండడం యాదృచ్ఛికం, కానీ మాకు మాత్రం.. ఆ 'ఆదిశేషుడే', 'మహాలక్ష్మీ' దేవి దగ్గరకు తీసుకువెళ్లి, ఆ 'సూర్యప్రభవాహనుడు', ఆరోగ్యప్రదాత అయిన ఆ వేంకటేశ్వరస్వామి అనుగ్రహం కలిగేలా నన్ను దీవించారు. అంటే ఆ ప్రహ్లాదవరదుడే నన్ను ప్రమాదం నుండి బయటపడవేశాడు అని మాకు అర్థమైంది.

నేను ప్రమాదంలో ఉండగా స్వామికి అంగప్రదక్షిణం చేస్తానని, పద్మావతి అమ్మవారి దర్శనం చేసుకుంటానని మొక్కుకున్నాను. మాది భద్రాచలం దగ్గర పాల్వంచ. మేము తిరుపతి రావాలంటే ముందుగానే ట్రైన్ రిజర్వేషన్ చేయాలి. కాని, ఏ ట్రైన్‌కి టిక్కెట్లు దొరకలేదు. నన్ను కాపాడిన స్వామి మొక్కు త్వరగా తీర్చుకోవాలి అని పద్మావతి అమ్మవారిని ఎంతగానో వేడుకున్నాను.

ఆ అమ్మ కరుణ గల తల్లి, ఆ రోజు శనివారం ఇంట్లో స్వామికి పూజ చేసి ప్రసాదం తీసుకుంటున్నాం, మా మామయ్య వాళ్లు తిరుపతి వెళ్లడానికి ట్రైన్ రిజర్వేషన్ చూడమని ఫోన్ చేశారు. మేము చూశాం. ఆశ్చర్యం! ఒక స్పెషల్ ట్రైన్ ఉంది. వెంటనే వారితో పాటు మేము కూడా టిక్కెట్లు బుక్ చేసుకున్నాం. ఆ రోజు సాయంకాలమే ఖమ్మంలో ట్రైన్ ఉంది. ఉదయం 10.30గం॥లకు టిక్కెట్లు బుక్ చేశాం. సాయంత్రం 5 గం॥లకే బయలుదేరాలి. ఆ స్వామి కరుణ వల్ల మేము తిరుపతి చేరుకున్నాం. నాకు 'అంగప్రదక్షిణం' మొక్కు ఉందని చెప్పగానే అంగప్రదక్షిణం చేయడానికి నాతో పాటు అమ్మ, నాన్న, తమ్ముడు, మా మామయ్య వాళ్ల కుటుంబం వచ్చారు. ఇంకేముంది స్వామి అమ్మవారి దయతో స్వామికి అంగప్రదక్షిణం చేశాము. అమ్మవారి దర్శనం చేసుకున్నాము. నమ్మిన భక్తులని స్వామి, అమ్మవారు ఎప్పుడూ కాపాడుతూ ఉంటారు.

ఓం నమో వేంకటేశాయ!!

గృహలక్ష్మి

# సర్వప్రాణి హితైషిణి

# 'సులక్షణ'

– ఆచార్య కోలవెన్ను మలయవాసిని

భారతీయులకు పవిత్రమైన ప్రాచీనమైన పట్టణం కాశీ. కాశీక్షేత్రప్రభావాన్ని గుర్తించిన శ్రీసూర్యనారాయణుడు ఉత్తరార్కుడు, సాంబాదిత్యుడు, మయూఖాదిత్యుడు, ఖఖోలకాదిత్యుడు, అరుణాదిత్యుడు, వృద్ధాదిత్యుడు, కేశవాదిత్యుడు, విమలాదిత్యుడు, గంగాదిత్యుడు, యమాదిత్యుడు, లోలార్కాదిత్యుడు, ద్రౌపది ఆదిత్యుడని పన్నెండుమూర్తులతో కాశీలో కొలువై ఉన్నాడు.

కాశీపట్టణానికి ఉత్తరదిశలో ఉండే సూర్యునికి ఉత్తరార్కుడు అని పేరు. ఈ ఉత్తరార్కుని మాహాత్మ్యం తెలియబరిచే చక్కని ఇతిహాసం ఒకటి ఉంది. ఇది 'కాశీఖండం'లో చెప్పబడింది.

సాధారణంగా ఉదాత్తచరితులను గురించి చెప్పే సందర్భాలలో, ఆయా వ్యక్తులలో గల విశిష్టగుణాలను బట్టి



వారి వ్యక్తిత్వాన్ని విలువకట్టి అభినందిస్తారు. ఆదర్శప్రాయులుగా వారిని లోకానికి పరిచయం చేస్తారు.

మహాభారతకథలో మహాప్రస్థానపర్వంలో పాండవులు ద్రౌపది బయలుదేరి వెళుతుండగా ఒక కుక్క కూడా వారితో పాటు ప్రయాణం సాగించింది. ప్రయాణం మధ్యలోనే ద్రౌపది, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు పడిపోయారు. చివరకు ధర్మరాజు మాత్రమే మిగిలాడు కుక్క కూడా ఉంది. స్వర్గారోహణపర్వంలో ధర్మరాజు కోసం విమానం వచ్చింది. ధర్మరాజును విమానం ఎక్కి స్వర్గానికి రమ్మన్నారు. ధర్మరాజు నేను ఒక్కడినే కాదు. ఈ కుక్క నాతో పాటుగా వచ్చింది. నా భార్య సోదరులు నన్ను వదలి పోయారు. ఇంతదూరం నన్ను విడవకుండా వచ్చిన ఈ కుక్క కూడా నాతో స్వర్గానికి వస్తేనే నేను వస్తాను అని స్థిరంగా తన అభిప్రాయాన్ని చెప్పాడు. కుక్క రావడం కుదరదు అన్న వారితో, అయితే నేను కూడా రాలేను రాను అన్న ధర్మరాజు యొక్క ధర్మనిష్ఠకు మెచ్చి ధర్మదేవత ప్రత్యక్ష మయ్యాడు. ఇంతవరకు అనుసరించి వచ్చిన కుక్క ధర్మదేవతే. ఈ సంఘటనతో ధర్మరాజు వ్యక్తిత్వం లోకంలో విశేషంగా కీర్తింపబడింది.

పాండవాగ్రజుడైన ధర్మరాజు ప్రవర్తించినట్లే– ఒక మహిళామణి ప్రవర్తించింది. ఆమె కథావిశేషాలు తెలుసుకుందాము.

కాశీపట్టణంలో ఉత్తరదిశలో కొలువై ఉన్న ఉత్తరార్కతీర్థ సమీపంలో సదాచారసంపన్నుడైన, శాంతిప్రియుడు, అతిథిసేవాపరాయణుడు అయిన ప్రియవ్రతుడు అనే పేరుగల బ్రాహ్మణుడు నివసిస్తూ ఉండేవాడు. అతని భార్యపేరు శుభవ్రత. ఈ దంపతులకు మూలానక్షత్రంలో ఒక బాలిక జన్మించింది. ఆ బాలికకు ఆ దంపతులు సులక్షణ అనే పేరు పెట్టుకున్నారు. పేరుకు తగినట్లుగా చాలా సర్వలక్షణ సౌభాగ్య సంపన్న దినదిన ప్రవర్ధమానమై పెండ్లి వయస్సుకు వచ్చింది. తన కుమార్తెకు తగిన వరుడు ఎవరా? అని తండ్రి నిత్యం చింతిస్తూ – ఆ చింతతోనే మరణించాడు. తల్లి శుభవ్రత తండ్రిని అనుగమించి సహగమనం చేసింది.

అలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆ కన్యకామణి సులక్షణ ధీరోదాత్తగా ఉన్న తల్లిదండ్రులిద్దరికీ ఉత్తరక్రియలు తానే స్వయంగా చేసింది. ఆ తర్వాత తనను గురించి తాను ఆలో



బుద్ధిమంతులు కూడా పొరపాట్లు చేస్తారు

చించుకుంది. ప్రాణానికి ప్రాణమైన తల్లిదండ్రులను ఎలా మరచిపోగలను? తల్లిదండ్రులు లేని ఆడపిల్లను ఈ లోకంలో నా జీవితం ఎలా గడుపుతాను? నాకీ పుట్టుక ఆ బ్రహ్మదేవుడు ఎందుకు ఇచ్చినట్లు? కులము, శీలము, గుణము పరిశీలించి ఎవరి గురించి నన్ను నేను ఇచ్చుకోగలను? అని నిర్వేదంతో తన మనస్సు పురుషుల మీదకు పోనియ్యక బ్రహ్మచర్యవ్రత నిష్ఠతో ఉత్తరాదిత్యుని సమీపంలో ఉగ్రమైన తపస్సు చేసింది.

అలా సులక్షణ నిష్ఠతో తపస్సు చేస్తూ ఉండగా, ఒక చిన్న మేకపిల్ల వచ్చి చెలికత్తెలా ఎంతో ప్రేమతో సులక్షణతోనే జీవించసాగింది. ఆ మేకపిల్లను సులక్షణ కూడా ఎంతో ప్రేమతో సాకడం మొదలుపెట్టింది.

ఆ మేకపిల్ల రాత్రుళ్లు గరికపోచలు తిని, ఉత్తరాదిత్య కుండికలో స్నానంచేసి, పగలు నాలుగు జాములు- సులక్షణతో కూడా తిరుగుతూ కాలం గడుపుతూ ఉండేది. ఇలా జరుగుతూ ఉండగా చాలా నాళ్లకు నీలకంఠుడు ప్రత్యక్షమై సులక్షణను ఆశీర్వదించి- ఏ వరము కావాలో కోరుకోమన్నాడు. సులక్షణ విరూపాక్షునకు భక్తితో నమస్కరించి - ఇలా అంది!


**మీనకేతన దమన! యీ మేకపిల్ల**
**ప్రాణసఖి వోలె నా యొద్ద బాయకుండు**
**శర్వ! యీ నోరుమాలిన జంతువునకు**
**మొదలు వరమిమ్ము, వరమిమ్ము పిదప నాకు! - కాశీఖండం.**

జెండామీద చేపగుర్తు గల మన్మథుని భస్మం చేసిన ఓ పరమేశ్వరా! ఈ మేక పిల్ల నన్ను వదలకుండ ప్రాణసఖిలా నాతోనే ఉంటుంది. ఈ మేకపిల్ల నోరులేని జంతువు. ఏమి కావాలో నోరు తెరిచి అడగలేదు. కాబట్టి, ముందు ఈ మేకపిల్లకు వరమిమ్ము. ఆ తర్వాత నాకు వరమిమ్ము అని కోరింది.

సులక్షణ అడిగిన తీరుకు ఈశ్వరుడు ఎంతో ముచ్చట పడ్డాడు. గౌరీదేవి ఎంతగానో ఆనందించి, ఆ మేకపిల్ల మరుజన్మలో కాశీరాజు పట్టపుదేవికి కూతురుగా పుట్టగలదని వరం ఇచ్చింది. మేకపిల్ల తపస్సు చేసిన ఆ ఉత్తరాదిత్య కుండానికి ఆ నాటి నుండి 'బర్కరీ కుండము' అని పేరు వచ్చింది. బర్కరి అంటే మేక.

సులక్షణలోని ఈ ఉత్తమలక్షణాన్ని గుర్తించిన, గుణాను రాగిణి అయిన గౌరీదేవి సులక్షణను తనకు చెలికత్తెగా స్వీకరించి ఆదరించి గౌరవించింది.

తనతో పాటుగా జీవించిన మేకపిల్లకు ముందు వరం ఇమ్మని కోరిన సులక్షణ వ్యక్తిత్వాన్ని పార్వతీపరమేశ్వరులే ప్రశంసించడం విశేషం. సులక్షణ సార్థకనామధేయ.



శ్రీకృష్ణామృతం

# శ్రీకృష్ణజననం

## (అక్షరమాల)

- "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు)

అవని భారము హెచ్చే ఉయ్యాలో
ఆ హరిని వేడగ బోయే ఉయ్యాలో
ఇలను రక్కసిమూకలు ఉయ్యాలో
ఈగల్లా పెరిగేను ఉయ్యాలో

ఉతిమి గదమి జనులనణచె ఉయ్యాలో
ఊరు ఊరంతా అలిసేను ఉయ్యాలో
ఎదదల్లో భయములతో ఉయ్యాలో
ఏటికేళ్ళు గడచిపోయే ఉయ్యాలో

ఐదు(పంచ)భూతములవి
కూడా ఉయ్యాలో
ఒదిగొదిగి నడచేను ఉయ్యాలో
ఓర్వనలవి కాదు ఉయ్యాలో
ఔర్వములే నలుదిశలా ఉయ్యాలో

అందరూ గుమిగూడి ఉయ్యాలో
అహర్నిశము హరి వేడే ఉయ్యాలో

కంసుని ఆగడము ఉయ్యాలో
ఖాతరు హెచ్చాయే ఉయ్యాలో
గరుడ గమనుడే దిక్కు ఉయ్యాలో
ఘనమైన పోరుకు ఉయ్యాలో
జ్ఞానులందరూ చేరి ఉయ్యాలో

చాలా పూజల్లు చేసిరి ఉయ్యాలో
ఛత్రచామరముల నొసగి ఉయ్యాలో
జనార్ధనుని పిలిచేరు ఉయ్యాలో

ఝరి గిరిలు మ్రోగేను ఉయ్యాలో
జ్ఞాన వేదఘోషల తోడ ఉయ్యాలో

టక్కుటమార్ల రక్కసులు ఉయ్యాలో
ఠావుల్లు దప్పేను ఉయ్యాలో
డస్సి ప్రాణములుడిగే ఉయ్యాలో
ఢీకొన(గా) హరియే ఢీటౌను ఉయ్యాలో
అణువు కణమై పరమాత్మ ఉయ్యాలో



తనువు దాల్చగబూనే ఉయ్యాలో
స్థూల రూపుడై వెలసె ఉయ్యాలో

దేవకీ గర్భమున ఉయ్యాలో
ధరణిపై కృష్ణుడుదయించే ఉయ్యాలో
ధరణీధరుడుదయించే ఉయ్యాలో
ధరియిత్రి కావంగ ఉయ్యాలో
ధర్మమును కాపాడ ఉయ్యాలో
ధగ ధగ కాంతులు ఉయ్యాలో
ధాత్రి మురిసేను చూడరో ఉయ్యాలో
నిశిరాత్రి వేళల్లో ఉయ్యాలో

పసిబాలుడై వచ్చే ఉయ్యాలో
ఫణి నీడన వసుదేవుడు ఉయ్యాలో
బాలుడిని గొనిపోయె ఉయ్యాలో
భానుని తేజముతో ఉయ్యాలో
మాధవుడు భాసిల్లే ఉయ్యాలో
యశోద ఒడి చేరె ఉయ్యాలో
రవి రాక మునుపేను ఉయ్యాలో
లబ్ధ భాగ్యములేమి ఉయ్యాలో
వరమై హరి (తానె) వచ్చే ఉయ్యాలో

శతకోటి శుభములే ఉయ్యాలో
షడ్ఋతువులన్నింటా ఉయ్యాలో
సజ్జన సాంగత్యమున ఉయ్యాలో
హాయిగా హరి పెరిగే ఉయ్యాలో

తేడు వాడే గోపకులకు ఉయ్యాలో
ఱణము రక్కసులతో సలపే ఉయ్యాలో
క్షోంపిల్లె ఘనకీర్తి ఉయ్యాలో
తేచ్చిల్లె హర్షములు ఉయ్యాలో

శ్రీకృష్ణ జననము ఉయ్యాలో
శ్రీకరము శుభకరము ఉయ్యాలో



ఇతరుల దురదృష్టాన్ని, దుర్గతిని చూసి జాగ్రత్తగా ఉండడం నేర్చుకోవడం మంచిది

ఆయుర్వేదం

# అల్లంతో ఆరోగ్యం పదిలం



- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

ప్రకృతి ప్రసాదించిన గొప్ప ఆహార ఔషధం అల్లం. సంస్కృతనామ 'ఆర్ద్రకం'. జింజిబరేసి అను వృక్ష కుటుంబానికి చెందిన దీని శాస్త్రీయ నామం "జింజిబర్ అఫిషనాలిస్". అల్లాన్ని ఔషధంగా ఎలా వాడుకోవచ్చో తెలుసుకుందాం....

**జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే:** రోజు ఉదయం పరగడుపున 100 మి.లీ. వేడి నీటిలో 5 మి.లీ.ల అల్లపు రసం 5 మి.లీ. నిమ్మరసం, ఒకట్రెండు టీ స్పూన్‌ల పంచదార కలిపి కరిగించి సేవిస్తూ ఉంటే జీర్ణక్రియ సక్రమంగా జరగడంతో పాటు అరుచి, పైత్యవికారం, తల దిరగడం, గర్భిణీలలో వేవిళ్ళు తగ్గుతాయి. క్యాన్సర్ వ్యాధికి వాడే కృత్రిమ ఆధునిక ఔషధాల వల్ల కలిగే దుష్పరిణామాలైన వికారం, వాంతులు, ఆకలి లేకపోవడం, అన్న ద్వేషం, అన్నం సహించక పోవడంలాంటివి తగ్గిపోతాయి.

**బహిష్టు నొప్పి తగ్గేందుకు:** 200 మి.లీ.ల నీటిలో 2-5 గ్రాముల దంచిన అల్లం ముక్కలను వేసి కొద్దిసేపు మరిగించి, దించి గోరు వెచ్చగా ఉన్నప్పుడు వడగట్టి పంచదార కలిపి త్రాగాలి. ఇలా రోజు 2,3 సార్లు చొప్పున బహిష్టు నాలుగు రోజులు చేయాలి.

**గొంతు నొప్పికి:** రోజూ రెండు పూటల ఒకట్రెండు గ్రాముల అల్లం, ఒక లవంగం, చిటికెడు ఉప్పు కలిపి మెత్తగా నూరి చప్పరించి మింగాలి. అధ్యాపకులు, గాయిని, గాయకులు, ప్రసంగాలు చేసే వారిలో వచ్చే గొంతు బొంగురు కూడా ఈ ఔషధ సేవనం వల్ల తగ్గుతుంది.

**వివిధ రకాల జ్వరాలకు:** రోజు మూడు పూటలా పూటకు 10 మి.లీ. అల్లం రసం, 10 మి.లీ. తులసీరసం, 5 మి.లీ. తేనె కలిపి తీసుకుంటే మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, చికున్‌గున్య లాంటి వివిధ రకాల జ్వరాలు త్వరగా తగ్గుతాయి.

**గ్యాస్ట్రిక్ ట్రబుల్‌కు:** ఇంగువ ముక్కల్ని కొద్దిగా నెయ్యి వేసి వేయించి చేసిన చూర్ణం 25 గ్రాములు, వామును వేయించి చేసిన చూర్ణం 25 గ్రాములు, ఉప్పు 25 గ్రాములు, యాలకల పొడి 25 గ్రాములు, అల్లంరసం 50 గ్రాములు తీసుకొని వీటన్నింటిని కలిపి మెత్తగా నూరి ఎండలో బాగా ఎండించి బాగా నూరి నిల్వ ఉంచుకొని రోజూ రెండు పూటల పూటకు 2 గ్రాముల పొడిని 100 మి.లీ.ల గోరువెచ్చని నీటిలో కలిపి సేవిస్తు ఉంటే పొట్టలో గ్యాస్ చేరడం, కడుపు ఉబ్బరం, పొత్తి కడుపు నొప్పి, త్రేన్పులు లాంటి గ్యాస్ట్రిక్ ట్రబుల్ లక్షణాలు తగ్గి ప్రేగుల కదలికలు క్రమబద్ధం అయి విరేచనం అవుతుంది.


**ఉబ్బసవ్యాధి తీవ్రత తగ్గేందుకు:** రోజూ రెండు మూడు సార్లు పూటకు 100 మి.లీ. పల్చటి వేడి పాలలో 10 మి.లీ. అల్లం రసం, 3,4 చిటికెల మిరియాల పొడి కలిపి సేవిస్తూ ఉంటే ఉబ్బస వ్యాధి తీవ్రత తగ్గుతుంది.

**కాళ్ళవాపులు కీళ్లనొప్పులు తగ్గేందుకు:** 200 గ్రాముల కరక్కాయ పెచ్చులని, 4,5 సార్లు వడగట్టిన తగినంత గోవు మూత్రంలో కలిపి ఎండలో ఎండించిన పిదప తగినంత అల్లపు రసం కలిపి మరల బాగా ఎండించి దంచి చూర్ణం చేసుకొని రోజూ రెండు పూటల పూటకి ఒకట్రెండు గ్రాముల పొడిని 100 మి.లీ. గోరు వెచ్చని నీటిలో కలిపి సేవిస్తూ ఉండాలి.

100 మి.లీ. అల్లపు రసాన్ని 200 మి.లీ. నువ్వుల నూనెలో కలిపి సన్నని మంటపై నీరు ఇరిగిపోయి నూనె మాత్రమే మిగిలేంత వరకు అంటే నురుగు వచ్చే దాకా మరిగించి దించి అందులో 20 గ్రాముల హారతి కర్పూరం పొడి కలిపి మూత పెట్టి చల్లార్చిన పిదప వడగట్టి వుంచుకొని రోజూ ఒకట్రెండు సార్లు సున్నితంగా మర్దన చేస్తుంటే కీళ్ళ నొప్పులతో పాటు, కండరాల నొప్పులు, వీపు నొప్పి, మెడ నొప్పి, భుజంనొప్పి, నడుం నొప్పిలాంటి వివిధరకాల నొప్పులు తగ్గిపోతాయి.

**పార్శ్వపు తలనొప్పికి:** రోజూ ఉదయం, సాయంత్రం పూటకు 50 మి.లీ. గోరువెచ్చని నీటిలో 10 మి.లీ.ల అల్లం రసం, అర టీస్పూను బెల్లం పొడి కలిపి కరిగించి త్రాగుచుండాలి.

విశ్వదాభిరామం    వేమన పద్యసూక్తి



## ఆశ అనర్థం

నీళ్లలోనిచేప నెఱి మాంస మాశకు
గాలమందు జిక్కి కూలినట్లు,
ఆశ బుట్టి మనుజు డారీతి జెడిపోవు;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** నెఱి= ఉత్సాహంతో; మాంసమాశ= మాంసం మీద కోరిక; గాలము= చేపల పట్టే చిన్న ఇనుపసాధనం; మనుజుడు= మనిషి.

**భావం:** నీటిలో జీవించేచేప మాంసంమీద ఆశతో ఉత్సాహంగా వెళ్లి, గాలంలో చిక్కి చస్తుంది. అదే విధంగా ఆశ కలిగినమనిషి చెడిపోతాడు.

**వివరణ:** ఆశ పాశం(తాడు)లాంటిది. ఆశపడ్డవాళ్లను ఆపాశం బంధిస్తుంది. అది పట్టుకొన్నవాణ్ణి అంత సులభంగా వదలిపెట్టదు. ఆశపడ్డాడో, వాడికి ఒక్కటుంటే వంద కావాలనిపిస్తుంది. వందఉంటే లక్ష కావాలనిపిస్తుంది. ఆ తర్వాత రాజ్యం కావాలనిపిస్తుంది. ఆపైన వాడికి లభించేది నరకమే! నీళ్లలో ఉండే చేపకు ఆనీళ్ల లోనే కావలసినంత ఆహారం ఉంటుంది. కాని అది మాంసంకోసం ఆశపడి గాలానికి చిక్కు కుంటుంది. ప్రాణమే పోగొట్టుకుంటుంది. ఆలోచనాశక్తి కలిగినమానవుడు చేపలాగా ఏదో కావాలనే ఆశకు లోబడకుండ ఉన్న దానితో సంతృప్తిపడుతూ సుఖంగా జీవించాలని తాత్పర్యం.

- కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

## 73 వైకుంఠపాళి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | ■ | 3 | ■ | 4 |
| | ■ | | ■ | ■ | ■ | | ■ | |
| 5 | | ■ | 6 | | | ■ | 7 | |
| ■ | ■ | 8 | ■ | | ■ | 9 | ■ | |
| 10 | | | | ■ | 11 | | | ■ |
| | ■ | | ■ | 12 | ■ | | ■ | 13 |
| 14 | | ■ | 15 | | | ■ | 16 | |
| | ■ | 17 | ■ | | ■ | 18 | ■ | |
| | ■ | 19 | | | ■ | 20 | | |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)రావణుని కుమారుడు (5); 5)తండ్రి(2); 6)గాంధారి తోబుట్టువు (3); 7)రక్షించు (2); 10)యయాతి భార్య (4); 11)మన్మథుడు (3); 14)ప్రాచీన భారతంలో ఒక రాజు (2); 15)కుమారస్వామి (3); 16)బాధ (2); 19)ఇంద్రుని కూతురు (3); 20)విష్ణుమూర్తి యొక్క ఎడమకన్ను (3)

### నిలువు

1)శంతనుని సోదరుడు (3); 2)ఒడ్డు (2); 3)శూర్పణఖ తల్లి (2); 4)భీష్ముని పేరు (4); 8) ఇక్కడ బ్రహ్మ అనేక క్రతువులు చేశాడు (3); 09)భగీరథుని పుత్రుడు (3); 12)మాంధాత భార్య (4); 13)సప్తర్షులలో ఒకడు (4); 17)స్త్రీ (2); 18)పార్వతి అవతారం తిరగబడింది (2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



అయితే గొప్ప వ్యక్తులు మాత్రమే తమ తప్పుల్ని, పొరబాట్లని అంగీకరిస్తారు

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-13

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య    నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | | | | |
|---|---|---|---|---|---|
| प्रयाणम् | = పయనము-ను | दिवा | = పగలు | दौष्ट्यं | = అల్లరి-ని |
| तथाऽपि | = అయినప్పటికి | भिक्षाटनम् | = భిక్షాటనము-ను | सर्वथा | = బొత్తుగా |
| अकुर्वन् | = చేసిరి | अकुरुत् | = చేసితిరి | अकुर्म | = చేసితిమి |

**అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?**

01) त्वं ह्यः नक्तं कुत्र प्रयाणमकरोः?
02) बालकाः दौष्ट्यं कुर्वन्ति।
03) ते कुत्रापि नासन्।
04) तथाऽपि एते पाकं अकुर्वन्।
05) ब्राह्मणाः भिक्षाटनं कुर्वन्ति।
06) अद्य पाकः कथमस्ति?
07) अद्य व्यापारं वयमेव अकुर्म।
08) तथाऽपि ते केऽपि अत्र न सन्ति।
09) अद्य दिवा सर्वथा त्वं अत्र नासीः।
10) अद्य पाकं यूयमेव अकुरुत किम्?

**అ) జవాబులు**

01) నీవు నిన్న రాత్రి ఎక్కడకు పయనమును చేసితివి?
02) బాలకులు అల్లరి చేయుచున్నారు.
03) వారు ఎక్కడా లేకుండిరి.
04) అయినప్పటికి వీరు వంట చేసిరి.
05) బ్రాహ్మణులు భిక్షాటనమును చేయుచున్నారు.
06) ఇవ్వేళ వంట ఎట్లున్నది?
07) ఇవ్వేళ వ్యాపారమును మేమే చేసితిమి.
08) అయినప్పటికి వారు ఎవరూ ఇక్కడ లేరు.
09) ఇవ్వేళ ప్రొద్దున బొత్తుగా నీవు ఇక్కడ లేకుంటివి.
10) ఇవ్వేళ వంట మీరే చేసితిరా ఏమిటి?

**ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?**

01) నేనెక్కడికిని పయనము చేయలేదు.
02) మీరేనా వంటను చేసినది?
03) మేము కాదు, ఎవరో చేసినారు.
04) ఇతరులు బ్రాహ్మణులున్నారు.
05) వారెవరు?
06) వీరే.
07) నిన్న పిల్లలు అల్లరి చేసిరి.
08) నీవు భిక్షాటనమును చేసితివా?
09) నీవిట్లుండుము.
10) నేను నమస్కారమును చేయుచున్నాను.

**ఆ) జవాబులు**


01) अहं कुत्रापि प्रयाणं न अकरवम्।
02) यूयमेव पाकं अकुरुत किम्?
03) वयं न, ये केऽपि अकुर्वन्।
04) अन्ये ब्राह्मणाः सन्ति।
05) ते के?
06) एते एव।
07) ह्यः बालकाः दौष्ट्यं अकुर्वन्।
08) त्वं भिक्षाटनमकरोः किम्?
09) त्वं एवं भव।
10) अहं नमस्कारं करोमि।

చిత్ర కథ

# కల్యాణ వేంకటేశ్వరుడు

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.తులసీప్రసాద్




12 ఇద్దరూ వెళ్ళి అగస్త్యునికి నమస్కరించారు. మహర్షి వాళ్ళని ఆశీర్వదించి...
13 శ్రీనివాసా! నూతన వధూవరులు కనీసం ఆరునెలల పాటు పుణ్యక్షేత్రాల్ని దర్శించకూడదు
14 అంటే...
15 మీరిప్పుడు శేషాచలానికి వెళ్ళకూడదు
16 అలాగే....
17 మీరిద్దరూ ఈ ఆరునెలలూ నా ఆశ్రమంలోనే ఉండండి!
18 అలాగే...
19 ఆశ్రమంలోనే ఉంటూ కల్యాణీనదీతీరంలోని పల్లెలో ప్రకృతిని చూస్తూ విహరిస్తూ ఆరు నెలలు గడిపారు ఆ దంపతులు.
20 పద్మా! శేషాచలానికి వెడదాం. కొండెక్కి రాలేని భక్తులు ఇక్కడే నిన్ను దర్శించవచ్చు
21 ఇది వరమే నాథా!
22 పెళ్లికాని వాళ్ళకి నన్ను దర్శిస్తే పెళ్లి అవుతుంది. ఇది నా రెండోవరం పద్మా!
23 ఆ దంపతులు మెట్లు ఎక్కి కొండమీదికి చేరారు. అవి 'శ్రీవారిమెట్లు' అయ్యాయి. వాళ్లు విహరించిన ఆ పల్లె 'శ్రీనివాసమంగాపురం' అయింది. స్వామి 'శ్రీకల్యాణవేంకటేశ్వరుడు' అయ్యాడు.
సర్వే జనాః సుఖినో భవన్తు!




# కృష్ణయ్య నిజాయితీ


– శ్రీమతి ఎన్.రత్నావతీ రామారావు

పూర్వం బృందావన ప్రాంతంలో గిరివ్రజపురం అనే ఊరు ఉండేది. ఆ ఊరులో దేవయ్య, గిరిజమ్మ అనే దంపతులు ఉండేవారు. గిరిజమ్మ మహాకృష్ణభక్తురాలు. వారికి చాలా కాలానికి అవిటివాడైన కొడుకు పుట్టాడు. ఆ పిల్లవానికి కృష్ణయ్య అని పేరు పెట్టుకున్నారు. కృష్ణయ్యకు పురాణాల్లోని కథలు చెప్తూ మంచిమార్గంలో పెంచింది తల్లి.

కృష్ణయ్యకు చదువు ఒంటపట్ట లేదు. కానీ, తల్లి పెంపకంలో మంచి సంస్కారవంతుడయ్యాడు. రోజూ ఉదయాన్నే లేవగానే తల్లిదండ్రులకు నమస్కరించి, దేవుని స్మరిస్తూ గోవులను మేతకి తీసుకువెళ్ళి సాయంత్రం తిరిగి వచ్చేవాడు. వాడి ప్రవర్తనకు సంతోషించినా, వాడి అవిటితనం చూసి బాధపడే వారు.

కొంతకాలానికి పెద్దవారైన తల్లిదండ్రుల పరిస్థితిని చూసి వారిని సుఖపెట్టలేకపోతున్నానని కృష్ణయ్య బాధపడేవాడు. సుఖపెట్టాలంటే డబ్బు కావాలి. ఎలా సంపాదించాలి? భగవంతుడా! నాకా కాలులేదు అని అనుకుని, ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పుకుని విచారపడేవాడు కృష్ణయ్య.

అది విన్న తల్లిదండ్రులు "చూడు నాయనా! మా సుఖం కోసం నీవు ఎలాంటి చెడ్డపనులు చేయవద్దు. అన్నిటికి ఆ పరమాత్మే ఉన్నాడు. ఆయనే మనల్ని కాపాడుతాడు" అని చెప్పేవారు. ఒకరోజు యథాప్రకారం గోవులను మేతకు తోలు కొని వెళ్ళాడు కృష్ణయ్య.



చీకటి పడుతోంది. ఏ విధంగా డబ్బు సంపాదించాలా? అని ఆలోచనలో మునిగిపోయాడు.

బాగా రాత్రయిపోయింది. ఎంత ఆలోచించినా కృష్ణయ్యకు ఏ దారి కనపడలేదు. 'ఈరోజు ఎలాగైనా ఏదో ఒకదారి చూపించు భగవంతుడా! అంతవరకు ఇంటికి వెళ్ళను' అని భగవంతుని ప్రార్థిస్తూ కూర్చున్నాడు.

ఇంతలో కొందరు దొంగలు, వాళ్ళు ఒక షావుకారు ఇంటిలో దోచుకున్న సొమ్ము గురించి తానున్న చెట్టు క్రిందనే కూర్చుని, వారిలో వారు వాదించుకొంటున్నారు.

ఇదంతా చెట్టుపై పొదలచాటున ఉన్న కృష్ణయ్య చూస్తూ వారి మాటలు విన్నాడు. పాపం షావుకారు తన సంపద పోయిందని తెలుసుకొని ఎంత బాధపడుతున్నాడో? ఇపుడు నేనేమి చెయ్యవచ్చు? అనుకొన్న కృష్ణయ్యకు చెట్టు చివర ఉన్న పెద్ద తేనెపట్టు కనిపించింది.

దొంగలు వాదులాడుకోవడం, చూసిన కృష్ణయ్య అక్కడ రాళ్ళు తీసుకొని ఆ తేనెపట్టును చెదరగొట్టాడు. అంతే ఆ తేనెతుట్టె దొంగలమీద పడి, వాళ్ళను పట్టి కుట్టి వేయడంతో వారు బాధతో, దొంగిలించిన సొమ్మును అక్కడే విడిచి పారి పోయారు.

ఆ డబ్బులను తీసుకొని వచ్చిన మూటతో కృష్ణయ్య వారి తల్లిదండ్రులు షావుకారి ఇంటికి వెళ్ళి జరిగిన విషయం వివరంగా చెప్పి, "అయ్యా, షావుకారు గారు! పోయిన మీ సొమ్ము భద్రంగా ఉందో, లేదో చూసుకోండి" అన్నారు.

షావుకారు పోయిన సొమ్ము భద్రంగా దొరికినదన్న సంతోషంతో "దేవయ్య గిరిజమ్మా! మీ కొడుకు అవిటివాడైనా చదువు లేకపోయినా గొప్ప సంస్కారవంతుడు. బుద్ధిమంతుడు. ఇందులో సగం సొమ్ము, మీరు చేసిన ఉపకారానికి కృష్ణయ్యకు బ్రతుకుతెరువు కోసం కృతజ్ఞతగా ఇస్తున్నాను." అని అన్నాడు షావుకారు.

న్యాయం, ధర్మంగా కృష్ణయ్య వ్యాపారం చేసుకొంటూ కొద్దికాలంలోనే లక్షాధికారి అయ్యాడు. తన తల్లి నమ్ముకున్న శ్రీకృష్ణభగవానునికి మందిరం కట్టించాడు. అంతా ఆ భగవంతుని కృప వల్లే జరిగిందని అందరూ సంతోషించారు.

*నీతి: భగవంతుని నమ్ముకున్నవారికి కష్టాలు ఉండవు.*

# దాసరందరే... పురందరదాసరయ్య

- ఆచార్య ఎస్.గంగప్ప

## శ్రీనివాసుడు పురందరుడైనాడు

వరదప్పనాయకునకు కమలాంబకు 1470లో అపురూపంగా పుత్రజననం అయింది. అతనికి తల్లిదండ్రులు 'శ్రీనివాస నాయక' అని నామకరణం చేశారు. శ్రీని వాస నాయకుడు సర్వసంపదల్ని వదలి పెట్టి నిరుపేద తనాన్ని వరించాడు. భగ వంతుని నామస్మరణచేస్తూ వ్యాసరాయ లను ఆశ్రయించాడు. వ్యాసరాయల ఉప దేశం పొంది *'పురందరవిఠల'* అనేముద్రతో పదరచన చేయనారంభించడంవల్ల పురం దరదాసు అనే పేరు సార్థకమైంది. అప్పటి నుంచి పురందరదాసు కన్నడభాషలో ఉత్తమ వాగ్గేయకారుడిగా ప్రసిద్ధికెక్కాడు.

## పురందరపల్లెలో ....

శ్రీనివాసుని స్వగ్రామం పురందర ఘడం. ఇది పూనా సమీపంలో ఉంది. ఈనాడు ఇది మహారాష్ట్రలో ఉన్నా, పూర్వం కర్ణాటరాజుల పాలనలోనే ఉంది. ఆ ప్రాంతంలో ఆనాడు చాలవరకు కన్నడమే వాడుకభాష.

## పదరచనతో ప్రఖ్యాతి

పురందరదాసు భక్తి, వైరాగ్యాల్ని వివ రిస్తూ నాలుగు లక్షల డెబ్భై అయిదువేల పదాలు రచించాడు. కానీ ఈనాడు కొన్ని వందల పదాలు మాత్రమే లభిస్తున్నాయి. ఈ పదరచనతో పురందరదాసు ఉత్తమ పదకర్తగా ప్రసిద్ధికెక్కాడు. ఇందుకు వ్యాస రాయలే కారణం. ఈ వ్యాసరాయలు శ్రీపాదరాయలనే గురువు వల్ల ఉపదేశం పొందినాడు. శ్రీపాదరాయలు ఈనాడు కర్ణాటకలోని కోలారుజిల్లా ముళబాగళ్‌కు చెందినవాడు. వీరిద్దరు తత్త్వజ్ఞులు, విద్వాంసులు, సాధువులు. బ్రహ్మసూత్రాల ఆధారంతో కన్నడభాషలో పదరచనద్వారా మధ్వాచార్యుని ద్వైతమత ప్రచారం గావిం చిన మహానుభావులు. వ్యాసరాయలు 'శ్రీకృష్ణ' ముద్రతోను, శ్రీపాదరాయలు 'రంగవిట్ఠల' ముద్రతోను పదరచన చేస్తూ వచ్చారు. పురందరదాసు కన్నడంలో సామాన్య ప్రజలకోసం పదరచన చేసి ప్రచారం చేయనారంభించాడు.



## దాసరందరే పురందరదాసరయ్య

దేవునినామాలు పాడుకుంటూ యాచన చేస్తూ పురందరదాసు సంసారం సాగిస్తూ వచ్చాడు. ఆతని పదాలు ప్రామాణికమై ఒప్పుతున్నాయి. వేదశాస్త్ర, పురాణాల్లోని విద్యావివేకాల్ని, ప్రజ్ఞాప్రాభవాల్ని తన పదాల్లో ప్రకటించాడు. పురందరదాసు చెప్పినవీ, రచించినవీ అన్నీ గుణంలోనూ, మౌలికతలోను ఉపనిషత్తుల సారానికి తీసిపోలేదు. ఇది సామాన్య ప్రజలకోసం చేసిన ప్రయత్నం. ఈ పదాలకు అచిర కాలంలోనే 'పురందరోపనిషత్తు' అని ప్రసిద్ధి వచ్చింది. అందుకే *"దాసరందరే పురందర దాసరయ్య"* అని గురువు వ్యాస రాయల మెప్పునకు పాత్రుడయ్యాడు.

తాను స్వీకరించిన దాసవృత్తివల్ల పలు కష్టాల్ని ఎదుర్కోవలసివచ్చింది. అయితే శ్రీకృష్ణుని అనుగ్రహంతో వాటిని సంతోషం తోనే ఎదుర్కొన్నాడు. ఆ కష్టాలు కష్టాలని పించలేదు. పైపెచ్చు దేశకాల పరిస్థితు లకు సంబంధించిన అడ్డంకులన్నీ తొలగి పోయి శ్రీకృష్ణుని సన్నిహితత్వం ఏర్పడి, సౌఖ్యం లభించింది. ఆతనిలోని అహం కారం నశించిపోయింది. అచిరకాలంలోనే అనుకున్న దానికంటే ఎక్కువగా జీవితానికి శాంతి లభించింది. ధనధాన్యాలు ముఖ్యం కాదు. భగవద్భక్తి ప్రధానం. బ్రతకటానికి మాత్రమే ఆహారం అవసరం. అంతకు మించి అక్కరలేదు-అనే విషయాన్ని తన జీవితమే సాక్షిగా నిరూపించినవాడు పురం దరదాసు. తాను నమ్మిన సిద్ధాంతాల్ని సామాన్య ప్రజలలో ఆడి పాడుకోడానికి వీలుగా ప్రజలభాషలో ప్రచారంచేసి, సమాజాన్ని ఉత్తేజపరచిన మహాను భావుడు. మానవుల జీవితాల నుద్ధరించిన భక్తాగ్రేసరుడు. పురందరదాసుకు సంప దలపై వ్యామోహం లేదని తెలుపు తున్నాయి. ఇదే రీతిని భగవంతుని తన దాసునిగా జేసుకొన్న సంఘటనలు కొన్ని ఆయన జీవితంలో లేకపోలేదు. అనేక పర్యాయాలు వ్యాసరాయలతో పాటు తిరుపతికి వస్తూపోతూ ఉండేవాడు పురం దరదాసు. ఇతడు తిరుపతిలో సంకీర్తనా చార్యుడుగా ప్రసిద్ధిపొందిన అన్నమా చార్యుని సందర్శించి శ్రీవేంకటేశ్వరునిగా భావించి కీర్తించాడట. అదేరీతిని అన్నమా చార్యుడు సైతం పురందరదాసును పురం దర విట్ఠలుని అపరావతారంగా తలంచి ప్రస్తుతించాడట. సామాన్యులకు తెలియక పోయినా ఆ మహానుభావులకు మాత్రమే పరస్పర మహిమలు గోచరించాయని మనం గ్రహించవలసి ఉంది.

హరేశ్రీనివాస

# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

నిర్వహణ: డా॥ అల్లాడి సంధ్య

## కదంబం

### నవవిధ శక్తులు

01) ప్రభ
02) మాయ
03) జయ
04) సూక్ష్మ
05) త్రిశుద్ధ
06) నందిని
07) సుప్రభ
08) విజయ
09) సిద్ధిద

### పిల్లలూ..జతచేయండి!!

| | |
|---|---|
| 1) ఆండాళ్ | అ) తిరుచ్చంద విరుత్తం |
| 2) నమ్మాళ్వార్ | ఆ) తిరుపల్లాండు |
| 3) పెరియాళ్వార్ | ఇ) తిరుప్పావై |
| 4) కులశేఖరాళ్వార్ | ఈ) తిరువిరుత్తమ్ |
| 5) తిరుమళిశై ఆళ్వార్ | ఉ) పెరుమాళ్ తిరుమొళి |

జవాబులు: 1-(ఇ); 2-(ఈ); 3-(ఆ); 4-(ఉ); 5-(అ)





### మీకు తెలుసా?

1) వామనావతారం దశావతారాల్లో ఎన్నవది ?
2) కులశేఖరప్పడి అంటే శ్రీవారి ఆలయంలో?
3) స్వామి ధరించే చక్రాయుధం పేరు?
4) భాస్కరక్షేత్రంగా పిలువబడిన క్షేత్రం?
5) తిరుచానూరు అమ్మవారి ఆలయంలో జరిగే పూజావిధుల విధానం?
6) స్వామి ధరించే గదాయుధం పేరు?
7) కపిలతీర్థాన్ని ఈ పేరుతో కూడా పిలుస్తారు.

జవాబులు:
1) మూడవది
2) గర్భగుడి గడప
3) సుదర్శనం
4) తిరుచానూరు
5) పాంచరాత్రం
6) కౌమోదకి
7) ఆళ్వార్ తీర్థం

### కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

కృ నా తో క్షం స్తి ర్భి దు షి

జవాబు:
కృషితో నాస్తి దుర్భిక్షం

### చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...

Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

### తిరుమల తిరుపతి దేవస్థానములు

## తిరుపతి
# శ్రీ కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

**2022 ఫిబ్రవరి 21నుండి 2022 మార్చి 03 వరకు**



**21-02-2022 సోమవారం**
రాత్రి: మూషిక వాహనంపై వినాయక స్వామి అంకురార్పణ

**22-02-2022 మంగళవారం**
పగలు: పల్లకీ ఉత్సవం, ధ్వజారోహణం
రాత్రి: హంసవాహనం

**23-02-2022 బుధవారం**
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**24-02-2022 గురువారం**
పగలు: భూత వాహనం
రాత్రి: సింహ వాహనం

**25-02-2022 శుక్రవారం**
పగలు: మకర వాహనం
రాత్రి: శేష వాహనం

**26-02-2022 శనివారం**
పగలు: అధికారనంది వాహనం
రాత్రి: తిరుచ్చి ఉత్సవం

**27-02-2022 ఆదివారం**
పగలు: వ్యాఘ్ర వాహనం
రాత్రి: గజవాహనం

**28-02-2022 సోమవారం**
పగలు: కల్పవృక్ష వాహనం
రాత్రి: తిరుచ్చి ఉత్సవం

**01-03-2022 మంగళవారం**
పగలు: రథోత్సవం
రాత్రి: నందివాహనం (మహాశివరాత్రి)

**02-03-2022 బుధవారం**
పగలు: పురుషామృగ వాహనం
రాత్రి: కల్యాణోత్సవం, అశ్వ వాహనం

**03-03-2022 గురువారం**
పగలు: సూర్యప్రభవాహనంలో నటరాజస్వామి, త్రిశూలస్నానం
రాత్రి: ధ్వజావరోహణం, రావణాసుర వాహనం





SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-01-2022 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

## శ్రీనివాసమంగాపురం

# శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

## 2022 ఫిబ్రవరి 19 నుండి 28 వరకు

